నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 21-3-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:177 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

పని విద్య వైద్యం
ముఖ్యమైనవి మూడు
ఎక్కడ చూడు

వెల్గుల గుడి
జ్ఞానామృత ఖజానా
పుస్తక మేళ

బడి పిల్లలు
అంబలి అన్నార్థులు
పేగుల గోల.

వేగు కేంద్రాలు
నింగినిండా రాకెట్లు
ఆకాశ రణం.

నోటు ఉవాచ
నాపుట్టుక నీకష్టం
నాకోసం పాట్లు

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనివాస్

పగబట్టి దెబ్బ తీయు
ప్రకృతికి అదో చెడుగుణం !
వెంటబడీ చంపుతుంది
ఏమౌతుందో ఆక్షణం !

వెంటబడ్డ యమదూతలు
వడగండ్ల విషపు వానలు !
గాలికెగిరెగిరి పోతూ
అమాయకపు పసికూనలు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

వర్షపాతం తగ్గడంతోనే నీటి కష్టాలు-మంత్రి పొన్నం

-గత ఏడాది వర్షపాత వివరాలు అందిస్తాం
-మేం అధికారంలోకి వచ్చేసరికి వానకాలం పోయింది.
-నీటి కష్టాలు తెలంగాణ అంతటా ఉంది
-తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం..
-మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

కరీంనగర్, మార్చి 20: నీటి ఎద్దడికి వర్షపాతం తగ్గడమేనని అన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్ బిఆర్ ఎస్ అధికారం ఉన్న కాలం లోనే వర్షాలు సరిగా పడలేదని, తాము అధికారంలోకి వచ్చేసరికి వర్షకాలం వెళ్లిపోయిందన్నారు.. పోయిన సెప్టెంబర్ లో పడాల్సిన వర్షాలు పడలేదని అంటూ. 2022 -23 వెదర్ రిపోర్ట్ ప్రజలకు తెలియ జేస్తామన్నారు. కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పంట నష్టం గురుంచి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

తాగు నీటి సమస్య లేకుండా చూస్తాం..

హైదరాబాద్ నగర తాగు నీటి అవసరాలకు సింగూర్ నుండి 18 శాతం, గోదావరి నుండి 35 శాతం కృష్ణా నుండి 45 శాతం ,ఉస్మాన్ సాగర్ నుండి 4 శాతం నీటిని వాడుతున్నామని క్లారిటీ ఇచ్చారు. నాగార్జున సాగర్ లో 510 అడుగుల నీళ్లు ఉన్నవి, అవసరమైతే బూస్టర్ పైప్ ల ద్వారా వాటర్ తరలిస్తామన్నారు. ఎల్లం పల్లి నుండి కూడా 3 టీఎంసీలు హైదరాబాద్ నగరానికి తరలిస్తున్నామని తెలిపారు. కరవు ఎదుర్కోవడానికి ప్రతి పక్షాలు సహకరించాలని కోరారు,

రాజకీయ స్టార్టప్‌లు లాంఛ్ చేయాలని చూశారు

– స్టార్టప్ మహాకుంభ్ వేదకగా రాహుల్‌పై మోదీ సెటైర్లు

న్యూ డిల్లీ మార్చ్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అంకురాల (స్టార్టప్‌లు) అభివృద్ధి, వ్యాపార ఐడియాలపై మేథోమథనం సాగించేందుకు ఢిల్లీలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న స్టార్టప్ మహాకుంభ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. చాలా మంది రాజకీయ స్టార్టప్‌లను లాంఛ్ చేయాలని పలుమార్లు ప్రయత్నించారని కానీ వారికి, మీకు (నిజమైన స్టార్టప్‌ల) మధ్య వ్యత్యాసం ఏంటంటే మీరు నూతన ఆలోచనల వెంట పరుగులు పెడుతుంటారని రాహుల్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు.మీ స్టార్టప్ ఆలోచన విఫలమైన అనంతరం మీరు మరిన్ని నూతన ఆలోచనలకు పదును పెడుతుంటారని అన్నారు. భారత్ సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటోందని వినూత్న రీతిలో అభివృద్ధి దిశగా పురోగిస్తోందని ప్రధాని పేర్కొన్నారు. ఇవాళ భారత్‌లో ఉత్సాహం, సానుకూల శక్తి వెల్లడవుతోందని, స్టార్ట్‌ప్‌ను కలియతిరుగుతూ మీ ఆవిష్కరణలను చూసిన అనంతరం భారత్ రాబోయే రోజుల్లో ఎన్నో యూనికార్న్‌లు, డెకాకార్న్‌లకు వేదిక కానుందని భావిస్తున్నానని అన్నారు.భారత్‌లో ప్రస్తుతం వినూత్న అవకాశాలు వృద్ధి చెందుతున్నాయని, స్టార్టప్ కల్చర్ పెరుగుతున్నదని ప్రధాని వివరించారు. దేశంలో స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని చెప్పారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ కేంద్రమని, దేశంలో 1.25 లక్షలకు పైగా నమోదిత స్టార్టప్‌లున్నాయని, ఇందులో 110 యూనికార్న్‌లు కాగా స్టార్టప్‌ల్లో 12 లక్షల మందికి పైగా ఉద్యోగులున్నారని ప్రధాని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం



హైదరాబాద్ మార్చ్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం చేశారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ప్రస్తుతం జార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రాధాకృష్ణన్‌కు కేంద్రం తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. దాంతో ఇవాళ ఆయన ప్రమాణస్వీకారం చేశారు.తెలంగాణతోపాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా రాధాకృష్ణన్ అదనపు బాధ్యతలు స్వీకరించనున్నారు. తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న తమిళిసై రాజీనామా చేయడంతో ఆ రెండు పదవులు ఖాళీ అయ్యాయి. తమిళనాడు నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీపడే ఉద్దేశంతో తమిళిసై గవర్నర్, లెఫ్టినెంట్ గవర్నర్ పదవులను వదులుకున్నారు. దాంతో జార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణన్‌కు కేంద్రం అదనపు బాధ్యతలు కట్టబెట్టింది.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, రైతు ప్రభుత్వం.. మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, మార్చి 20:కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, రైతు ప్రభుత్వమని, రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఇవాళ ఆయన నల్గొండ జిల్లాలో పర్యటించారు. గూడూరు, వెంకటాద్రిపాలెం గ్రామాలలో నూతనంగా నిర్మించిన ఆలయాలలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. అకాల వర్షాలతో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందిస్తామన్నారు. ధాన్యానికి రైస్ మిల్లర్స్ మద్దతు ధర చెల్లించకుంటే మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇది ప్రభుత్వం రైస్ మిల్లర్లను అన్ని రకాలుగా ఆదుకున్నప్పుడు రైతులకు మేలు చేయడానికి ప్రయత్నం చేయాలన్నారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. అవసరమైతే ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని క్లారిటీ ఇచ్చారు.

ఏప్రిల్ 19న పోలింగ్ తొలి విడత ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదల

న్యూ డిల్లీ మార్చ్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఏప్రిల్ 19న పోలింగ్ జరగనున్న లోక్‌సభ తొలి విడత ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ జారీతో ఇవాళ్టి నుంచే నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభం కానుంది. బీహార్ మినహా తొలి విడత లోక్‌సభ ఎన్నికలు జరిగే మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నామినేషన్ దాఖలుకు ఈ నెల 27 వరకు అవకాశం ఇచ్చారు. బీహార్‌లో మాత్రం మార్చి 28 వరకు నామినేషన్‌ల దాఖలుకు అవకాశం కల్పించారు.బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్చి 28న నామినేషన్‌ల స్క్రూటినీ నిర్వహించనున్నారు. బీహార్‌లో మార్చి 30న నామినేషన్‌ల స్క్రూటినీ జరగనుంది. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్చి 30 నామినేషన్‌ల ఉపసంహరణకు తుదిగడువు. బీహార్‌లో నామినేషన్‌ల ఉపసంహరణకు ఏప్రిల్ 2 వరకు అవకాశం ఇచ్చారు. జూన్ 6తో సాధారణ ఎన్నికల ప్రక్రియ సంపూర్ణంగా ముగియనుంది.తొలి విడతలో 17 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అందులో తమిళనాడులోని మొత్తం 39 స్థానాలు, రాజస్థాన్లోని 12 స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లోని 8 స్థానాలు, మధ్యప్రదేశ్‌లోని 6 స్థానాలు, ఉత్తరాఖండ్, అసోం, మహారాష్ట్రల్లోని ఐదేసి స్థానాలు, బీహార్‌లోని నాలుగు స్థానాలు, పశ్చిమబెంగాల్‌లోని మూడు స్థానాలు, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ రాష్ట్రాల్లోని రెండేసి స్థానాలు, ఛత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్ దీవులు, జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిల్లోని ఒక్కో స్థానం ఉన్నాయి.లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్, జూన్ 1న తుది విడత పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోపాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి.

చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

అమరావతి, మార్చి 20:ఓ డ్రైవర్ నిర్లక్ష్యం చిన్నారి పాలిట శాపంగా మారింది. అభం శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిని స్కూల్ బస్సు రూపంలో మృత్యువు కబలించింది. పాలచర్ల గ్రామంలో ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న బండి శ్రీవల్లి(4) అనే చిన్నారి మృతి చెందింది. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం పాలచర్ల గ్రామంలో ఘటన చోటుచేసుకుంది.స్కూల్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందగా.. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చిన్నారి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారి మధ్యాహ్నం భోజన సమయంలో మరో ఇద్దరు చిన్నారులతో కలిసి ఆయా సహాయంతో మూత్ర విసర్జనకు బయటకు వచ్చింది. బాలిక వెంట వచ్చిన ఇద్దరు చిన్నారులు ముందుగా మూత్ర విసర్జన అనంతరం కేంద్రానికి బయలుదేరి వెళ్లారు. వారికోసం ఆయా చిన్నారి శ్రీవల్లిని వదిలి ముందుకు వెళ్లింది.

ఈ క్రమంలోనే అటుగా అతివేగంగా వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు శ్రీవల్లిని ఢీకొట్టింది. దీంతో ఆ చిన్నారి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. అంగన్వాడీ కేంద్రం వద్ద యూరిన్‌కి వెళ్ళే సమయంలో ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఢీ కొనడంతో చిన్నారి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ వెల్లడించారు.

కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్.. ఒకరు మృతి..

వరంగల్, మార్చి 20:అదుపు తప్పి ట్రాక్టర్ కాలువలోకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లాలో చోటుచేసుకుంది. మంగపేట మండలం జబ్బోనిగూడెం గ్రామ సమీపంలో బుధవారం ఉదయం ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో మండల కేంద్రంలోని పొద్దూరుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎండీ.యాకూబ్ పాషా (40) మృతి చెందాడు.

మంగపేట మండలం బోరు నర్సాపురం గ్రామంలో పట్టా భూములలో ఇసుక తరలించేందుకు (ఇసుక క్వారీ) రోడ్డు కోసం భిక్షంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని జబ్బోనిగూడెం సమీపంలోని ఓ రైతు భూమిలో నుండి మట్టి తరలిస్తున్నారు. ఈ క్రమంలో మట్టి లోడుతో వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పడంతో జబ్బోనిగూడెం సమీపంలో నర్సింహ సాగర్ ప్రాజెక్ట్ ఎడమ కాలువలో బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ ఎండీ.యాకూబ్ పాషా ట్రాక్టర్ క్రింద ఇరుక్కుపోయి సంఘటనాస్థలంలోనే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మంగపేట ఎస్సై గోదరి రవి కుమార్ తమ సిబ్బందితో సంఘటనాస్థలంకు చేరుకుని ట్రాక్టర్ క్రింద ఉన్న మృతదేహాన్ని స్థానికుల సహకారంతో బయటకు తీశారు. మృత దేహాన్ని బయటకు తీయడంలో మంగపేట ఎస్సై గోదరి రవి కుమార్ వ్యవహరించిన తీరు అభినందనీయం. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మంగపేట పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం యాకూబ్ పాషా మృతదేహాన్ని ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య రేష్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

స్టూడెంట్స్‌కి గుడ్ న్యూస్ - ఉచిత డిగ్రీతో పాటు ఉద్యోగం ఆఫర్

హైదరాబాద్, మార్చి 20:తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల (టీఎంఆర్ఈఐఎస్)కు చెందిన ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా డిగ్రీ కోర్సుతో పాటు ఉద్యోగం ఇవ్వనున్నట్లు కార్యదర్శి ఆయేషా ఖాన్ తెలిపారు.

టీఎంఆర్ ఈఐఎస్, ఎంఎస్ఎన్ లేబరేటరీస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎంపీసీ, బైపీసీ, ఫార్మా టెక్నాలజీ, ఎంఎల్టి బ్రిడ్జి కోర్సు ద్వారా 2023లో ఇంటర్ పాసైన లేదా మార్చి 2024లో రాయనున్న అభ్యర్థులు అర్హులు.

55శాతం ఉత్తీర్ణతా మార్కులు కలిగి ఉన్న 20 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులుగా తెలిపారు.

ఈ నెల 21న టీఎంఆర్‌జే కరీంనగర్ బాలికలు-2, కరీంనగర్ బస్టాండ్ సమీపంలో, 22న టీఎంఆర్ వొకేషనల్ జూనియర్ కాలేజీ నిజామాబాద్ బాలురు-4, నిజామాబాద్ ధర్మారం, 23న టీఎంఆర్ జూనియర్ కాలేజీ నిర్మల్ బాలురు-1, ఆర్టీఓ కార్యాలయం చించోలి సమీపంలో గల కేంద్రాల వద్ద క్యాంపస్ సెలక్షన్ జరగనుంది. ఎంపికైన విద్యార్థులకు రూ.11వేల నెలనరి జీతం, తొలి రెండు సంవత్సరాలు రాయితీతో కూడిన వసతి సౌకర్యం, ఉచిత రవాణ సదుపాయం, తొలి రోజు నుంచి కంపనీ చట్టాలకు అనుగుణంగా అభ్యర్థులు ఉండటంతో పాటు, ఎంపికైన అభ్యర్థులతో పాటు కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ సౌకర్యం ఉంటుందని తెలిపారు.

ఎన్నికల ప్రచారానికి సంబంధించి మార్గదర్శకాలు జారీ

-ఎన్నికల రోడ్ షోలు, ర్యాలీల్లో పటాకులు పేల్చడానికి అనుమతి లేదు: ఈసీ

హైదరాబాద్, మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్): ఎన్నికల రోడ్ షోలు, ర్యాలీల్లో పటాకులు పేల్చడానికి అనుమతి లేదని కేంద్రం ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచారానికి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేసింది.

అధికారిక వాహనాలను ఎన్నికల ప్రచారంలో ఉపయోగించవద్దు

-కాన్వాయ్‌లో పది వాహనాల కంటే ఎక్కువగా ఉండొద్దు (సెక్యూరిటీ వాహనాలు కాకుండా). ఒకవేళ ఎక్కువ సంఖ్యలో వాహనాలు ఉంటే అవి 100 మీటర్ల దూరంలో ఉండే విధంగా చూడాలి.

– ఒక బైక్ మీద ఒక జెండాను మాత్రమే పెట్టాలి. జెండా సైజు 1 అడుగు లీ ఆర అడుగు మాత్రమే ఉండాలి. జెండా కర్ర మూడు అడుగుల కంటే ఎక్కువ పొడవు ఉండకూడదు.

– రోడ్ షోలను సెలవు రోజుల్లో నిర్వహించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. పీక్ అవర్స్‌లో కాకుండా ఇతర సమయాల్లో ర్యాలీలు నిర్వహించాలి. దవాఖానలు, బ్లడ్ బ్యాంకులు, ట్రామా కేర్ సెంటర్ల దగ్గర రోడ్ షోలను నిర్వహించవద్దు. రోడ్‌ను పూర్తిగా బ్లాక్ చేయవద్దు. వాహనాలు వెళ్లేందుకు ఒకవైపు ఖాళీగా ఉంచాలి. రోడ్ షోలో ఎంత మంది పాల్గొంటున్నారనేది ముందుగానే సమాచారం ఇవ్వాలి.

-గరిష్ఠంగా బ్యానర్ సైజ్ 6చీ4 మాత్రమే ఉండే విధంగా చూడాలి.

-విద్యా సంవత్సరానికి ఆటంకం కలిగే విధంగా పాఠశాలలు, కళాశాలల్లో సభలు, సమావేశాలు నిర్వహించవద్దు. సభలు, సమావేశాలకు ఆయా విద్యా సంస్థల నుంచి ముందుగానే అనుమతి తీసుకోవాలి. ముందుగా వచ్చిన వారికి ముందుగా కేటాయింపు విధానంలో స్కూల్, కాలేజీ స్థలాలను కేటాయించాలి.

-దేవాలయాలు, చర్చిలు, మసీదు, గురద్వార్‌లను ఎన్నికల ప్రచారానికి వినియోగించడానికి వీలులేదు.

-కులం, మతం ఆధారంగా ఓట్లు అడగడానికి వీలులేదు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టేలా ప్రవర్తించకూడదు.

-వ్యక్తిగత దూషణలు, విమర్శలు వద్దు. అభ్యంతరకర మెసేజ్‌లను ఓటర్లకు పంపకూడదు.

-తాత్కాలికంగా ప్రారంభించే పార్టీ కార్యాలయాలు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఉండాలి.

లక్ష రూపాయలకు లెక్క చెప్పాలి

ఒక అకౌంట్ నుంచి లక్ష రూపాయలు డిపాజిట్ చేసినా, విత్ డ్రా చేసిన ఆ వివరాలను అందించాలని బ్యాంకులకు ఎన్నికల సంఘం సూచించింది. ఒక బ్యాంకు అకౌంట్ నుంచి అనేక బ్యాంకు అకౌంట్‌లకు ఆర్‌టీజీఎస్ ద్వారా డబ్బులు జమ చేస్తుంటే వాటి సమాచారాన్ని ఇవ్వాలని కోరింది. అభ్యర్థి లేదా ఆయన కుటుంబ సభ్యులు ఏవరైనా లక్ష రూపాయల కంటే ఎక్కువగా నగదు డ్రా చేసి ఉంటే ఆ సమాచారాన్ని అందించాలని ఆదేశించింది. రాజకీయ పార్టీల అకౌంట్‌ల నుంచి ఒక లక్ష రూపాయలు జమ చేయడం, డ్రా చేయడం చేస్తే వాటి వివరాలను అందించాలని తెలిపింది. ఈ మేరకు మంగళవారం బ్యాంకుల ప్రతినిధులకు ఈసీ లేఖ రాసింది.

13 శాఖలకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

పోలింగ్ రోజున విధుల్లో ఉండే 13 అత్యవసర శాఖల ఉద్యోగులకు పోస్టల్ ఓటు హక్కును ఈసీ కల్పించింది. ఎన్నికల రోజు విధుల్లో ఉండే జర్నలిస్టులు సైతం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు.

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉన్న శాఖలు

ఎయిర్‌పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, రైల్వే ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్, కుటుంబం, వైద్య సంక్షేమం, ఆర్టీసీ, సివిల్ సప్లయ్, బీఎస్ఎన్ఎల్, పోలింగ్ రోజు ఎన్నికల్లో విధుల్లో ఉండే మీడియా ప్రతినిధులు, ఫైర్ సర్వీసెస్.

అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ. 10 వేలు నష్టపరిహారం

– మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్ మార్చ్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రాష్ట్రంలో ప్రకృతి విపత్తు వల్ల నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ. 10 వేలు నష్టపరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రకృతి విపత్తు వల్ల నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ. 2500 నుంచి రూ. 3000 మధ్య ఇస్తే సరిపోతాయని నిర్ణయించాం. కానీ కేసీఆర్ రైతు పక్షపాతి కాబట్టి.. రైతులకు మించి ఏం ఉండదని ఎకరానికి రూ. 10 వేల నష్ట పరిహారం ఇచ్చారు అని నిరంజన్ రెడ్డి తెలిపారు. ఆ రోజు ఇదే రేవంత్ రెడ్డి, మిగతా కాంగ్రెస్ నాయకులు ఏం మాట్లాడారు..? పంట నష్టపోయిన రైతులకు రూ. 10 వేలు దేనికి సరిపోతాయి. రైతులకు ఏమైనా భిక్షం వేస్తున్నారా..? అని మాట్లాడారు. ఇప్పుడు ప్రకృతి విపత్తు వల్ల నష్టపోయిన రైతాంగానికి, పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ. 10 వేలు కాంగ్రెస్ పార్టీ ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నాం అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.మీ చర్యల వల్ల, కరెంట్.. నీళ్లు ఇవ్వక ఎండిపోయిన పంటలు ఎన్ని ఉన్నాయో లెక్కలు తీయాలి. అలాంటి రైతులకు కూడా రూ. 10 వేలు ఇచ్చేందుకు ప్రత్యేక జీవో తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాం.

ఆహ్వానం

తెలంగాణ రచయితల సంఘం - జంట నగరాలు
వార్షిక సాహిత్య సభలు
24-03-2024, ఆదివారం
బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్

ప్రారంభ సభ - ఉ.10 గంటలకు
సభాధ్యక్షులు : కందుకూరి శ్రీరాములు
అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం, జంట నగరాలు

సభా ప్రారంభకులు: కె.శ్రీనివాస్ సంపాదకులు, ఆంధ్రజ్యోతి
ముఖ్య అతిథి: కె.శివారెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

విశిష్ట అతిథులు: డా. నందిని సిధారెడ్డి తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు
దేశపతి శ్రీనివాస్ ఎం.ఎల్.సి. తెలంగాణ రాష్ట్రం

ఆత్మీయ అతిథులు: డా. నాళేశ్వరం శంకరం రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం
విరాహత్ అలీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంఘం
పుస్తకావిష్కరణ
కందుకూరి శ్రీరాములు కవిత్వం - పలకల నుంచి పలుకుల వైపు
పుస్తకాన్ని కె.శివారెడ్డి ఆవిష్కరిస్తారు.
కార్యదర్శి నివేదిక: డా.బెల్లంకొండ సంపత్ కుమార్

సందేశాలు : డా.తూర్పు మల్లారెడ్డి, కోశాధికారి, తెరసం, జంటనగరాలు
డా. రూప్ కుమార్ డబ్బీకార్ కవి, రచయిత
కొత్త అనిల్ కుమార్ తెరసం, కరీంనగర్
పొట్లపల్లి శ్రీనివాస రావు తెరసం, వరంగల్
బిల్లా మహిందర్ తెరసం, హనుమకొండ
పానుగంటి రామ్మూర్తి తెరసం, జనగాం
ముత్తి గారి కవిత తెరసం, మెదక్
డా. పొన్నాల బాలయ్య తెరసం, సిద్దిపేట
ఘనపురం దేవేందర్ తెరసం, నిజామాబాద్

ఆహ్వానం: కొండపల్లి నీహారిణి కృతజ్ఞతలు: నరేశ్ చారి

భోజన విరామం - మధ్యాహ్నం 1 గం. - 2 గం.

రెండవ సభ - మ.2 గంటలకు
సాహిత్యం - సమకాలీనత
సభాధ్యకత: డా.వి. శంకర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రచయితల సంఘం

అంశం: కవిత్వం
వక్త: దర్భశయనం శ్రీనివాసాచార్య ప్రముఖ కవి

అంశం: కథ, నవల
వక్త: డా. ఎస్.రజని
తెలుగు శాఖ అధ్యక్షులు, డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

అంశం: విమర్శ, పరిశోధన
వక్త: డా. లక్ష్మణ చక్రవర్తి
అసోసియేట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం
ఆహ్వానం: కందాళై రాఘవాచార్య కృతజ్ఞతలు: నల్లగొండ రమేశ్
మూడో సభ – సా.4 గంటలకు
కవి సమ్మేళనం
సభాధ్యక్షులు : డా. గండ్ర లక్ష్మణరావు
పాల్గొను కవులు
కందాళై రాఘవాచార్య, డా. తిరునగరి శ్రీనివాస్,
శ్రీనారా, వేణుశ్రీ, రూప్ కుమార్ డబ్బీకార్,
కొండపల్లి నీహారిణి, దేవనపల్లి వీణావాణి
గజేందర్ రెడ్డి.ఏ, గజవెల్లి దశరథ రామయ్య
దాసరి మోహన్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, నక్క హరికృష్ణ,
సరోజ వింజామర, ధూళిపాళ అరుణ
నల్లగొండ రమేష్, నరేశ్ చారి, అపోబిలం ప్రభాకర్
ముదిగొండ సంతోష్, కాసిం అలీ, కనకయ్య
జగ్గయ్య జి, బక్కా రెడ్డి .పి, బల్లిపల్లి బ్రహ్మం
వంశీధర్.కె, గుండెల్లి ఇస్తారి, సులోచన.జి
సాలగ్రామగిరి, దుగ్గి గాయత్రి, అఫ్రోజ్ రుక్సానా
బండారు పుష్పలత, భానుజ, కె.నరసింగం
రాధికా సూరి, పద్మశ్రీ, యరకల యాదయ్య, వి.వెంకటాచార్య
కందుకూరి శ్రీరాములు, బెల్లంకొండ సంపత్ కుమార్
ఆహ్వానం :గజేందర్ రెడ్డి.ఏ కృతజ్ఞతలు: గుండెల్లి ఇస్తారి సమన్వయం: వేణుశ్రీ
సాహిత్యాభిమానులందరికీ స్వాగతం
తెలంగాణ రచయితల సంఘం - జంట నగరాలు

చురక

నిన్నటిదాక దాంట్లో
నీకతడు దుర్మార్గుడు
ఎగిరొచ్చి నేడు దీంట్లో
ఎట్టైతడు సన్మార్గుడు
అవినీతి స్వార్థానికి
అతీతులు ఎవరు లేరు
పార్టీ మారగానే అంతా
పరమ సాధులైపోరు

–వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం– నేటికీ అందం

అమలిన సందేశముతో
సమదర్శన సూత్రములను సంఘమునకిడన్
విమలాత్ములు జరుపవలెను
కమనీయముగా ప్రపంచ కవితా దినమున్

(మార్చి 21 ప్రపంచ కవితా దినం)

–రాధశ్రీ
సెల్:9494481210

బంజారా నానీ

పేదవాళ్ళే కావచ్చు
వీరులు వాళ్ళు
దూరాలు
వారికో లెక్కా!

-డా॥ సూర్యాధనంజయ్
సెల్:9849104187

నేటినిజం
సాహితీ కెరటాలు
website:www.netinijam.com

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 21-3-2024

ఘంటారావం

వదలిపోతున్నప్పుడు ఏడ్చేవాళ్ళు
అయినవాళ్ళు
ఏడుస్తున్నప్పుడు వదలి వెళ్ళేవాళ్ళు
కానివాళ్ళు.

అరచేతిలో
చరవాణి
ఎవరికేమైతే
నాకేమి?.

ఎవరినీ
ఎగతాళి చేయకు
ఎవరెలా ..ఎదుగుతారో
మరువకు

ఉత్కంఠ
ఎంతవరకు?
ఊపిరి
ఉండేవరకు.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

పుస్తక సమీక్ష

జీవిత తత్వం తెలిసిన కవి ఉదారి!

2001లో "ఆకుపచ్చని పదారి" కవితా సంపుటితో సాహితీ లోకంలో కవితా తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని పదిల పరుచుకున్న డా॥ ఉదారి నారాయణ **"యాల్లైంది", "వూగిపొద్దు" "ఆదిలాబాద్ నానీలు"** వంటి గ్రంథాలను వెలువరించి అందరికీ చేరువైనారు. ఇప్పుడు మళ్లీ మనిషిలోకి.." కవితా సంపుటిని మనకందించారు. ఆయన నాన్నగారు ఉదారి నాగదాసు నుండి గొప్ప తాత్విక సంపదను సంతరించు కున్న కవి ఉదారి నారాయణ. ఆదిలాబాద్ వాసి కావడం వల్ల అక్కడి మట్టి వాసనలు గుబాళింపజే యడంలో.. స్థానికతకు పెద్దపీట వేయడంలో సఫలీకృతులు కావడం అభినందనీ యం.

ప్రతులకు: ఎస్.పద్మావతి
ఇ.నెం.4-112/7/2
కేసిబి గార్డెన్స్ ఎదురుగా,
రోడ్ నెం. 03, భాగవతి నగర్
ఆదిలాబాద్-504 001.
సెల్: 94414 13666

ఉదారి కవిత్వంలో ఆయన దారితప్పని తనం, ఉత్తమ వ్యక్తిత్వం.. సామాజిక చింతనం ముప్పేట అల్లుకుపోవడం ముదావహం.. ఆయన కవిత్వంలో అడవి అందాలను.. ప్రకృతి సోయగాలను.. ప్రపంచీకరణ నేపథ్యంలో చిల్లం కల్లం అవుతున్న పల్లెలను.. శ్రామికుల శ్రమైక సౌందర్యాన్ని, అడుగడుగునా చూస్తాం.. పూల పునాదులపై భవనాలు బతకనట్లు.. అబద్ధాల హామీలపై ఆశల ప్రాణాలు నిలువలేవని భావించే ఆయన.. నడుస్తున్న చరిత్రకు అద్దం పడుతూ **"ఊరివైపు ఒకసారి"** కవితకు జీవం పోశారు. గమ్యం లేని జీవితాలను ఆవిష్కరిస్తూ.. **"లేబర్ చౌక్"** కవితను తీర్చిదిద్దారు. పొద్దు ఎలా గడుస్తుందో అనే బెంగ. నిద్రలోనే తొలిచే జీవితాలను ఆర్ధ్రంగా ఆవిష్కరించారు.

కరోనా నేపథ్యంలో.. కవి తాను అనుభవించిన అంశాలను చూసిన ఘటనలను పడిన సంఘర్షణలను **'నిశ్శబ్దం అంచులో'** కవితలో చక్కగా ఆవిష్కరించారు. శబ్దం ఎంత భయంకరమో.. మనుషుల్ని మెలి పెట్టే ధ్వని.. ఎంత భయానక ప్రళయమో ఈ కవిత ద్వారా చక్కగా తెలియజెప్పారు.

"చివరి జాము" కవిత అందరినీ కదిలించే విధంగా రూపుదిద్ద బడింది. మొలకల తల్లిన్ని.. పానంగా దూసిన మునివేళ్లు.. మొక్కల గొంతుల్లో జీవ ధారల్ని వంపిన దోసిళ్లు- ఆవు గంగడోలును ఎద్దు మూపురాన్ని కడసారి దీనంగా పునికి పునికి ఎడబాటు దీవెనలు అందుకుని.. మూలకు ములుగుతున్న కర్రూ ముల్లు గర్రా.. అరకా అంబలి కుండలి ఆసాంతం అలుముకుని పురుగు డబ్బాపై చూపులు వాల్చినప్పుడు- రేపు కచ్చితంగా చేను నవ్వుతుందని.. పైరు పరవశంతో ఊగుతుందని చెప్పలేను అంటూ కవి ఉదారి. రైతన్న వెతలను ఏకరువు పెట్టారు. అప్పుల విషనాగులు, అవమానాల తేనేటీగలు.. ఆకలి అగ్గిసెగలను, ఆవేదనా అశ్రు ధారలను- కవితలో చక్కగా బంధించారు. **"అనేకాలుగా నేను"** కవితలో వివిధ వృత్తులు నిర్వహించే శ్రమైక జీవులను బహుజనుల జీవన రేఖలను చక్కగా తెలియజెప్పారు.

సంబరాల సంద్రాన్ని చూసి.. మతం ఎక్కడో తల దాచుకుందంటూ.. కులం గోతిలో పడి కుంటిదైందంటూ పీరీల పండుగ ప్రాశస్త్యాన్ని ఆవిష్కరిస్తూ రాసిన కవితలో కవి ఉదారి వ్యాఖ్యానించిన తీరు బాగుంది.

గుండాయిజం.. రౌడీయిజం రాజకీయానికి పర్యాయపదమైనప్పుడు.. అధికారం పెంపుడు యజమానిప్పుడు మనుషులంతా తలలు లేని మొండాలుగా కనబడటంలో వింతేమీ లేదని తేల్చి చెబుతూ రాసిన కవితలో- కవి ప్రకటించిన భావాలు బాగున్నాయి.

"కల్లోల దృశ్యం" కవితలోని ప్రారంభపంక్తులు కవితా శీర్షికకు ప్రాతినిధ్యం వహించాయి. కవితను ఆసక్తిగా చదవడానికి స్వాగత తోరణాలుగా మలచబడ్డాయి. ఔచిత్యవంతమైన పదబంధ ప్రయోగంతో.. సాగిన కవిత కవి యొక్క కవితా పటిమను అభినం దించి తీరుతాం. ఈ కవిత ప్రారంభ పంక్తుల్లో.. కలత చెందని రోజు లేదు.. కనులు మూసిన రాత్రి లేదు.. కలలు కందామన్న కండ్లు చెమర్చని దిన మూ లేదంటూ రాయడం అందరినీ కదిలించేలా ఉంది. మనుషులే మరమనుషులైన విచిత్ర సందర్భంలో.. ఎవరు ఎవరి కోసం కాకుండా.. ఎవరి శరీర గుహల్లో వాళ్లే ధైర్యపు కవచంతో గస్తీ కాచుకోవాలంటూ హితవు పలుకుతూ **"ఇప్పుడు సమయం కాదు"** కవితను తీర్చిదిద్దారు. **"కొత్తగా చిగురిస్తున్న అడవి"** కవితలో కవి ఉదారి- చెట్టు తొర్రలో తలదాచు కున్న మనిషి.. చెట్టు కడుపులనే గిర్మిట్ చేస్తున్నడని. తన పాడె తానే కట్టుకుంటున్నడని వాపోయారు. పర్యావరణాన్ని కొల్లగొట్టడం మూలం గా దాపురిస్తున్న పరిస్థితు లను ఈ కవితలో ప్రస్తావించారు. చీకటి రంపాల హత్యాచారాల నుంచి.. కాపాడుకోవడానికి అడవి కొత్తగా చిగురిస్తున్నదని మంచి ముగింపు నిచ్చారు. **'మూరెడు జాగకోసం"** కవితలోనూ కవి ఉదారి ప్రకటించిన భావాలు ఆర్ధ్రంగా ఉన్నాయి.

"ఆదిలాబాద్ నిషాని" కవితలో చెట్టు నా జీవిత ప్రయాణంలో నా వెంటే నడుస్తున్నదంటూ.. ఆదిలాబాద్ అడవి అందాలను.. చెట్ల నీడలతో అల్లుకున్న ప్రదేశాలను ప్రశంసనీయంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్ చుట్టూ గల పరిసరాలను అక్షరాల్లో ఆవిష్కృతం చేశారు. ఈ కవితలో.. మోతుకు చెట్టుతో ఉన్న బంధాన్ని- విస్తారాకు మర్యాదలను..పొలాల అమాసకు తలపుల ముందు కావలి... చిన్నప్పటి జ్ఞాపకాలు.. ఇప్పటి అనుభూతులను.. ఆదిలాబాద్‌తో పెనవేసుకున్న బంధాన్ని కవితామయం చేయడంలో కవి ఉదారి తమ ప్రతిభను ప్రదర్శించారు. "కవి వూరు" కవితలో ఈ అడవి సౌందర్యమే నా లేత పాదాలకు తర్ఫీదని.. చిన్నప్పుడు ఈ బోడ గుట్టలే నా చిరునామా అనీ.. కొనసాగించిన తీరు బాగుంది.

రేపైనా ఎప్పుడైనా
నా చిన్ని బాల్యం పెద్ద బొమ్మరిల్లనీ..
అప్పటి గూట్లో పిండాలు.. ఇప్పుడు పాటల పతంగులయి.. ఆకాసాన్ని తాకుతున్నయి.. కొత్త కొత్త రాగాలతో.. డప్పుల దరుపులతో పట్నాలలో.. రేలపూ తల స్వరాలు ఎత్తుకుంటున్నాయి అంటూ కవి వూరును చక్కగా దృశ్యమానం చేశారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా తమ రచనల ద్వారా ఉద్యమానికి ఊపిరులూదిన ఉదారి.. తన కవిత్వం నిండా ఇక్కడి మట్టి, ఇక్కడి చెట్టు, ఇక్కడి గుట్ట, ఇక్కడి పుట్ట, ఇక్కడి జనం గురించి అడుగడుగునా స్వాభిమానాన్ని చాటుతూ ఆవిష్కరిం చడం అభినందనీయం.. సామాజిక జీవితంతో పాటు.. నైసర్గిక, భౌగోళిక వర్ణనానుభవాలకుసైతం రేఖామాత్రంగా చోటు కల్పిస్తూ.. కాలానుగుణమైన మార్పులను- చేర్పులను ఎంతో నేర్పుగా కవి ఉదారి తన కవిత్వంలో జొప్పించి మెప్పించారు. వినోద్ డిజైన్ చేసిన అందమైన, ఆలోచనాత్మకమైన ముఖచిత్రం గ్రంథానికి నిండు శోభను కూర్చింది.కవి ఉదారికి ఈ మట్టిపై ఉన్న మమకారాన్ని.. ఇక్కడి చెట్టుతో ఉన్న బంధాన్ని.. ఇక్కడి పరిసరాలతో ఉన్న అనుబంధాన్ని సందర్భోచితంగా కవిత్వంలో ఆవి ష్కరించి అందరి మన్ననలు పొంద టం అభినందనీయం.ఉదారి కవి త్వంలో భిన్నమైన కవితా వస్తువులు ఉన్నప్పటికీ.. అవన్నీ మనం నిత్యం చేసేవి.. అనుభవించేవి.. అనుభూతి పొందేవే కావడం విశేషం. అభివ్యక్తిలో సరళత్వం.. పదబంధ ప్రయోగంలో ఔచిత్యం.. కవితా శీర్షిక, ఎత్తుగడ, కొనసాగిం పు- ముగింపు వంటి అంశాల్లో కవి ఉదారి కవిత్వ కనీస ప్రమాణాలు పాటించడం ప్రశంసనీయం.. మున్ముందు మరిన్ని సామాజిక అంశాలతో.. కవిత్వాన్ని మరింత గాఢంగా అల్లి.. మన అందరినీ అల రిస్తారన్న విశ్వాసం ఉంది. జీవిత తత్వం తెలిసిన కవి ఉదారి నారా యణకు అభినందనలు తెలియజేద్దాం.

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

రాజకీయం

ఒక నక్క
ప్రమాణస్వీకారం చేసిందట
ఇంకెవర్నీ వంచించనని.

ఒక పులి
పశ్చాత్తాపం ప్రకటించిందట
తోటి జంతువుల్ని సంహరించినందుకు

ఈ కట్టు కథ విని
గొర్రెలింకా
పుర్రెలూపుతూనే ఉన్నాయ్.

(40 ఏళ్ళ క్రితం రాజకీయాలపై అలిశెట్టి ప్రభాకర్ రాత -గీత)

ఇంకెన్నాళ్ళో..!!

ఇసప్పాములకు
ఇసమెంత సహజమో
ఎక్కువోల్లం అనుకునేటోల్లకి
అహంకారం అంతే..!.

నివురు గప్పిన నిప్పోలిగె
నిట్ట నిలువునా
రగిలి పోతనే ఉంటరు..
బక్క బలహీనుల మీన
బహుజనులంటే..
వీళ్లకెందుకో
గంజిలీగ కంటే అటేటే...

నోరిప్పితే శిల్లరోల్లిట్లా..
శిల్లరోల్లట్లా ..
శిల్లరోళ్ల పండుగలు
శిల్లరోళ్ల పెండ్లిళ్లు గిట్లనే
శిల్లరోళ్ల వాడల్ల అంటూ
ఇకిలిస్తూ మనుషుల
ఎకేరు చేసుకుంట
ఇసం కక్కుతనే ఉంటరు
ఆడికి ఆళ్ళేదో..
ఆకాశం నుంచి రాలిపడ్డట్టు
తక్కినోళ్ళంతా
వాళ్ళ పాదదాసులేనన్నట్టు..

వాళ్ల కంటి పొరలకి ..
అగ్రజాతేతర జనులు
అనాగరికులు
అంటరానోళ్ళన్నమాట
వికారంగా ముఖం చిట్లించి
నోట్లోంచి నాలా కంపుని ఇడుస్తూ
శిల్లర ముచ్చట్లాడుతరు
కుత్సితులు..!

మూడొంతులున్నోని
నెత్తిమీన
అదన ఒక్కొంత్తున్నోని పెద్దిర్కం
ఇంకెనొద్దులో..!
చింత సచ్చినా
పులుపు మాత్రం సావకపాయె
అయినా..
పడేటోడున్నంతకాలమే
అనేటోనికి నోటిదురద..!.

మైల బట్టలని జాడిచ్చి,
మర్లేశి కొడితే
మల్లెపూవ్వోలిగే నవ్వపూ..!
ఉతకడం రావాలె అంతే.

-నాంపల్లి సుజాత
9848059893

నామిని రచనల్లో సామాన్యుల జీవితాలు
-మాజీ మంత్రి గల్లా అరుణకుమారి

నామిని సుబ్రహ్మణ్యం నాయుడికి స్వర్ణకంకణం తొడుగుతున్న మాజీ మంత్రి గల్లా అరుణకుమారి. చిత్రంలో డాక్టర్ గల్లా రామచంద్రనాయుడు, గోరటి వెంకన్న, భూమన్, తాడి ప్రకాష్, సాకం నాగరాజ తదితరులు.

"నామిని రచనల్లో "మిట్టూరోడి కతలు' సామాన్యుల జీవనాన్ని ప్రతిబింబించాయి. నేటి రచయితలు అనేక మంది నాన్న ప్రేమను, ఆయన శ్రమను కథలుగా రాస్తే, నామిని మాత్రం తన రచనల్లో అమ్మ శ్రమను ఆవిష్కరించారు" అని మాజీ మంత్రి రాజన్న ఫౌండేషన్ డైరెక్టర్ గల్లా అరుణకుమారి అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడికి మాండలిక బ్రహ్మ పురస్కార ప్రదాన కార్యక్రమం ఆదివారం తిరుపతి సమీపంలోని కరకంబడిలో ఉన్న అమరరాజ ఆడిటోరియంలో నిర్వహించారు. శ్వేత డైరెక్టర్ భూమన్ అధ్యక్షత వహించారు. అరుణకుమారి మాట్లాడుతూ నాన్న రాజగోపాలనాయుడి కలలు సాకారం చేయడమే రాజన్న ఫౌండేషన్ లక్ష్యమన్నారు. నేటితరం రచయితలకు నామిని మార్గదర్శి అని గోరటి వెంకన్న అన్నారు. అనంతరం నామని సుబ్రహ్మణ్యం నాయుడు దంపతులకు గల్లా అరుణకుమారి మాండలిక బ్రహ్మ పురస్కారం ప్రదానం చేసి, స్వర్ణకంకణం తొడిగి శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాజన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు గల్లా రామచంద్రనాయుడు, డాక్టర్ గౌరినేని రమాదేవి, నల్లూరి వెంకటేశ్వర్లు, అభినవ ప్రచురణలు సంపాదకుడు సాకం నాగరాజ, ప్రజాగాయకుడు పెంచల దాసు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 28న 12 మంది ప్రముఖులకు తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలయ ప్రదానం

వివిధ రంగాల్లో విశేష సేవలందించిన 12 మంది ప్రముఖులకు తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలను ప్రకటించింది. వైద్యం వెంకటేశ్వరాచార్యులు (కవిత్వం), డా॥ రాజారెడ్డి (పరిశోధన), అన్నవరం శ్రీనివాస్ (చిత్రలేఖనం), టి. గంగాధర్ (శిల్పం), డా॥ పసుమర్తి రామలింగశాస్త్రి (నృత్యం), డా॥ పప్పు వేణుగోపాలరావు (సంగీతం), ఆర్. దిలీప్‌రెడ్డి (పత్రికారంగం), బీహెచ్ కల్యాణి (నాటకం), కొంకుల ఎల్లయ్య (జానపద కళారంగం), డా॥ గంద్ర లక్ష్మణరావు (అవధానం), ఆచార్య కొలకలూరి మధుజ్యోతి (ఉత్తమ రచయిత్రి), దేవులపల్లి కృష్ణమూర్తి (నవల, కథ) ఎంపికయ్యారు. వీరికి ఈ నెల 28న పురస్కారాలు అందజేయనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సేవ సేవ సేవ సేవ సేవ సేవ సేవ సేవ సేవ సేవ

తెలుగు ఆశగా శ్వాసగా సాహితీ సాంస్కృతిక 'సేవ'

సేవ. రెండక్షరాల పదం. ఎంతో విలక్షణ అర్థం. పరిచర్య చేయడం, కొలువు తీర్చడం అని కూడా సాధారణంగా చెప్తుంటాం. ఈ రెండింటినీ తు.చ. తప్పక నిర్వర్తిస్తూ వస్తోంది తెలుగు భాష, సాహితి, సాంస్కృతిక సంస్థ 'సేవ'. వీటన్నింటికీ పట్టంకడుతూ, సంవత్సర మంతటా మొత్తం అన్ని రోజులూ పలు ప్రక్రియలు నిర్వహిస్తోంది. ఒక వ్యవస్థ నిత్యమూ ఇలా జూమ్ సమావేశాలు ఏర్పాటు చేయడమన్నది అపురూప రికార్డు! నాటి నుంచి నేటి వరకు దరిదాపు అందరు సాహితీవేత్తలనూ అక్షర తోరణంతో స్వాగతించడం మరెంతో విశిష్టత. నిరుడు తెలుగు ఉగాదిన మొదలైన ఇదే ప్రక్రియకు వచ్చే పండుగనాటికి 365 రోజులూ దాటుతుంది. అంతరాజతీయ అంతర్జాల వేదిక మీదనే కాకుండా -ప్రత్యక్ష ప్రసారంగా, అనంతర శ్రవణ సౌభాగ్యంగా వర్ధిల్లుతోంది 'సేవ' సంస్థ. తెలుగునాట, ఇతర ప్రాంతాలకు సంబంధించి కూడా ఇదొక అనంత సంపద!

తెలుగు భాషా సాహితిలో ఎన్ని విభాగాలున్నాయో, ఆ అన్నింటిలోనూ తనదైన పాత్రపోషణ చేసిందీ సంస్థ. ఇప్పటికీ ఇంకా చేస్తూనే వస్తోంది. ఇదే మార్చి నెల 22వ తేదీన వార్షిక సంరంభం. ఏప్రిల్ 9న సమాపన మహోత్సవాలకు సంసిద్ధమవుతూనే, భవిష్యత్ సారస్వత ప్రణాళికనీ ఇప్పుడే రూపొందిస్తోంది. **ఉగాదిని భాషా భారతీమయం చేస్తూ, శోభస్కరంగా సంభావిస్తూ, వినూత్న రూపాన్ని సంతరించుకుంటోంది.** అధిపతి కంచర్ల సుబ్బానాయుడు. ఉపాధ్యక్షురాలు బోర భారతీదేవి. ప్రధాన కార్యదర్శి కొణిదల శోభ. నిత్య నిరంతర కార్యక్రమాల పరంపరకి సారథ్య బాధ్యతలను ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు, డాక్టర్ పత్తిపాక మోహన్, డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, డాక్టర్ కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కె. సంధ్యారెడ్డి వహిస్తున్నారు. మరిన్ని సహాయ సహకారాలను డాక్టర్ వి. నాగ రాజ్యలక్ష్మి, సత్యాదేవి మల్లుల, శివరంజని, మాధవి ప్రధానంగా అందిస్తున్నారు. ప్రత్యేకించి శుభాశీస్సులను పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ తెలుపుతున్నారు.

సుబ్బానాయుడు స్వస్థలం నెల్లూరు ప్రాంతం. పత్రికల నిర్వహణ, కళాపరిషత్తుల సమీక్షణ, సాహితీ కార్యక్రమాల విస్తృతీకరణలో మేటి. పలు పేర్లతో మునుపు రచనల చేశారు. ప్రచురణ శాలలనీ నిర్వహించారు. 'సేవ'లో నిర్వహించినవి వివరించాలంటే, ఆ జాబితాకు ఒక ముగింపు అంటూ ఉండదు. అంతటి విస్తార స్వభావ చాతురి ఆయనది. ప్రాచీన మొదలు అత్యాధునిక సాహిత్యం వరకు అంతటినీ స్పర్శించారు. నిత్య వసంతాలు, వారోత్సవాలు, సప్తాహ సమాలోచనలు, ముఖాముఖి సంభాషణలు, బాలలు, యువతీ యువకులు, వనితలు, మరెందరి కోసమో సదస్సులు, అవలోకనాలు జరిపారు. రుతువుల పేరిట కవి సమ్మేళనాలు, అక్షరార్చనలు, పంచ సహస్ర స్ఫూర్తి మాలికలు, రుచులను ఆస్వాదింపచేస్తూ వాడుక వేడుకలు, అవధానాది విశేష ప్రక్రియలు, ఇంకా మరెన్నో.

గతేడాది ఉగాది నుంచి ఈ ఏడాది పర్వదినోత్సవం దాకా అక్షర తోరణ ప్రభ వెల్లివిరుస్తూనే ఉంది. సహస్రాధిక వత్సర చరిత్ర నిండిన తెలుగు సారస్వత పునః మూల్యాంకన వరస కొనసాగుతూ వస్తోంది. అంతర్జాలంలోనే కాక, భౌతిక సభానిర్వహణలనూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నగరాల్లో చేపట్టి కృతకృత్యులయ్యారు. పత్రికలు నిర్వహిస్తూ, ఇతర ప్రచార - సమాచార - ప్రసార మాధ్యమాలను వినియోగిస్తూ, నాటినీ నేటినీ అనుసంధానిస్తున్నారు నిర్వాహకులు. సమీక్షలు, విశ్లేషణలు, అంతరంగ తరంగ ధ్వనులతో అన్ని వయోవిభా గాలవారినీ భాషా సాహిత్యాల పరంగా ఎంతగానో మెప్పిస్తున్నారు. **నేను, నువ్వు ... కాదు - 'మనం' అనేది వెల్లివిరియాలంటూ మహావేదికను అక్షరరీత్యా నిర్మిస్తూ వస్తున్నారు.** ఎన్ని గంటలైనా, రోజులైనా, వారాలైనా, పక్షాలైనా, నెలలైనా, సంవత్సరం దాటుతున్నా అదే నవోత్తేజం, అంతే మహోత్సాహం. వంద రోజులయ్యాయి, రెండొందల రోజులు ముగిశాయి, మూడొందల రోజులు పూర్తయ్యాయి, 365 ను దాటినా ఇప్పటికీ ఉప్పొంగుతూనే ఉంది సేవావాహిని!



కంచర్ల సుబ్బనాయుడు

అభిప్రాయ సమీకరణలు, చర్చల కొనసాగింపులు, నిత్యనూతన శీర్షికల హారాలతో తెలుగు భాష అపార శక్తివంతమవుతోంది. 'సేవ' పరంగా గతాన్ని గుర్తుచేసుకుంటే, వర్తమానాన్ని పరిశీలించుకుంటే, భవితవ్యాన్ని ఊహించుకుంటే - మది ఆనంద తరంగిత మవుతుంది. వందలాది వ్యక్తులు, అదే సంఖ్యలో కార్యక్రమాలు. నిత్య అక్షర తోరణ కాంతులు. సాహితీ బ్రహ్మోత్సవాలు, తెలుగు మహిళా మహాసభలు, అలనాడు తోరణ ఆరంభోత్సవ వేదిక మీద సుప్రసిద్ధుల ప్రసంగాలు, వరస క్రమంలో సారస్వత మూర్తుల సప్తాహాలు, ప్రశ్నోత్తరాలు, ప్రతి రోజూ రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు కనువిందు, వీనులకు పసందు. అనేకానేక కళారంగాల ప్రముఖులతో ముఖాముఖి ధారావాహికలు. వాగ్గేయకారులను స్మరిస్తూ ఉత్సవ దీప్తులు. తెలుగు నాటక సాహితీ సప్తాహాలు, వికాసవేత్తల గురించిన సమీక్షణలు ... నన్నయ - తిక్కన - ఎర్రనలను స్మరిస్తూ మహోత్సవాలు ... ఇలా అజస్రం, అనంతం, ఆసాంతంగా నిర్విరా మంగా అనుదిన పర్వదినోత్సవాల మధురిమ.

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానం లోని అష్టదిగ్గజ కవుల సారసత్వ అవలోకన, జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త సినారె కావ్యానుశీలన, పద్మభూషణ గుర్రం జాషువా స్మారక సప్తాహ నవాలోచన, కవిసార్వభౌమ శ్రీనాథుని సాహితీ నేత్రం, ప్రజామహాకవి పోతనామాత్యుని సారస్వత గవాక్షం, ఆంధ్రభోజ నవాహ్నికం, జనగాయక గద్దర్ సమాలోచనం. అలాగే తెలుగు భాషోత్సవాలుగా టంగుటూరి, గిడుగు పేరిట ఉత్సవ శోభలు - ఈ విధంగా పాత, కొత్తల మేలు కలయిక వృత్తాంతాలు. తెలంగాణ భాషా దినోత్సవం, గురజాడ జయంతి ఉత్సవం, కొడవటిగంటి సాహితీ వీక్షణం, శతక, సారస్వత సమారోహం, బాల సమాహారం, పరవస్తు చిన్నయసూరి మహోత్సవం, బహు భాషాకోవిద ఆర్వియస్ సుందరం అక్షర సౌందర్యం, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతల యువతరంగం, ప్రపంచ తెలుగు మహిళా మహాసభలు, వనితాపక్షం సదస్సులు, కవుల రచనా పఠనాలు, ఇంకా లెక్కకు మిక్కిలి కార్యక్రమాల జోరు. మన తెలుగు సాహిత్యమంతా ఇంకా ఇంకా కావాలంటూ, రావాలంటూ ఇష్ట ప్రక్రియల పోటీలనూ నిర్వహిస్తోందీ సంస్థ. శిక్షణ శిబిరాలతో, అవగాహన చర్చలతో, చిత్ర కవితల అంశాలతో, బహుకృతుల ప్రదానాలతో అంగరంగ వైభవాన్ని తలపిస్తోంది నిత్యమూ!

వినూత్న సాహితీ రూపకాలు మరెంతో విశిష్టతను ప్రస్ఫుటీకరిస్తున్నాయి. కవితా వసంతాలు సాహితీ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. **సూక్ష్మ రచనా పద్ధతులు ప్రధానంగా వర్ధమానుల కలాలకు ఉత్సాహ ప్రోత్సాహాల నిస్తున్నాయి. కలం యోధులను, సంఘాలవారిని ఒకే వేదిక మీదకు తెచ్చే బృహత్తర కృషి ఇప్పటికే పుంజుకుంది.** మహిళలకు, ఆ సంఘాలకు ప్రత్యేక ప్రాతినిధ్యం కలిగిస్తూ ప్రస్తుతం రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచే కార్యక్రమాలన్నీ ప్రారంభమవుతున్నాయి. విభిన్న చలనచిత్ర సాహితికి, విశిష్ట అవధాన ప్రక్రియకి అక్షరాభిషేకం ఇకముందు ఏర్పాటవుతుంది. ఇదే నెల 28 నుంచి కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యం - మూర్తిమత్వం మీద బృందంగా వరస ఉపన్యాసాలుంటాయి. తదుపరి కార్యక్రమాలూ అయ్యాక, వచ్చే ఏప్రిల్ తొమ్మిదో తేదీన ఉగాది శుభ సందర్భాన ఘన విజయోత్సవం.

-జంధ్యాల శరత్‌బాబు
99483 45013

ఎన్ని కల "కోడ్" కూసింది..!

ఎట్టకేలకు దేశమంతా
ఎన్నికల కోడ్ లు కూసాయి..!
ప్రారంభాలు ఆగి పోయాయి
పాలకులకు పవర్ కట్ అయింది
విగ్రహాలకు ముసుగులు పడ్డాయి
నిగ్రహాలు లేని నేతలు స్వగృహాలు వీడుతున్నారు..!
కోట్లను ఇచ్చి సీట్లు తెచ్చుకుంటున్నారు
గెలుపు కోసం గంపెడు కలలు కంటున్నారు
ఏసీ కార్లలో పయనించిన నేతలు
ఎర్రటి ఎండలో పరుగులు తీస్తున్నారు
ఉచితాలతో జనతను ఊరిస్తున్నారు
తాయిలాలను చాటుగా అందిస్తున్నారు.!
చిరకాల శత్రువుతోనైనా చేతులు కలుపుతున్నారు
గడప గడపలోన కుడి కాలు పెడుతూ
దండాలు పెడుతున్నారు మందహాసాలతో..!
ఉదయం నుంచి అర్ధ రాత్రి వరకూ
రాజకీయ నేతల రణగొణ ప్రచార యాత్ర
వాడ వాడలో మొదలయ్యేను ఎన్నికల జాతర
సీట్లు వచ్చిన వారికి అసమ్మతి కుంపట్లు
బీఫారాలు దక్కని నేతలు బైరాయింపులు
అయిదేళ్ళ కొకసారి వచ్చిన ఈ ఎన్నికలలో
రహస్య బూత్ లలో పవిత్ర మైన ఓట్లు వేసి
నేతల జాతకాలను తిరగ రాస్తారు ప్రజలు..!?

-జి.సూర్యనారాయణ,
6281725659.

"కుసుమ ధర్మన్న సాహితీ సమాలోచన" గ్రంథావిష్కరణ

మార్చి 16న ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, కుసుమ ధర్మన్న కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి కుసుమ ధర్మన్న 125వ జయంతి వేడుకల్లో "కుసుమ దర్మన్న సాహితీ సమాలోచన" (సాహితీ వ్యాసాలు) గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఉపకులపతి ఆచార్య కె. పద్మరాజు. వేదికపై బడేసాబ్, ఆచార్య పి.వరప్రసాదమూర్తి, ఆచార్య విస్తాలి శంకర్, డా॥బూసి వెంకటస్వామి, ఆచార్య జి. సుధాకర్, ఆచార్య డి. జ్యోతిర్మయి, డా॥రాధా కుసుమ, డా॥ తరపట్ల, సత్యనారాయణ తదితరులు.

సునందామృతం

జల మథన న్యాయము

జలము అంటే నీరు.మథనము అంటే మదించుట లేదా చిలుకుట. పాలు మథించిన వెన్న వస్తుంది.కానీ నీటిని మథిస్తే శ్రమ,అలసట, ఒళ్ళు నొప్పులు తప్ప ఒరిగేదేమీ లేదు.

దీనికి సామ్యంగా గొడ్డుటావును ఉదహరిస్తుంటారు.

గొడ్డుటావు దగ్గరకు వెళ్ళి పాలు పితకడం వల్ల పాలు రావు.వృధా ప్రయాస అనే అర్థంతో ఈ జల మథన న్యాయమును ఉదాహరణగా చెబుతుంటారు.

ఇలాంటి అర్థం వచ్చే వేమన పద్యాలను చూద్దాం.

'గొడ్డుటావు బిదుక గుండ గొంపోయిన/పాలనీక తన్ను పండ్లు రాల/ లోభివాని నడుగ లాభంబు లేదయా/ విశ్వధాభిరామ వినురవేమ!"

గొడ్డుదైన ఆవు దగ్గర పాలు దొరకవు.పిండాలని అనుకోవడమే తప్పు. అలాంటిది పిండటానికి కుండ తీసుకుని వెళితే ఏం చేస్తుంది?.పళ్ళు రాలేటట్టు తంతుంది. అలాగే 'అసలే లోభి.ఆ విషయం తెలిసి కూడా దానం ధర్మం చేయమని అడిగితే ఏమైనా లాభం ఉంటుందా?' అంటే ఉండదు కదా. ఇలాంటిదే మరో పద్యాన్ని చూద్దాం.

మేక కుతిక బట్టి మెడచన్ను గుడవంగ/ ఆకలేల మాను ఆశగాక/ లోభి వాని నడుగ లాభంబు లేదయా/ విశ్వధాభిరామ వినురవేమ!"

కొన్ని మేకలకు మెడకింద పాలిచ్చే స్తనాల్లా రెండు వేలాడుతూ ఉంటాయి. కానీ అందులో పాలు వుండవని అందరికీ తెలుసు. ఉంటాయని ప్రయత్నించడం వృథా ప్రయాస.అదే విధంగా 'లోభి పిల్లికి కూడా బిచ్చం వేయడు'. 'ఎంగిలి చేత్తో కాకిని కొట్టడు.' అంటుంటారు. అలాంటి వ్యక్తిని అడిగితే అనవసర శ్రమ తప్ప ప్రయోజనం ఏమైనా ఉందా అంటే ఉండదు కదా!.

అలాగే "నీటిలోంచి ఏదో వస్తుందని చిలకడం ఎంత నిష్ప్రయోజనమో, దానిని మనుషులకు వర్తింప చేస్తూ ఇలాంటి ఉదాహరణలు మన వెనుకటి వాళ్ళు సందర్భోచితంగా ఎన్నో చెప్పడం చాలా గొప్ప కదా!.



-పురిమళ్ల సునంద
9441815722

షట్ పదులు

తెలిసిన వాడని వెళ్తే
తేలులా కుట్టే వాడొకడు!
పరమ మిత్రుడని చూస్తే
పామై కాటేసేవాడు మరొకడు!
ఆత్మ బంధువని ఆదరిస్తే
ఆస్తికై హత్యచేసే వాడింకొకడు!

మతం పిచ్చితే చెలరేగేవి
అడ్డం-పొడవూ నామాలు!
గ్రాసం పెంచి అందించినా
మోసం పాలయ్యేవి గ్రామాలు!
దినదినం దిగజారిపోయినా
దివ్యం అనిపించేవి 'బడ్జెట్' ధీమాలు!



- డా॥వద్దేపల్లి కృష్ణ,
సెల్: 9246541699

నాటి తరం వారి కథలు నేటి తరానికి
కథల వంతెన

1976లో వ్రాసిన కథ



గుండె

కథ



–డా॥నందిని సిధారెడ్డి
సెల్:9440381148

రాళ్లు పగిలే ఎండ.

శరత్కాలమే అయినా, ఎండ మండిపోతూంది.

మిట్టమధ్యాహ్నపు సూరీడు వరండా మీది వాలుకుర్చీలో కూర్చున్న సీతా రామయ్య మాస్టారు గుండెలో మండుతున్న గాయం లాగా, మాస్టారి కెదురుగా గోడ కానుకుని కూర్చున్న పార్వతి నుదుటి మీది కుంకుమబొట్టులాగా ఉన్నాడు.

దురుసుగా అప్పుడప్పుడు వీస్తున్న ఈదురుగాలి. ప్రశాంతంగా ఉన్న కిటికీ తలుపులు టపటప లాడుతున్నాయి.

పార్వతి మోకాలు మీద గదవ ఆనించి తలకి అడ్డంగా చేతులు పెట్టుకుని ఏదో ఆలోచిస్తూంది.

స్కూలు నుండి మధ్యాహ్నం భోజనానికి వచ్చిన సీతారామయ్య, భోజనం అయిందనిపించుకుని స్కూల్‌కి వెళ్లడానికి 'ఇంకాసింత టైముంది కదా,' అని ఆరాం కుర్చీలో కూర్చున్నాడు. ఆరాం కుర్చీలో కూర్చున్నాడన్న మాటేగాని, అతను ఏమాత్రం ఆరాంగా లేడు. ఈవేళ ఒక్కనాడే కాదు, రోజూ అంతే.

తన జీవితం మండుతున్న ఎండలాగా ఈసడింపుగానూ, కరిగిపోతున్న వెన్నముద్దలా దయనీయంగానూ గడిచిపోతు న్నట్టనిపిస్తూంది సీతారామయ్యకి.

ఎండ వంక తదేకంగా చూస్తున్న సీతారామయ్య పెద్దగా నిట్టూర్పు విడిచి కుర్చీలో వెనక్కి చేరగిలబడిపోయాడు.

"పార్వతీ! బాబు నిద్రపోతున్నాడా?" సూటిగా చూస్తూ అడిగాడు.

"ఊఁ" సీతారామయ్య వంక చూడకుండానే సమాధానం చెప్పి మళ్లీ ఆలోచనలో మునిగిపోయింది పార్వతి.

సీతారామయ్య ఇంకా పార్వతివైపు అలాగే తీవ్రంగా చూస్తున్నాడు. తలకడ్డంగా పెట్టుకున్న చేతుల సందు నుంచి ఆవిడ నుదురు స్పష్టంగా కనిపిస్తూంది. నుదురు మీద ఆరె ఆకులాంటి గుండ్రటి బొట్టు మరింత స్పష్టంగా ఉంది. కొంచెం కిందుగా అర్ధనిమీలితమైన కళ్లు ఏదో ఆలోచిస్తున్నట్టు గంభీరంగా ఉన్నాయి.

ఏళ్ల తరబడి నిరీక్షణ ఉట్టిపడుతున్న ఈ చూపులూ, ఏదో తపనతో కొట్టు మిట్టాడుతున్న మనసూ, మొదలూ, చివర్లూ దొరక్క ఊగిసలాడుతున్న ఆలోచనా– ఇవీ పార్వతి మోములో తాను చదువు కుంటున్న భావాలు.

అందుకే పార్వతి ముఖంలోకి చూసినప్పుడల్లా తన హృదయాన్ని కసిగా ఎవరో గుండుసూదులతో పొడుస్తున్నట్టు బాధతో కుమిలిపోతాడు. ప్రస్తుతమూ అలాగే. ఏదో వేదనలో ఇరుక్కుని అవ్యక్తంగా గిజగిజా తన్నుకుంటూంది సీతారామయ్య మాస్టారు గుండె.

పార్వతి ఇంకా ఏదో ఆలోచిస్తూనే ఉంది.

"గణ..గణ..గణ..గణ..గణ..", సైకిల్ బెల్ మోగిన శబ్దం. సీతారామయ్యలో పెరుగుతున్న చెట్లను పారలతో పెకిలిస్తున్నట్టు, పార్వతిలో వెలుగు రేఖలు మెరిసినట్టు పరస్పర వ్యతిరేకాను భూతులు కలిగాయి.

ఇద్దరూ వీధి వంక తలలెత్తి చూశారు.

వాకిట్లో సైకిల్ ఆగింది. "పంతులుగారూ! మీ పేర ఉత్తరం.." అంటూ పోస్ట్‌మేన్ రంగయ్య ఓ కవర్ సీతారామయ్య చేతిలో పెట్టి, సైకిల్ నడిపించుకుంటూ వెళ్లిపోయాడు.

సీతారామయ్యకు తెలుసు– ఆ ఉత్తరం ఎక్కణ్నుంచి వచ్చిందో, ఎందుకు వచ్చిందో.

చాలారోజుల తరువాత కొడుకు దగ్గర నుంచి ఉత్తరం వచ్చినందుకు సీతారామయ్య సంతోషించలేదు. రెక్కలు విరిచేస్తున్న పక్షిలా అయిపోయాడు.

"పార్వతీ, ఇదిగోనమ్మా.. వేణు ఉత్తరం రాశాడు. నీకే అయి ఉంటుంది." పార్వతి వంక చేయి చాస్తూ అన్నాడు.

పోయిన ప్రాణం తిరిగి వచ్చినంత సంబరంగా పార్వతి బిరబిరా లేచి, రెండడుగులు ముందుకు వేసి ఆ కవరు అందుకుంది. కవరు చించి ఉత్తరం తెరిచింది. వచ్చీరాని చదువుతో చిన్నగా చదువుకుంటూంది.

పార్వతి కళ్లలో మెరుస్తున్న వెలుగును చూస్తుంటే సీతారామయ్యకి రెండు గమ్మత్తైన అనుభూతులు కలిగాయి. ఒకవంక భూమి చీలుకుపోతున్నట్టు భయంకరంగా, మరోవంక వెన్నెల వెదజల్లినట్టు చల్లగా.

అందుకేనేమో, ఈమధ్య రెండేళ్ల నుంచి మాస్టారి మనస్తత్వం చాలా విచిత్రంగా కనిపిస్తుంది ఆ స్కూలు స్టాఫ్ అందరికి. బజారు వెంబడి వెళుతుంటే లోకం తనని అసహ్యించుకుంటుంది.

ఏభయ్యేళ్ల తనకీ, పాతికేళ్ల పార్వతికి అక్రమ సంబంధ ముందని చేటంత నోరు చేసుకుని అగాధంగా చూస్తుంది. అందుకే ఈ లోకంమీద సీతారామయ్యకు కక్కలేనంత ఏవగింపు, కోపమూను.

బాబు మేల్కొన్నట్టున్నాడు. లోన గుక్క తిప్పకుండా ఏడుస్తు న్నాడు. ఏడుపు విన్నదేమో పార్వతి ఉత్తరంలోంచం తెరుకుని లోనికి వెళ్లింది.

బడికి వేళయినట్టుంది. దూరంగా బడిగంట మోగింది. సీతారామయ్య డ్యూటీని గుర్తు చేస్తూ.

"పార్వతీ! తలుపేసుకో!.. బాబు జాగ్రత్త!" హెచ్చరిస్తున్నట్టుగా అనేసి వీధిలోకి నడిచాడు.

××

చీకటి.

కళ్లు చీల్చుకున్నా ఎదుటి వస్తువు మసకమసగ్గానైనా కనబడనంత చిక్కగా ఉంది.

బయట సన్నగా చినుకులు రాలుతున్నట్టున్నాయి.

వంటింట్లో రేకుల వంక ఓ చెవి పెడితే సరి, చినుకులు పడుతున్నదీ లేనిదీ ఇట్టే తెలిసిపోతుంది.

దూరంగా సగం తవ్విన గోతుల్లో కప్పలు బెకబెకమంటున్నాయి.

అర్ధరాత్రి దాటింది.

బాబు గాఢంగా నిద్రపోతున్నాడు.

ఎంత గింజుకున్నా నిద్ర పట్టటం లేదు పార్వతికి.

"పారూ!

బాబుకి త్వరలో రెండేళ్లు నిండతాయనుకుంటను. అంటే, మన ఎడబాటుకి సైతం సుమారు అంతే వయస్సన్న మాట. ఏం చేద్దాం? బాధగా ఉన్నా, భరించకతప్పదు. బాబుకి మాటలు వస్తున్నాయను కుంటాను. త్వరలో వీలుబట్టి వస్తాను.

–నీ వేణు."

భర్త దగ్గర నుంచి ఉత్తరం వచ్చిన ప్పటినించీ, తనకెటూ పాలుపోవటం లేదు. వద్దనుకున్నా సరే, అవే జ్ఞాపకాలు.. అవే పాత గురుతులు.. వేణుమూర్తితో తను కలిసి పంచుకున్న తీయటి అనుభూతులు.. ఒకదాని మీద ఒకటి తన మీద పరచుకుని పడుతున్నాయి.

ఎంత విదిలించినా ఆ దృశ్యాలు తన కళ్లచుట్టూ పాముల్లా అల్లుకుపోతున్నాయి. ఆ దారుణానికి తట్టుకునే శక్తి తన దగ్గర లేదు. అంతా భయంగా ఉంది తనకి.

పట్నానికి ప్రయాణమైనాడు వేణు. తను వెక్కి వెక్కి ఏడిచింది. చంకలోని పసిబాబులా. వెళుతూ వెళుతూ తన చెవిలో రెండు మాటలు చెప్పి మరీ వెళ్లాడు.

"కొద్దిరోజులు పోయాక, నేనే స్వయంగా వచ్చి నిన్నక్కడికి తీసుకుని వెడతాను. అంతదాకా మామయ్య ఉంటాడు. నీవేం బెంగ పెట్టుకోకు.

"ఒకవేళ నేను రావటంలో ఆలస్యం జరిగితే, బాబులో నన్ను చూసుకుని నిరందిగా ఉండు. ఇదివరకు మనమిద్దరం ఒకరికొకరు. ఇక నుంచి బాబు, నీవూ ఒకరికొకరు మనిద్దరం బాబు కోసం. బాబు మనిద్దరి కోసం. బాబుని మాత్రం అశ్రద్ధ చేయకు సుమా!"

నిజానికి ఆ మాటలే తనని సంతోషపెట్టడానికి అన్నా, తన గుండెనెవరో రంపంతో కోసేస్తున్నట్టు భోరుమని ఏడవాలనిపించింది. ఏడిచింది కూడాను.

ఆయన వెళ్లిపోయాక మామయ్యే తన కన్నీళ్లు తుడిచాడు. అదీ, ఇదీ చెప్పి ఓదార్చడానికి అన్ని తంటాలూ పడ్డాడు. ఎంత ఊరడించినా, తనకి మాత్రం ఆయన లేని బ్రతుకు భయంకరమైన అడవిలా కనిపించి విపరీతంగా ఏడిచేసింది..

పార్వతి వెల్లకిలా పడుతున్నదల్లా పక్కకి తిరిగి పెద్దగా శ్వాస పీల్చింది. దుప్పటిని దగ్గరగా కప్పుకుని, బాబుని ఒంటి కదుముకుని పడుకుంది.

ఇంకా బయట వాన పడుతూంది.

ఒక్కొక్కటే చినుకులు రాలుతున్నట్టుగా పైన రేకులు అలికిడి చేస్తున్నాయి. కిటికీ పక్క బయటి చూర్లోంచి గబ్బిలాలు ఉండీ ఉండీ రెక్కలు విదిలిస్తున్నట్టు శబ్దం.

బాబు పుట్టాడు.

మొదటిసారిగా 'అమ్మా' అని పిలిపించుకునే అదృష్టం పట్టినందుకు పొంగిపోయింది తను. బంధువులు, పరిచయస్థులు చాలామంది సమక్షంలో ఆరోజు బాబుకి బారసాల జరిపించారు. 'చిరంజీవి' అని పేరు పెట్టారు బాబుకి. అందరూ బాబుని దీవించారు.

ఇంట్లో చీకటి పడినా, బయట ఇంకా చీకటి కాలేదు.

"పారూ, నీ మాటే గెలిపించుకున్నావు," ఆయన తన కళ్లలోకి అదోలా చూస్తూ అన్నాడు.

"అచ్చం మీ పోలికేనని చూసిన వాళ్లందరూ అస్తమానం పొగిడేస్తున్నారు," బాబు బుగ్గ మీద వేలుతో రాసుకుంటూ అంది తను.

"నిజమే, పారూ! నా పోలికే," అని ఆగిపోయి భుజం మీది తువాలుతో కళ్లు తుడుచుకుని మళ్లా అన్నాడు.

"ఒకవేళ నేను నీకు దూరమైతే, బాబులో నన్ను చూసుకోవచ్చు గదూ!"

"అవేం మాటలు? మీరు నాకు దూరం కావటమా? ఊహూఁ!

"కంగారెందుకు పారూ, నేనన్నది అది కాదు. నాకు చాలా దూరం ట్రాన్స్‌ఫర్ అయితే.. అనీ.. అంతే!"

"తల్లీ, తండ్రీ, చుట్టాలు– ఎవరి ప్రేమకూ నోచుకోని నాకు, మీరు తప్ప ఈ లోకంలో ఏముంది? బాబులో చూసుకోగలిగినా, మీరు నాక్కావాలి. మీ నీడ లేందే నేను లేను,"

"పారూ, ఏదో అలా అన్నాను. దాని గురించి నువ్వేం మనసు పాడు చేసుకోవద్దు" అంటూ వరండావైపు నడిచాడు. పెద్దగా శ్వాస పీల్చటానికి ప్రయత్నిస్తూ.

ఆయన ట్రాన్స్‌ఫర్ మాట ఎందుకన్నాడో, ఏమో తనకి తెఇయదు కానీ, ఆ మాటే నిజమైన రూపంతో ప్రత్యక్షమైంది వారంరోజుల్లో..

జీవితంలో ఒకోసారి చూచాయగా అనుకున్న విషయాలే నిజాలై కూర్చుంటాయి. అలాంటప్పుడు ఆ విషయం విషాదకరమైనా, గమ్మత్తుగా అనిపిస్తుంది.

ఆయన హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ అయినట్టు ఆర్డర్లు వచ్చాయి. ముగ్గురి గుండెలలోను పిడుగులు రాలినట్టు ఇదయిపోయారు.

ఉన్నట్టుండి వర్షం పెద్దదైనట్టుంది. రేకులు పెద్దగా చప్పుడు చేస్తున్నాయి. ఆ శబ్దాలు చెవుల్లోకి దూసుకుపోతుంటే, తన గుండె నెవరో బాదుతున్నట్లు సుడి తిరిగిపోయింది పార్వతి.

పెద్ద ఉరుము..

ఛక్‌మని మెరుపులు..

ఆ వెనకాలే పిడుగు పడినట్టు భయంకరమైన ధ్వని వినిపించింది. పార్వతి భయంతో వణికిపోయింది. బాబుని మరింత గట్టిగా అదుముకుని కళ్లు మూసుకుంది.

ఆయన వెళ్లి నెలరోజులైంది. అతని దగ్గర నుంచి ఏ సమాచారమూ రాలేదు. తన బలవంతం మీదే మామయ్య స్కూలుకి రెండు రోజులు సెలవు పెట్టి హైదరాబాద్ వెళ్లి వచ్చాడు.

క్షేమంగా ఉన్నాడనీ, తీరిక దొరక్క, ఉత్తరం రాయలేదనీ, త్వరలోనే వీలు చూసుకుని వస్తానన్నాడనీ– ఇంకా ఏదో ఏదో చెప్పాడు.

ఆ మాటలతో తను కాస్తంత తృప్తి పడింది.

మామయ్య పట్నం వెళ్లి వచ్చిన అయిదోనాడే ఆయన దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. అది తన పేర రాసి ఉండటంతో ఎంతో పొంగిపోయింది.

"పారూ!

బెంగపెట్టుకున్నావా? వద్దు, నేను రావడం లేదని నా గురించి ఆలోచించి మనసు పాడుచేసుకోకు. వీలునిబట్టి తప్పక వస్తాను. బాబులో నన్ను చూసుకుని తృప్తిపడదానికి ప్రయత్నించు. బాబుకి నీ నీడ ఉండాలి. నా మాట మరవద్దు.

.. నీ వేణు."

తనకి మొట్టమొదటిసారిగా వచ్చిన ఆ ఉత్తరాన్ని చూసి చాలా సంతోషించింది. పదేళ్ల కిందట నాలుగో తరగతి చదువుతో ఒక్కొక్క అక్షరం.. ఒక్కొక్క అక్షరం.. ఆ ఉత్తరం ఇంకా చదువుకుంది.

పైటకొంగుతో కళ్ల నీల్లు తుడుచుకుని బాబు దగ్గరికి వెళ్లి చెక్కిలిమీద ముద్దు పెట్టుకుంది.

> **"ఎంత విదిలించినా ఆ దృశ్యాలు తన కళ్లచుట్టూ పాముల్లా అల్లుకుపోతున్నాయి. ఆ దారుణానికి తట్టుకునే శక్తి తన దగ్గర లేదు. అంతా భయంగా ఉంది తనకి"**

అలా ఆయన జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా ఉత్తరం చదువుకుని తనలో తను తృప్తి పడింది. అవసరమైతే బాబు చెంప చేతులతో నిమిరి, ముద్దు పెట్టుకుని శాంతపడేది.

ఆరోజు ఆదివారం.

తను పెరట్లో బంతిపూలు తెంపుకుంటూంది.

ఆయన మెల్లిగా వచ్చి తన బుగ్గ గిల్లాడు. తనలో తన్మయం.. ఏదో గిలిగింత.. తను ప్రతిఫలంగా చిరునవ్వు విసిరేసింది.

"పారూ, నువ్వే ముద్దబంతి పువ్వులా నిండుగా ఉంటే ఇంకా నీకు ఆ పూలు ఎందుకు?"

తను జవాబు చెప్పటానికి తోచక సిగ్గుతో కుంచించుకుపోయింది. అప్పుడు ఆయన అన్న మాటలు ఇంకా జ్ఞప్తిలో ఉన్నాయి తనకి.

'స్త్రీ కోపంలో అందంగా ఉంటుందో, సిగ్గులో అందంగా ఉంటుందో ఆయనకి తెలియదట! కానీ, ఆ సిగ్గులో మాత్రం తను ప్రకృతి కన్నా అందంగా కనిపించిందట! ఆయన మాటలు ఎంత తీపిగా ఉండేవని!"

"అవును పారూ! నాకు 'పాప'నే ప్రజంట్ చేయాలి సుమా!"

"ఊహూఁ! కాదు, బాబే", తనవంక కొంటెగా చూస్తున్న వేణుకి ఆ సమాధానం నచ్చలేదో ఏమోతన వెన్ను మీద చిన్నగా చరిచాడు.

'అబ్బ, అతని స్పర్శ లేనిదీ, నీడ లేనిదీ, పలకరింపు లేనిదీ తను బతకగలదా! ఆ బతుకు బతికే కన్నా చావే నయం,' ఏమేమోమ ఊహించు కోసాగింది తను.

అంతలో మామయ్య కేకేశాడు.

"ఏమమ్మా, పార్వతీ! కాస్త వడ్డిస్తావూ– వెధవది ఒకటే ఆకలి."

తను మెల్లిగా జారుకుంది. ఆయన బంతిపువ్వు కాడ చేతిలో పట్టుకుని చూస్తూ నిలబడిపోయాడు.

ఎంత ప్రయత్నించినా నిద్రరావడం లేదు పార్వతికి. తన కళ్ల చుట్టూరా.. అవే! అవే! పాత జ్ఞాపకాలు.. చేదుమాత్రల్లాంటి తీపి గురుతులు..

జ్ఞాపకాలు మెదలటం వల్ల, నిద్ర రావడంలేదో, నిదుర రాకపోవడం వల్ల జ్ఞాపకాలు మెదులుతున్నాయో పార్వతికి అర్థంగాకుండా ఉంది. 'బహుశా ఈ విషయాలు ఎవ్వరికీ తేలని సమస్యలు కూడా కావచ్చు'ననే అనుమానం పార్వతికి ఉంది. ఎందుకంటే రెండేళ్ల నించి బుర్ర చించుకున్నా అంతు చిక్కని సమస్య అది.

పట్నం వెళ్లిన వేణు కోసం చాలారోజులు ఎదురుచూసింది తను. ఆయన మాత్రం తన ఎదురుచూపులకందలేదు కాని, ఉత్తరాలు మాత్రం అందుతూ ఉండేవి. అన్నింటిలోనూ మొదటి ఉత్తరంలోని పొడిమాటలే. ఓదార్పు పలుకులే. అంతకంటే తనకేం మిగలలేదు. ఈ లోకం తనకే సుఖాన్ని మిగల్చదలచనూ లేదు.

బాబు పుట్టినరోజు నాడు ఓ ఉత్తరం వచ్చింది. చదువుకుని శీతాకాలంలో ఒంటికి మంచుగడ్డ తాకినట్లు చలించిపోయింది తను.

"పారూ!

రేపే కదూ బాబు పుట్టినరోజు? బాబు పుట్టినరోజుకి కూడా రాకుండా ఏం చేస్తున్నానంటావా? ఏం చెయ్యను! పరిస్థితులు! 'మనం అనుకున్నవి అనుకున్నట్టు జరిగితే అర్థమే ఉండదట' ఎవరో అన్నారు. సరే! బాబు పుట్టినరోజు వైభవంగా జరిపించమని నాన్నకి చెప్పు!"

– నీ వేణు"

ఉత్తరాలతోనే తన జీవితం గడిచిపోయేలా ఉంది. ఉత్తరం చదువుతున్నప్పుడు చచ్చిపోతున్నట్టే అనిపిస్తుంది. కాదు, ఒకవేళ ఉత్తరాలతోనే తను బతుకులో ఊపిరి పోసుకుంటుందేమో!

ఆనాడెందుకో తను తిరిగి ఉత్తరం రాద్దామనుకుంది. కానీ, ఏ ఒక్క ఉత్తరం మీదా ఆయన అడ్రస్ లేదు. మామయ్యని అడగాలంటే చచ్చేంత భయం! ధైర్యం కూడగట్టుకుని ఓసారి అడిగింది.

"వాడికెంత తొందరో– ప్రతిసారీ అడ్రస్ రాయటం మరిచిపోతాడు. నాకు చెప్పాడు. కానీ, జ్ఞప్తిలో ఉండి చావదు! అయినా.. అడ్రస్ కోసం నీ మనసెందుకు పాడు చేసుకుంటావమ్మా! నేనున్నాక నీకేం కొరత రానివ్వను," అన్నాడు. అది ఓదార్పో, హెచ్చరికో తనకెంత.. కాలేదు.

వేణుమూర్తితో తమ పెళ్లయినప్పటి నుంచి కాలం పరుగు తీస్తూనే ఉంది, రైలు చక్రాల్లా కాకపోయినా ఎద్దుబండిలాగా.

నిరుద్యోగిగా మథనపడుతూన్న ఆయనకు టీచరు ఉద్యోగం వచ్చింది. బడి పంతులు కొడుకు బడిపంతులే కావటం ఈ దేశంలో కొత్తేమీ కాదని నిరూపించటానికి. ఎనిమిది మైళ్ల దూరంలో ఉన్న పక్క ఊరి హైస్కూల్‌లో వేణు డ్యూటీ.

ఆ ఊరికి రోజూ సైకిల్ మీద వెళ్లటం, సాయంత్రానికల్లా తిరిగి వచ్చెయ్యటం ఆయన దినచర్యలో భాగమై కూర్చున్నాయి.

తనకి నెల తప్పింది అని ఆ వాడకు వాడ తెలిసిపోయింది.

నాలుగు నెలలు ఉసూరుమంటూ గతంలో కలిసిపోయాయి.

ఐదో నెల.

తమ గృహంలో మామయ్య పెద్ద ముత్తైదువులతో ఘనమైన పండగ జరిపించారు.

ఆ తరువాత అంత ఘనమైన పండగ బాబు మొదటి పుట్టినరోజు నాడే జరిపించారు. తెలిసిన వాళ్లం దర్నీ పిలిచారు.

ఎందుకో మామయ్య కాస్త దిగులుగానే ఉన్నా, ఆ రోజు తను చాలా ఉత్సాహంగా ఉంది. ఏడాది బాబుని చంక నెత్తుకుని అంతమంది మధ్య తిరుగుతుంటే ఎంత గొప్పగా అనిపించింది తనకు! తన కళ్లలో గర్వం తొణికిసలాడుతున్నట్లు తనకే అనిపించింది!

వచ్చిన వాళ్లందరూ 'వేణు గురించి' అదేపనిగా అడిగారు. జవాబులు చెప్పలేక చల్లబడిపోయింది. తన తృప్తి అంతా మెరుపులా మెరిసినట్టే మెరిసి మాయమైంది.

రాత్రికి రాత్రే–

పట్నం వెళదామని మామయ్య దగ్గర పెద్ద పోరు పెట్టింది తను. చివరికి మామయ్య సెలవు రాసి ఇచ్చి పట్నం బయలుదేరాడు– తనని, బాబుని వెంటబెట్టుకుని, ఆనందన్ని చేరుకోబోతున్నట్టుగానే అడుగులు వేసింది తను.

మామయ్య దభాలున నేలమీద పడిపోయేటంత వరకు ఏమైందో తను గమనించనే లేదు. తను పిచ్చిది, మామయ్య కేమయిందో తెలుసుకోలేక ఊహల్లో తేలిపోయింది. మామయ్యకి గుండెలో నొప్పుతోందట. కడుపులో పేగులు పెకిలిస్తున్నట్టుగా అవుతుందట.. బాధతో అరుస్తూ నేలమీద పొర్లాడుతూ మెలికలు తిరిగిపోసాగాడు.

తనని ప్రాణంలా చూసుకునే మామయ్యకి తనేం సహాయం చెయ్యలేకపోతుంది. మామయ్య బాధనర్థం చేసుకోవటానికి ప్రయత్నించిందే తప్ప ఏమీ చెయ్యలేని తన అసహాయతని తిట్టుకుంది.. బాధపడింది.

"మామయ్య తనని విడిచిపోతే.. తనకెవ్వరు? ఆయన ఎక్కడున్నాడో..' ఆ ఆలోచనతో ఒంటినిండా చెమటలు పట్టాయి. 'ఎలా? ఎలా?' తనని తనే ప్రశ్నించుకుంది.

చివరకు మామయ్యను తీసుకుని తిరిగి ఇల్లు చేరింది. డాక్టర్ చూసి మందులిచ్చినాక కానీ కాస్త కుదుటపడలేదు గుండెనొప్పి.

ఇలా రెండు, మూడుసార్లు పట్నం బయలుదేరితే అన్నీ బలమైన అవాంతరాలే ఎదురైనాయి. ఇంకా మామయ్య ఆరోగ్యం అంతంతగానే ఉండింది.

అటువంటి పరిస్థితుల్లో పట్నం వెళ్లటం కంటే మానుకోవడమే మంచిదనిపించింది తన మనసుకి. తనొక్కత్తే ఎలాగూ పట్నం వెళ్లలేదు. వెళ్లినా అంత పెద్ద పట్నంలో ఆయనగారిని కనుక్కోలేదు. అందుకే ఆ తరువాత పట్నం వెళ్లే ప్రయత్నమే చెయ్యలేదు.

బాబుని చూసుకుంటూ, ఉత్తరాలతో, మామయ్య ఓదార్పులతో తన జీవితం పంక్చర్ అయిన సైకిల్‌లా బరువుగా సాగింది.

బాబు ఉన్నట్టుండి 'కీచు'మని ఏడుపు లంకించాడు. తన జ్ఞాపకాలు తెగిపోయినట్టుగా ప్రస్తుతంలో పడింది.

బయట వాన వెలిసినట్టుంది– రేకులు మౌనంగా ఉన్నాయి.

బాబు మరింత పెద్ద నోరుతో ఏడవసాగాడు. పక్క గదిలో నులక మంచం కిర్రుమంది. ఆ వెనకాలే మామయ్య మాటలు వినిపించాయి పార్వతికి.

"పార్వతీ.. నిద్రపోయావామ్మా? బాబేదుస్తున్నాడు...చూడమ్మా!" బాబు వీపు నిమురుతూ చేత్తో చిన్నగా తట్టుతూ జోకొట్టసాగింది పార్వతి. బాబు ఏడుపు మెల్ల మెల్లగా తగ్గించేస్తూ నిద్రలోకి జారుకోసాగాడు.

బాబుకి నిద్రపట్టి పావుగంట గడిచింది

పార్వతి ఇంకా బాబుని చేత్తో తట్టుతూనే ఉంది అతి సాజూకుగా.

ఆ రాత్రి..

తమ జీవితాలకి మొదటి రాత్రి. సినిమాల్లోలాగా, నవలల్లోలాగా ఆ గదినిండా అగరువత్తుల వాసన కానీ, మల్లెపూవులు చల్లబడిన పడక కానీ అమర్చబడలేదు– ఇది నిజజీవితం కాబట్టి. అందునా మధ్యతరగతి వాళ్ల మందహాసం కాబట్టి.

వేణుమూర్తి నులకమంచి పైన వేసిన పరుపులో కూర్చుని ఊహల్లో తేలిపోతున్నట్టున్నాడు.

గది తలుపు కిర్రున చప్పుడైంది. పార్వతి మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది, సిగ్గుతెరల్ని ఒంటినిండా కప్పుకోవటానికి ప్రయత్నిస్తూ.

తల ఎత్తి చూశాడు వేణుమూర్తి. పార్వతి సినిమా హీరోయిన్‌లా మేకప్ చేసుకోకపోయినా, వేణు కళ్లకి చాలా అందంగా కనిపించింది.

మిలమిలా మెరిసే కళ్లు, పసుపు కుంకుమలు కలబోసి ఆ గదిలో వెలుగుతున్న దీపపుకాంతి లాంటి ఒళ్లూ. పొందికగా ఉన్న అవయవ సౌష్ఠవం ఇవీ– వేణుమూర్తిని ఆకర్షించి పార్వతి అందానికి అతనిచేత మెరిట్ సర్టిఫికెట్ ఇప్పించాయి.

పార్వతి ఓ పక్కగా ఒదిగి కూర్చుంది.

వేణు పిలిస్తే మెల్లిగా వెళ్లింది మంచం దగ్గరికి. 'కూర్చో' అన్నాడు. పార్వతి ఏదో ఇదయిపోతూ మంచి మీద కూర్చుంది.

"పారూ, నేనంటే నీకిస్టమేనా?"

"ఊఁ" అంది.

"ఈ పెళ్లి మన అభిప్రాయాలకు తావివ్వకుండానే జరిగింది. పెద్దల ఒప్పందాలతోనే. మరి నా మీద ఏమైనా కోపమా?"

"ఊహూఁ!" తల అడ్డంగా ఊపింది.

"పారూ, ఈ సమయాన నేన్నీ కోరిక తీర్చాలి కదూ!"

"..." పార్వతి విపరీతమైన సిగ్గుతొ అవాక్కయింది.

"ఆకాశం మీంచి నక్షత్రాల్ని కోసుకుని తెస్తానని వెధవ్వాగుడు వాగలేను కాని, నీ కోరిక తీర్చడానికి నా శాయవక్తులా ప్రయత్నిస్తాను. నీకేం కావాలో చెప్పు!" అంటూ పార్వతి చేయి తన చేతిలోకి తీసుకున్నాడు వేణుమూర్తి.

పులకించిపోయింది పార్వతి. అంతలోనే ఏ మూలనో కొంచెం వేదన తొంగిచూసింది.

"నా గురించి మీకు తెలుసు. ఒక్క మాటలో నేను అనాథను. తల్లినీ, తండ్రినీ పోగొట్టుకున్న దౌర్భాగ్యురాల్ని. సవతి తల్లి చేతికింద కష్టాలనుభవించినదాన్ని. నాకు ఈ జీవితంలో పెళ్లవుతుందనుకోలేదు. అయింది. వెలుగు దొరికింది. ఇక నా సవతి తల్లెలాగూ నాకోసం రాదు. కానీ, ఎట్టి పరిస్థితుల్లోనూ నన్ను దాని చేతి కిందకు పంపించకుండా ఉంటే చాలు. బతికినన్నాల్లూ మీ నీడ..మీ తోడు.. రెండు ఇవ్వగలగితే మస్తు. ఈ వెలుగులో.. ఇదే నీడలో బతకనివ్వండి. అవే కరమైతే బతుకు చాలించటమే నాకు తోచేది." అంటూ ఏడవబోయింది. ఆమెని చూస్తూ ఉంటే మల్లెపూలు ఏడుస్తుంటే ఎంత బాధగా ఉంటుందో అంతగా బాదపడిపోయాడు వేణుమూర్తి.

పార్వతి ఏడుస్తూనే ఉంది.

వేణు కన్నీళ్లు తుడిచాడు. ఏమేమో కబుర్లు చెప్పాడు.

"పిచ్చిదానా! ఏడుపు మంచిది కాదు. దేనికైనా గుండె.. గుండె కావాలి!"

"నీ జీవితానికే లోటు రానివ్వ కుండా నేను చూస్తాను.. మరింక నవ్వాలి! చిన్నగా,, చిన్న నవ్వు.."

"..." బిడియంతో మొగ్గలా ముదుచుకుపోతున్న బంతిపువ్వులాంటి పార్వతిని వేణు తన చేతుల్లో ఇముడ్చుకోవడానికి ప్రయత్నించాడు.

పార్వతి కళ్లలో ఆ క్షణాన ఏదో హాయి! తృప్తి! మనశ్శాంతి!

ఎప్పుడు నిద్రపట్టిందో కాని, పార్వతికి మెలుకువ వచ్చేసరికి బాబుని హత్తుకుని పడుకుంది.

బారెడు పొద్దెక్కింది. బాబు దగ్గరికి ముడుచుకుపోయి గాఢంగా నిద్రిస్తున్నాడు. పసిపాపలకు ఎక్కువ నిద్ర ఎందుకుంటుందో పార్వతి ఆలోచించలేదు.

సీతారామయ్య పటాల ముందు కూచునీ పూజ చేసుకుంటున్నాడు. గాయాల్లాంటి రంగు అక్షరాలున్న సన్నని సెల్లా ఒంటి మీద కప్పుకుని.

పార్వతి పొద్దుపోయిందనే ఆదుర్దాతో తొందరగా లేచి వెళ్లి అద్దంలో చూసుకుంది. చిందరవందరగా పడి ఉన్న ముంగురుల్ని సరి చేసుకుంది. నిన్ననగా పెట్టుకున్న బొట్టు ఇంకా చెరిగిపోలేదు. విచిత్రం.. చాలా విచిత్రం!

ఒళ్లు విరిచి, బాబుకి ఒంటినిండా దుప్పటి కప్పి, వంటింట్లోకి నడిచింది. స్కూలుఖ టైమ్ అయ్యేలోగా త్వరగా వంట చేసెయ్యాలని,

××

"నాదో సందేహం మాస్టారూ!"

చెరువుగట్టు మీది గడ్డిపోచను పీకి నోట్లో పెట్టుకుని అడిగాడు మాధవరావు సీతారామయ్య వంక అదోలా చూస్తూ

> **"మాస్టారూ, మీ గుండె నిబ్బరం.. నిండుతనం.. ఏ చరిత్ర పేజీల్లోను చదవలేదు, చదవలేను కూడా."**

నేలకేసి అదేపనిగా చూస్తున్న సీతారామయ్య కళ్లలో ఏదో నిట్టూర్పు, అంతకంటే ఇంకేదో గంభీరత కొట్టవస్తున్నాయి.

తల ఎత్తి చూశాడు. ఉన్నట్టుండి వీచిన గాలికి ఎదురుగా ఉన్న చెట్టు విరిగి పోతుందన్నంత ఘోరంగా ఊగిపోతుంది.

'స్టుపిడ్, వెధవగాలి', అనుకుంటూ సీతారామయ్య మాధవరావు వంక చూశాడు. గడ్డిపోచని మెల్లిగా నమిలేస్తున్నట్టున్నాడు. అటు చూస్తుంటే తన హృదయం కూడా గడ్డిపోచలా అనిపించింది సీతారామయ్యకి.

మాధవరావు తనతోబాటే స్కూల్‌లో అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు. ఇద్దరూ కలిసి ఈవెనింగ్ వాక్ పేరుతో చెరువుగట్టుకు రావడం ఈవేళ కొత్తేమీ కాదు. రోజూ జరుగుతున్నదే. అతను ఎక్కువగా ముభావమైన మనిషి. ఏదో అర్థముంటేనే కానీ నోరు విప్పడు.

ఈవేళ అతనలా అడిగాడంటే దాని వెనక ఏదో బలమైన కారణ ముందన్న మాట.

సీతారామయ్య తనలోనే ఆలోచిస్తూ ఎంతకీ జవాబు పలకలేదు. ఇద్దరి మధ్య క్షణంసేపు నిశ్శబ్దం నిలుచుండిపోయింది. మాధవరావు మళ్లీ మొదలుపెట్టాడు.

"మాస్టారూ, వేణు పట్నంలోనే ఉన్నాడంటారా?" ఆ ప్రశ్న తాకిడికి సీతారామయ్య గుండెలో హిమాలయాలు బద్దలైనాయి. భరించలేక చెరువులోకి చూపుమరల్చాడు.

ఇంతసేపు ప్రశాంతంగా ఉన్న నీళ్లు గాలికి కెరటాలుగా లేచి ఎగిరిపడుతున్నాయి. తనని బలిమి చేస్తున్నట్లు నోరు తెరిచాడు సీతారామయ్య.

"ఏం– అలా అడిగావు?"

జవాబు నాశించిన వాడికి ప్రశ్నే ఎదురైతే అవాక్కయిపోతాడేమో? మాధవరావు అవాక్కయ్యాడు.

"చాలా క్షణాల తరువాత అడిగాడు– "వేణు గురించి లోకం ఏమనుకుంటుందో ఆలోచించారా?"

"లోకానికి లెక్కలేనన్ని నాలికలు. రకరకాలుగా చెప్పుకుంటుంది. దాన్ని మన మెందుకు పట్టించుకోవటం?"

"మనం కూడా ఈ లోకంలో ఒక భాగం కనక."

"కావచ్చు!" అంతకంటే మరోమాట అనలేకపోయాడు సీతారామయ్య.

"వేణు ఎవత్తెవో ఉంచుకుని, పట్నంలో ఉన్నాడట. అందుకే రావటం లేదట."

నోటలోని గడ్డిపోచను కొరికేసి, గాలిలోకి ఉమిశాడు మాధవరావు.

ఏదో ముంచుకొస్తున్నట్టూ, మనసుకంటే బలమైందేదో పేలిపోతున్నట్టూ భయంకరమైన అనుభూతులు సీతారామయ్యలో నాట్యం చేశాయి.

"అది నిజం కాదు!"

"కాకపోతే అసలు వేణు ఎందుకు రావటం లేదూ?"

"అది ఘోరమైన కథ."

"చెప్పలేరా?"

"వింటుంటే.. నీ కర్ణపుటాలు పగిలిపోతాయేమో?"

"ఫరవాలేదు మాస్టారూ?" మాధవరావు నేలకేసి చూస్తూ మరో గడ్డిపోచని పీకి వేలికి చుట్టుకుంటున్నాడు చిన్నపిల్లాడిలా.

చెరువుగట్టు నానుకుని ప్రవమిస్తున్న కాలవలోకి దృష్టి సారిస్తూ సీతారామయ్య తన గుండెని పెకలించి మాధవరావు ముందు పెట్టాడు. ఆ గుండె చెబుతున్న గుసగుసల్ని తీవ్రంగా వింటున్నాడు మాధవరావు.

"వేణు ట్రాన్స్‌ఫర్ మీద పట్నం వెళ్లిన మరునాడే మా గుండెలో వేదన మొలిచింది. రోజురోజూ ఆ వేదన చిన్న చెట్టుగా పెరుగుతూ పోయింది. పట్నం వెళ్లి నెలదాటినా, వేణు నుంచి ఒక్క ఉత్తరం ముక్క కానీ, వేణు కానీ రాకపోయేసరికి, ఆ వేదన కాస్తా మహావృక్షమై కూర్చుంది.

"పార్వతి బలవంతం మీద స్కూలుకి రెండు రోజులు సెలవు పెట్టి బయలుదేరాను. పార్వతి పసికందు తల్లి కావటం వల్ల, ఆమెను వదిలి వెళ్లవలసి వచ్చింది.

పట్నంలో అడుగు పెట్టినప్పటి నించి కాలాపకుండా తిరిగాను.

నాకు తెలిసిన వేణు ఫ్రెండ్సందర్నీ అడిగాను. ఫలితం లేకపోయింది.

చివరికి వేణు క్లాస్‌మేటూ, నా స్టూడెంటూ అయిన శేఖరం అబిడ్స్‌లో కలిశాడు. వేణు విషయమంతా అతడి ముందుంచాను. వెంటనే శేఖరం ఎంతో బాధపడిపోయాడు. పోలీస్ రిపోర్టిద్దామని నన్ను స్టేషన్‌కి లాక్కెళ్లాడు.

శేఖర్ ఇన్‌స్పెక్టర్‌తో అన్ని విషయాలూ చెప్పాడు. ఇన్‌స్పెక్టర్ అంతా అర్థమైనట్లుగా తల పంకించి, నొసటి కణతల మీద రెండు చిటికెలు వేసుకుని లేచాడు.

"ఫోటో ఉందా?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నకి ఏం జవాబు చెప్పాలో నాకు తోచలేదు.

"ఇక్కడ లేదు, ఆ ఊళ్లో ఉంది." అన్నాను. వెంటనే శేఖర్ అందుకున్నాడు.

" నా దగ్గర మేం చదువుకుంటున్నప్పుడు తీయించుకున్న గ్రూప్ ఫోటో ఉంది. తెమ్మంటారా."

"ఆల్‌రైట్. మీరు వెళ్లి ఫోటో తీసుకురండి. ఈలోపల మా సబ్‌స్టేషను లన్నింటికి ఫోన్ చేసి కనుక్కుంటాను. సమాచారమేమైనా దొరుకుతుందేమో!"

"మంచిది!" శేఖర్ లేవడంతో అతని వెనకాలే నేను లేవక తప్పలేదు.

ఫోటో తీసుకుని వెళ్లేసరికి ఇన్‌స్పెక్టర్ కుర్చీలో కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు. మమ్మల్ని చూడడంతోటే ఈ లోకంలోకి వచ్చి, "ఫోటో తెచ్చారా?" అన్నాడు.

శేఖర్ హ్యాండ్‌బాగ్‌లోంచి ఫోటో తీసి ఇన్‌స్పెక్టర్‌కి దగ్గరగా జరిగి వేలు పెట్టి చూపించాడు.

"ఇతనేనా?" అన్నట్టు ఇన్‌స్పెక్టర్ నావైపు అదోరకంగా చూసి టేబుల్ డ్రాయర్ లాగాడు. ఓ ఫోటో తీసి నా చేతికందించాడు.

" ఈ ఫోటో చూడండి."

ఫోటో చూడడంతోటే జరగరానిదేదో జరిగినట్లూహించుకుని దిగ్భ్రాంతి పొందాను. అది వేణు ఫోటో. పాతాళంలోకి జరిగిపోతున్నట్లవస్థ పడుతున్న నేను తొట్రుపాటుతో ఏమేమో అనేశాను.

"ఫోటో మీకెలా వచ్చింది? ఇప్పుడెక్కడున్నాడు, ఇన్‌స్పెక్టర్? నా వేణు ఎక్కడున్నాడో త్వరగా చెప్పండి!"

"అనవసరంగా గాభరాపడకండి, సీతారామయ్యగారూ." అని ఓదార్చుతూనే టేబుల్ డ్రాలో చేయి పెట్టాడు మళ్లీ. నా గుండె మరింత టప్ టప్'మని కొట్టుకోసాగింది.

ఓ ఉత్తరం తీసి నా చేతికిచ్చాడు.

కళ్లలో తిరుగుతున్న నీటిబిందువుల్ని చేత్తో తుడుచుకుని, అక్షరాల్ని గబగబా వేతికాను.

"నాన్నా!

బాబు జాగ్రత్త! ఎలాగైనా పార్వతిని, బాబునీ పువ్వుల్లా చూసుకోండి. బాబులో నా రూపాన్ని చూసుకొని అయినా బాబుని నా అంతవాణ్ణి చెయ్యండి. మీ నీడ పార్వతికి, పార్వతి నీడ బాబుకీ లభించేలా చూడండి. బాబు అనాథ కాకూడదు.

మీ కొడుకు
– వేణుమూర్తి"

"నా కళ్లలోంచి కన్నీటిబిందువులు రాలి, నా ధోవతి మీదే పడుతున్నాయి. ఇన్‌స్పెక్టర్ ఏదో చెబుతున్నాడు. ఆ మాటలు చెవుల్లోకి 'గుయ్' మంటూ దూసుకు వెళుతున్నాయి.

"ఆ ఉత్తరం మీద ఏదో అడ్రస్ రాయాలని ప్రయత్నించినట్టున్నాడు. "సీతారామయ్య, పోస్ట్! రాజ..'అని రాసి ఉంది. అప్పటికే కలంలో సిరా అయిపోయిందేమో?"

"ఇన్‌స్పెక్టర్ నా వేణుకేం జరిగింది? ఇప్పుడెక్కడ.."

"తొందరపడకండి!" నా ఆత్రుత ఆయనకేమర్థమవుతుంది? నన్ను ఓదార్చాలని ప్రయత్నిస్తూనే విషయం బయట పడేస్తున్నాడు.

"సరిగ్గా ఆరు రోజుల కింద– హుసేన్‌సాగర్ ఫుట్‌పాత్ మీద ఎవరో గుర్తు తెలియని వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడని రిపోర్ట్ వచ్చింది. వెంటనే మేము అక్కడికెళ్లి చూశాం."

"అసలు విషయం చెప్పండి.. ఇన్‌స్పెక్టర్!" నాలో ఎంత దుఃఖం పెల్లుబికినా సరే, ఇన్‌స్పెక్టర్ తన విధి నిర్వర్తించేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

"అతను ఒళ్లు తెలియకుండా పడిపోయాడు. అతని జేబులో ఈ ఉత్తరం, సిరా లేని పెన్, 'పే' రిసీట్ తప్ప ఏమీ లేవు!"

"నా కళ్లలోంచి దూకుతున్న కన్నీళ్లు చూచాడేమో– "ఏడవకండి సార్! ఏడ్చినంత మాత్రాన ఏం ఒరుగుతుంది? కర్తవ్యం ఆలోచించాలి కాని..." కాస్త ధైర్యాన్ని బోధించినట్టే బోధించి చెప్పుకుపోతున్నాడు.

"ఆ వ్యక్తిని కదిపి చూశాం. నిజానికతను స్పృహ తప్పి పడిపోలేదు." ఆ మాట వినడంతోనే నాలో కొంచెం తృప్తి.. కొంచెం శాంతి తొంగి చూశాయి. కానీ, అవి ఎంత సేపో నిలువ లేదు. నీటిబుడగల్లా టవ్‌మని పేలిపోయాయి.

"అతను విగతజీవుడయ్యాడు."

"ఇన్‌స్పెక్టర్! ఎంత ఘోరం జరిగింది ఇన్‌స్పెక్టర్!" రుద్ధకంఠంతో పెద్దగా అరుస్తూ దుఃఖంలో కూరుకుపోయాను. ఇంకా ఏవో మాటలు చెవుల్ని వెంటాడుతూనే ఉన్నాయి.

"శవపరీక్ష జరిగింది. అతను గొంతు నులిమి చంపబడ్డాడని తేల్చాడు డాక్టరు. చేసేదిలేక ఆ చనిపోయిన ముఖాన్ని ఫోటో తీసి, శవాన్ని స్పెషల్ గ్రేవ్‌యార్డ్‌లో పాతిపెట్టాం."

"ఆనాడు జీతాలిచ్చే రోజు కాబట్టి, 'పే' రసీట్ ఆధారంగా అతని వద్ద కొంత డబ్బుండాలనీ, ఆ డబ్బు కోసమే ఎవరో ఈ హత్యచేసి, డబ్బు దోచుకుని వెళ్లారనీ మా డిపార్ట్‌మెంట్ సర్వేలో తేలింది."

"మధ్య మధ్య అరుస్తూ ఏకబిగిపి ఏడుస్తున్న నా ఏడుపును పట్టించుకోకుండా విషయమంతా ఒలకబోశాడు ఇన్‌స్పెక్టర్.

"శేఖరం కూడా కళ్లకి నీళ్లు తెచ్చుకున్నాడు.

"ఏడ్చి ఏడ్చి కళ్లలో నీరింకిపోయింది తప్ప వేణుని గురించి నేనేం చేయగలను? ఏడిస్తే పోయిన ప్రాణం తిరిగి వచ్చేట్టుంటే బాగుణ్ను! అని రకరకాలుగా నా ఊహల్ని తడుముకున్నాను.

"ఇన్‌స్పెక్టర్, శేఖర్ నేను– ముగ్గురం కలిసి కర్తవ్యం ఆలోచించాం.

"పితృప్రేమకు దూరమైపోయిన 'బాబు'ని మాతృప్రేమకు దూరం చెయ్యకూడదు. వేణు చనిపోయాడని తెలిస్తే పార్వతి మంచం పడు తుంది. బాబు సరైన దిక్కులేక విలవిలాడిపోతాడు. పరిస్థితులు విషమిస్తే అటు పార్వతి.. ఇటు బాబు.. అంతకంటే ఆ ఆలోచనని సాగదీసే ధైర్యం ఎవరిలోనూ లేకపోయింది.

"అందుకే, మాధవా, ఈ విషయాన్ని పార్వతికి, ఈ లోకానికీ అందకుండా దాచిపెట్ట వలసి వచ్చింది.

"పార్వతిలో వేణు బతికి ఉన్నాడనే విశ్వాసం కలిగించడానికే ఈ ఉత్తరాలు. అంతేకాక, పట్నం వెడదామని పార్వతి గొడవ పెట్టేది. అటువంట పుడు తప్పనిసరి అయి సజీవంగా నటించడం నేర్చుకున్నాను.

"ఏం చేయను? 'పార్వతి, బాబు' రెండు ప్రాణాలు బతకాలంటే, బాబులో వేణుని చూసుకోవాలంటే ఈ సాహసాలు చేయక తప్పలేదు," అని ముగించి, ధోవతి చెంగుతో కళ్లను ఒత్తి పట్టుకున్నాడు సీతారామయ్య.

"మాధవరావు నిర్విణ్ణుడై పోయాడు. మళ్లా సీతారామయ్యే అన్నాడు!

"పార్వతికి నమ్మించడం మోసమే కావచ్చు. అంతా వేణు ఆత్మశాంతి కోసమేనని కూడా అనుకోనక్కర్లేదు. అందులో నా స్వార్థమూ ఉండచ్చు! లేదనను. అయితే, ఒక్కటే! నా మనసు చెప్పినట్టల్లా చేస్తూ జీవితాన్ని ఈదడం తప్ప నాకేమీ కనిపించలేదు."

కాసేపు ఏదో ఘోరమైన క్రియకు సానుభూతి ప్రకటించినట్లుగా ఇద్దరూ మౌనం పాటించారు.

"తప్పంటావా మాధవా?"

మాధవరావు నిరుత్తరుడుగా మిగిలాడు. తన కళ్లని పీకేస్తున్నట్టు, అనుకోకుండా తన చెవులు పేలిపోతున్నట్టు మథనపడక తప్పలేదతనికి.

బయటపడుతున్న కన్నీళ్లతో అప్పటికే గట్టు మీద తడి ఏర్పడింది. చంద్రుడిలా గుండ్రటి బింబం.

"మాస్టారూ, మీ గుండె నిబ్బరం.. నిండుతనం.. ఏ చరిత్ర పేజీల్లోను చదవలేదు, చదవలేను కూడా." సీతారామయ్య మాస్టారుని అంతకంటే గొప్పగా పొగడడానికి మాటలు దొరకలేదు మాధవరావుకి.

సీతారామయ్య తన బాధను అదిమిపెడుతూ లేచి నిలబడ్డాడు గంభీరంగా.

"రాత్రవుతూంది, వెళదామా?"

చేతికి చుట్టుకున్న గడ్డిపోచనెందుకో పంచెలో దోపుకుని బయలుదేరాడు మాధవరావు. సీతారామయ్య బరువుగా అడుగులు వేసుకుంటూ ముందు వెళుతూంటే మాధవరావులో మాస్టారు పట్ల ఏదో కొత్త గౌరవభావం కలిగింది. ఆ భావాన్ని పదాల్లోకి వివరించుకోసాగారు.

'సూర్యుడు తను మండిపోతూ చంద్రుణ్ణి చల్లగా ప్రకాశింపజేస్తాడు. ఆ చంద్రకిరణాలతో ఎన్నో బతుకుల్ని చుక్కల్లా వెలిగిస్తాడు. అచ్చం మాస్టారూ అంతే! మాస్టారు సూరీడు!' అనుకున్నాడు మాధవరావు.

దూరంగా కనిపిస్తున్న సీతారామయ్య ఇంట్లో దీపం– పార్వతి నుదుటి బొట్టులా దివ్యంగా వెలుగుతూనే ఉంది.

చక్కటి రచనకు శ్రీకారం

అక్షరక్షరం లక్షలింతలై
విలక్షణ వైపు సులక్షణంగా
సాగేవరకూ సాధించేవరకు
మనసు మధించి
లోకాన్ని సోధించి
ప్రగతిని సాధించే
అక్షరాల్ని సంధిస్తూ–
వాక్యాలను పరిగెత్తించి
మంచి భావాన్ని మనసున ఒంపి
సమసమాజ నిర్మాణం కోసం
నవతరానికి నాంది కోసం
చైతన్యంతో చేతులు కలిపి
నవచేతనమై నడుం బిగించి
పదం పదాన్ని కదం తొక్కించి
జనాన్ని ఉత్తేజ పరిచి
జాతిని లేపే ధ్యేయమే పనిగా
కవన చక్రాన్ని వేగమై నడిపించు–
మనిషి మనసులో చొచ్చుకుపోయి
యువత గుండెల్లో హత్తుకుపోయి
నిద్రావస్థల మెలకువ నుంచి
కమ్మిన చీకటి చీలిక నుంచి
అజ్ఞానపు బీటల లోతుల నుంచి
చురుకుదనంలా పరిగెత్తించి
చైతన్యం అక్కడే మొలకెత్తేలా
అక్షరక్షరం రక్షణ కవచమై
పరుచుకునేలా తలుచుకునేలా
రాయాలి రాసి చూపాలి
కుతంత్రపు దారం తెంపడానికై
అమానుషత్వం తుంచడానికై
తారతమ్యాలను చీల్చడానికై
కలం పోటుతో గళం ఘాటుతో
నరం నరంలో చురుకుదనంగా
కదిలే కవనమై ఒకటే గమనమై
ఒకటే మననమై ఒకే గమ్యమై
జోగుతున్న జన గనాన్ని లేపే
చురుకుదనాల భావం కలిపే
సమసమాజపు శ్రేయస్సును కోరే
చక్కటి రచనకు శ్రీకారం చుట్టు
మార్పును కోరే దిశగా
నిర్భయంగా రచించు–

–నరెడ్డుల రాజారెడ్డి
9666016636

ఆపదలో ఆలోచన

కథ

అనగనగా నాగిల్ల అనే ఊరిలో భానుప్రియ, సహస్ర అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వారిద్దరూ ఎక్కడికి వెళ్లినా కలిసి ఉండేవారు. ఒకసారి అనుకోకుండా ఇద్దరు దొంగలు వారిని చూసి ఎత్తుక పోవాలని అనుకున్నారు. దొంగలు సమయం కోసం చూస్తున్నారు. భానుప్రియ, సహస్ర ఇద్దరు కూడా దొంగల రాకను గమనించారు. దొంగలు ఎలాగైనా మనల్ని ఎత్తుకుపోతారు అనుకున్నారు.

ఇద్దరూ ఎలాంటి కంగారు లేకుండా మామిడి చెట్టు దగ్గరికి వెళ్లారు. దొంగలు కూడా వారి వెనకాల వస్తున్నారు. మామిడికాయలు రాలగొట్టడానికి రెండు రాళ్లు తీసుకుని వెనకాల తిరిగి దబిమని అని దొంగలను కొట్టారు. రాళ్లు సరిగా దొంగల తలకు తగలడంతో అబ్బా అంటూ కింద పడ్డారు. మామిడికాయల కోసం తెచ్చుకున్న ఉప్పు కారం ఇద్దరు దొంగల కండ్లకు పూసి దొంగలు దొంగలు అని అరిచారు. చుట్టుపక్కల వాళ్ళు వచ్చి ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. భానుప్రియ, సహస్ర తెలివికి అందరు మెచ్చుకున్నారు.

నీతి: ఆపద వచ్చినప్పుడు ఆలోచనలతో బయటపడాలి

–కీర్తన
ఆరవ తరగతి
జడ్‌పిహెచ్ఎస్ హవేలీ ఘనపూర్
మెదక్ జిల్లా, 9010214106

నన్ను అడవిలో వదలండి

మీ అందరి ఆత్మీయతతో
నన్ను అడవిలో విడిచి పెట్టండి..
ఆత్మశాంతితో బతుకుతాను..
కొత్త భాష్యంతో
కొత్త భాష నేర్చుకుంటా!!
కొత్త నడకతో
ఓ కొత్త వరవడి
అలవర్చుకుంటా!!–
చెట్టు..చేమ వాగు..వంకతో
సంబంధం పెంచుకుంటూ..
ఓ కళాత్మక హృదయంలో
సాటిలేని రసజ్ఞతతో పెరిగి
కోరిన కోరికలు తీర్చే
అడవితల్లి ఒడిలో
ఆనందంగా జీవిస్తాను–
ఏ కట్టుబాట్లు లేని కాలం..
ఏ సంస్కృతీ లేని కరవాలం..
పిలుపు లేదు మలుపు లేదు
బంధుత్వాలు బాధలు లేవు
అనుబంధాల ఆలోచనలు లేవు
మానసిక ప్రశాంత సౌరభాలే
ఎక్కడ చూసినా నిలువెత్తు వనాలు
ప్రతి చెట్టు అనన్య సామాన్య
ప్రతిభా సంపన్నమే...
అడవిలోని
చేను..చెలక, చెట్టు..పుట్ట
చైతన్య భావాలే!!–
ప్రతి నిత్యం వీచే గాలుల మధ్య
మంగళ వాద్యాల చప్పుళ్ళే!!
సహజసంపద
నిజమైన పూలపందిళ్ళే!!
పక్షుల కువకువలు...
జంతువుల అరుపులు...
ఇదో అందమైన ప్రపంచం!!
నన్ను నేనుగా
అందంగా ఉండాలి...
ప్రపంచ సాహిత్యం అంతా
ఈ ప్రకృతిలోనే ఉంది!!
జీవితాలను సంస్కరించే శక్తి
అడవిలోనే ఉంది!!
ఆకట్టుకునే కథలెన్నో!!
ఆలోచింపజేసే వ్యథలెన్నో!!...
పశుపక్ష్యాదులు
అడవిని చూస్తే పరవశించిపోతాయి..
అందుకే నన్ను అడవిలో విడిచి పెట్టండి!!
ఓ కొత్త చదువుకు పునాది వేసుకుంటా!!
కొత్త సాహిత్యం నేర్చుకుంటూ...
ఓ కొత్త విశ్వాసంతో సాగిపోతా!!
ఒడిదుడుకులు లేని
ఆత్మీయత కలిగిన
అనురాగం అందుకుంటా!!
మేధో వికాసానికి మేధాశక్తికి
నిజమైన నిలయం..
కుళ్ళు కుతంత్రాలు లేని
మానవీయ వనం
ఇదో నిజమైన దార్శనికత స్థలం!!–
తరువులే గురువులుగా భావించుకున్నా!
ఓ కార్యసాధన కొరకు ఇక్కడే చదవాలి..
అనుకున్న లక్ష్యం సాధించడానికి
ఇక్కడే ఉండాలి...
ఓ దృఢ సంకల్పంతో
అనుకున్నవి సాధించాలి...
అడవి అంతరంగం ఎరిగినోణ్ణి...
అంతటా తిరగలను...
ఆకుపచ్చని అందాల
సొబగులు నా హృదయాన్ని
సుతారంగా స్పృశిస్తున్నాయి...
ఓ రకమైన ఆర్తితో భావోద్వేగంతో
గుండెలో నిండుకున్న
బాధతో చెబుతున్నా!!
నన్ను అడవిలో వదలి పెట్టండి...
స్వేచ్ఛాగీతం
ఆలపిస్తూ ఉంటా!!

–అంబటి నారాయణ
9849326801

చెమట చుక్క?!

దేహం నుండి రక్తం వదిలిన
మలినమే అయినా
శరీర సమతా స్థితిని
నిలిపేదే చెమట చుక్క–
వేసవి వేడికి చెమట చుక్కే
పొక్కయి చిరాకు పెంచుతుంది
ఆ చెమటే చల్ల గాలికి ఆరిపోతూ
మనసుకు హాయిని గొల్పుతుంది–
పురిటి నొప్పులలో
అమ్మ నుదుట నిలిచే చెమటే
బిడ్డకు జీవపు ఊట
దగా పడిన జాతుల ఆక్రోశాల
పోరాటాలలో మండే మంట చెమట చుక్క
కార్మిక శ్రామిక కష్ట జీవుల
ఆకలి బాధల ఆవేదన చెమట చుక్క –
శ్రమించే శరీరంలో ఉచ్ఛ్వాస నిచ్వాసల
సమర ఫలితం చెమట చుక్క.
నడినెత్తిన తారేత్తిస్తున్న ఎండను సైతం లెక్కచేయక
చిరు వ్యాపారుల జీవన పోరాటమే చెమట చుక్క.
సేద్యపు రైతుల శరీర చెమటే
మన కడుపు నింపే ఇంటి వంట
సంతలో దళార్ల చేతి వాటపు కాసుల పంట–
క్రీడాకారుని చెమట చుక్కల పోరాటమే
తన గెలుపు శ్వాస
పండు వెన్నెల చల్లదనంలో
పరువపు మధుర ప్రేమ దాహం చెమట చుక్క–
జండా పట్టిన కార్యకర్తల చెమట చుక్కలే
పెత్తనం దార్ల ప్రభుత్వ అర్వత ఆగడాలు
దేశ సరిహద్దుల్లో సిపాయుల
కావాత్తుల శ్రమలో కార్చే
చెమటే దేశానికి రక్ష..



–డా॥ సుధాకర్ గుమ్మడి
9440125495

నాటి తరం వారి కథలు నేటి తరానికి
కథల వంతెన

1987లో వ్రాసిన కథ

కృష్ణయానం

కథ

–రాళ్ళబండి కవితా ప్రసాద్

మహాభారత యుద్ధం పూర్త యింది. శ్రీకృష్ణుడికి ఏమీ తోచడం లేదు. ఎవరి పనుల్లో వాళ్లున్నారు. బృందావనానికి వెళ్లొచ్చాడు. రాధ కూడా లేదు. అక్కడ తులసి మొక్కలన్నీ నిద్రిస్తున్నాయి. పొగడచెట్లు కూడా దిగులుగా ఎండిపోయినయ్. వెదురు కర్రల కుటీరాలన్నీ నాదాన్ని కోల్పోయిన వేణువుల సమూహంలా ఉన్నాయి. మధురానగరం తీయదనాన్ని కోల్పోయినట్లుంది. ద్వారక మీద ఏదో పెద్ద నీటి బుడగ వాలబోతున్నట్లు ఒకటే భ్రమ. మనుషులు మాట్లాడ్డం లేదు. వస్తువులే మాట్లాడుతున్నట్లుంది. సంపద పెరిగితే బంగారం, ఇళ్లు, రథాలు, మనుషులకన్నా గౌరవాన్ని పెంచుకుంటాయి. అదే ద్వారకలో జరుగుతోంది. హస్తినాపురంలోనూ అలాగే ఉంది. ధర్మరాజు పరిపాలి స్తున్నది మనుషుల్ని కాదు. అక్కడి వస్తుజాలాన్ని. బూడిదగా రాలిపడ్డ శత్రురాజుల మధ్య విరోధాల గుట్టల్ని. అంతటా ఏదో నిర్లిప్తత. శ్రీకృష్ణుడికి ఏమీ తోచడం లేదు. అతని వయస్సు నూట ఇరవై ఐదు సంవత్సరాలు. శరీరకాంతి తగ్గలేదు. తేజస్సు మసకబారలేదు. మనస్సే కాంతిహీనంగా ఉంది. రాత్రిపూట నిద్రపట్టడం లేదు. ఆరోజు కూడా అలాగే నిద్రపట్టని రాత్రిని గడిపి ఉదయమే సముద్రపు ఒడ్డుకు ఒంటరిగా చేరుకున్నాడు కృష్ణుడు– కెరటాలు ఇసు క కలిసే శీతల రేఖపై నడుస్తున్నాడు.

భీష్ముడి నెరిసిన గడ్డంలా ఉంది సముద్రపు కెరటాల బురుజు. కర్ణుడి పగిలిపోయిన స్వర్ణకవచపు ముక్కలు తేలియాడుతున్నాయా అన్నట్లున్నాయి. కెరటాలమీద సూర్యకాంతులు ద్రోణుడి తెగిపడ్డ శిరస్సులా ఉంది సముద్రం లో అల్లంత దూరంలో కనపడుతున్న నల్లరాయి. చావబోతున్న సైనికుల ఆర్తనాదాల్లా ఉంది సముద్రపు హో రు. యుద్ధరంగంలో వాళ్లు వీళ్లు ఆడిన అబద్ధాలు గడ్డ గట్టినట్లుంది. అక్కడక్కడా బురద. యుద్ధానంతర దహనక్రియల్లో వెలువడ్డ చితాభస్మం లా ఉంది తీరం మీది ఇసుక.

శ్రీకృష్ణుడు ఒంటరిగా ఇసకలో సముద్రానికి సమాంతరంగా నడుస్తు న్నాడు. అతని కాళ్లకు కెరటాల తడి అంటడం లేదు. కానీ, కళ్లలో ఎంత తుడిచినా ఆరని కన్నీటిపొర ఉంది.

యుగానికో యుద్ధం. ఖండానికో యుద్ధం. దేశానికో యుద్ధం. కుటుంబానికో యుద్ధం. మనిషి మనిషికీ ఒక యుద్ధం. మనస్సులో యుద్ధం. యుద్ధం సర్వాంతర్యామిలా ఉంది. యుద్ధం పదార్థంలో దాక్కున్న అగ్నిలా ఉంది. ఎవడో వచ్చి రగిలి స్తాడు. మంట– జ్వాల– జ్వాలలు– దహనం– భస్మం– ఆర్పేవాడెవ్వడు? ఎగదోసేవాడెవడు? అసలు రగిలించిందెవడు? శ్రీకృష్ణుడు నడుస్తు న్నాడు.

సృష్టిని సృష్టించేవాడు బ్రహ్మ. పెంచేవాడు విష్ణువు. సంహరించేవాడు శివుడు మరి యుద్ధానికి కూడా ఇలా త్రిమూర్తులుంటారా? సృష్టించి, పెంచి, ముగింపచేసే వాడు. ఈపని శివుడొక్కడే చేస్తాడేమో! ఇవి మనిషికి రాని ప్రశ్నలు. కృష్ణుడు చెప్పని సమాధానాలు.

> “సృష్టిని సృష్టించేవాడు బ్రహ్మ. పెంచేవాడు విష్ణువు. సంహరించేవాడు శివుడు మరి యుద్ధానికి కూడా ఇలా త్రిమూర్తులుంటారా?”

శ్రీ కృష్ణుడు అలా ఆగి, వెనక్కి చూశాడు. ఆయన చాలా చూడ్డం ఆకాశంలో నల్లమబ్బు ఒకటి సూర్యుడికేసి చూసినట్లుంది. అక్కడో పక్షి. తెల్లగా ఉంది. విచిత్రంగా ఉంది. కృష్ణుడు పరీక్షగా చూచాడు. దాని రెక్కలు సానపెట్టిన బంగారంలా మెరుస్తూ ఉన్నాయి. దాని కళ్లు ఇంద్రనీలాల్లా ఉన్నాయి. పొడవాటి రెండు ఎర్రటి పెద్ద పగడాల్లా ముక్కు రెండు పెద్ద పసుపు కొమ్ములకు వేళ్లు మొలిస్తే ఎలా ఉంటాయో అలా ఉన్నాయి దాని కాళ్లు.

స్వర్గలోకంలోని అమృత కలం పొంగి, బరావతం మీది నుంచి జారి, కల్ప వృక్షపుపూల మకరందాల్లో కలిసి, శచీదేవి దోసిట్లోంచి దొర్లిపోయి, నేలకు రాలిన సువర్ణ హిమామృత శకలంలా ఉంది ఆ విహంగం.

శ్రీకృష్ణుడికి ముచ్చటేసింది. అది సముద్రపు పక్షి కాదు. అలా అని నగరాల్లో ఉద్యానాల్లోను చూళ్లేదు. గమ్మత్తుగా ఉంది. ఏదో చాలా కాలం క్రిందట జరిగిన సంఘటన తాలూకు జ్ఞాపకంలా ఉందా పక్షి. గుర్తొచ్చీ, మరిచిపోతున్న ఆలోచనలా ఉంది పక్షి. తెలవారు ఝామునవచ్చిన అద్భుత స్వప్నంలా ఉంది పక్షి.

దాన్ని అలానే చూస్తూ నిల్చున్నాడు కృష్ణుడు. ఒడ్డుకు చేరే పడవ తీరంలోని దీప స్తంభాన్ని చూపినట్లు.

దానికేసి కదిలాడు. ఆ పక్షి మెదరిక్కించింది. ఆకాశం కేసి చూసింది. రెక్కలల్లార్చింది. దాని రెక్కల గాలి పారిజాతసుమాల పరిమళంలా వీచింది. అలా గాలిలోకి లేచింది. తెల్లని శంఖానికి రెక్కలొచ్చి పైకి తేలినట్లుంది. అలా తేలినప్పుడు కాళ్లతో చిమ్మిన ఇసుక నూరు రేకుల పద్మంలోంచి గుప్పున లేచిన పుప్పొడి పొగలా ఉంది.

ఆ విహంగాన్ని అందుకోవాలని కృష్ణుడు బయల్దేరాడు. మనస్సు వెంట బయల్దేరిన శరీరంలా, కృష్ణుడికి అందకుండా ఆ విహంం విలాసంగా వెళు తోంది. అందీ అందనంత దూరంలో నేలకు తాకీ తాకనంత ఎత్తులో ఎగరడం విశేషం. కృష్ణుడు పరుగు లాంటి నడకతో సాగుతున్నాడు. పై నుంచి నీలం రంగు శాలువా జారు తోంది. సరిచేసికుంటున్నాడు. కెరటాల కళ్లాపి చల్లిన తడి ఇసుకలో పరుగెడుతున్నాడు. పాదరక్షలు విడిచేసేశాడు. కృష్ణుడి పాదముద్రల్ని ముద్దాడాలని కెరటాలు గోపికల సమూహంలా నెట్టుకొస్తున్నాయి. ఆ పాద ముద్రల్లో నలిగిన నత్త గుల్లలు చిన్ని చిన్ని పాంచజన్యాలై మ్రోగుతు న్నాయి. రివ్వున వీచే గాలికి ముంగురులు, విడిచిన కేశపాశాలు శ్రీకృష్ణుని మనస్సు నుంచి రేగిపడే ఆలోచనల్లా ఉ న్నాయి. పరుగు పక్షి వెంట పరుగు. సముద్ర ఇసుక అల్లంతపైన అర్థచంద్రాకారం లా తిరిగింది పక్షి. అలా తిరగడంలో అక్కడ విదియనాటి చంద్రవంక గాలిలో ఎగురుతున్నట్లుంది.

> “శ్రీకృష్ణుడు వేణువు మోగిస్తున్నాడు. చెట్టుమీద పక్షి వింటోంది. దాని ముక్కు ఎర్రబడింది. దాని రెక్కలు కాషాయవర్ణంగా మారాయి”

పక్షి ముందుకు సాగుతోంది.

శ్రీకృష్ణుడు వెనుక పరిగెడుతు న్నాడు. ఇద్దరికీ అలసట లేదు.

శ్రీకృష్ణుడు తన వెంట పడుతున్న ట్లు పక్షికి తెలుసేమో! అందకుండా ఎగురుతోంది. పొద్దెక్కు తోంది. పక్షి పైపైకి ఎగిరిపోయింది. కృష్ణుడు ఆగా డు. నుదుటి మీద చెయ్యి వేసుకుని నీలాకాశంలోకి చూశాడు. పక్షి మబ్బు ల్లోకి అందకుండా ఎగిరిపోయింది. కృష్ణుడికి ఆశాభంగం. అందీ అం దని ప్రౌఢ గోపిక పవిట చెంగు దొరకనప్పుడు కలిగిన ఆశాభంగం కాదిది. యశోదమ్మకు వెన్న దొంగతనం చేసినప్పుడు పట్టుబడ్డ ఆశాభంగం కాదిది. యమున ఒడ్డున గానుగ చెట్ల క్రింది రాత్రిపూట ఎదురు చూస్తానని చెప్పిన రాధ అక్కడికి రానప్పుడు కలి గిన ఆశాభంగం కాదిది. ఇది బాల్య యౌవనాల అనుభవాల తాలూకూ ఆశాభంగం కాదు.

రాయబారం విఫలమైనప్పుడు, ద్రౌపది వస్త్రాపహరణంలో భీష్మద్రో ణుల మౌనంతో చూపిన ఉపేక్ష గురించి విన్నప్పుడు, పాండవుల లక్క ఇల్లు తగలబడ్డప్పుడు, కర్ణ రహస్యం కర్ణుడికే చెప్పి అతనితో విముఖంగా మాట్లాడించుకున్నప్పుడు, దుర్యోధన పతనం తర్వాత గాంధారి ముఖం చూసినప్పుడు, ఉప పాండవుల హత్య తర్వాత యాజ్ఞసేని కన్నీరును చూసినప్పుడు, అభిమన్యు వధ తర్వాత అర్జునుణ్ణి పలకరించినప్పుడు , ఉత్తర గర్భంలో పరీక్షిత్తుని రక్షించేటప్పుడు కలిగిన భయంలాంటి ఆశాభంగం కూడా కాదిది.

అర్థం కాని ఆశాభంగం. ఆశలేని వేళ ఆశ కల్పించి ఆశ తీరకుండా చేసిన ఆశ చేసిన ఆశాభం గం. ఈ పక్షిని చూస్తే ఇవ్వన్ని ఎందుకు గుర్తొస్తున్నయో కృష్ణుడికి తెలియదు. దాన్ని వెంటాడేది ఎందుకో తెలియదు. ఆ పక్షి మూలమేమిటో అది ఎక్కడికెళ్లిం దో తెలియదు. కృష్ణుడు నవ్వుకాని నవ్వొకటి నవ్వాడు. ఎండ చురచుర మంది. ఇంటికి బైల్దేరాడు. కానీ అతణ్ణి ఇప్పుడు ఆ స్వర్ణవిహంగం తాలూకు జ్ఞాపకం వెంటాడుతుంది. కృష్ణుడికి నమస్కరిస్తూ సముద్రం, అల్లుణ్ణి సాగనంపుతున్న మామలా ఉంది.

××

పగలు గడిచింది. సాయంత్ర మైంది.

కృష్ణుడు ద్వారకానగరానికి అల్లంత అవతల తాను సొంతంగా పెంచు కున్న గానుగచెట్ల తోటలోకి వెళ్లాడు. ఒంటరిగా.. అక్కడ గానుక చెట్లే కాదు. ఎన్నో వృక్షాలున్నాయి. ఎక్కువగ గానుగ చెట్లు.

శ్రీకృష్ణుడు ఎక్కడికెళ్లినా ఈ పృథ్వి కాంతంగా వెళు తున్నాడు. రథాన్ని, సారథిని తీసికెళడం లేదు. నడిచే వెళు తున్నాడు. తోట ఎప్పటిలాగే ఉంది. తను ఎప్పటిలా లేదు. తన తమాల వనంలో ఎన్నెన్నో అందాలు సృష్టించు కున్నాడు. అక్కడి పూల మొక్కలు, పక్షులు కుందేళ్లు, లేళ్లూ, నెమళ్లు, పాములు, వెదురుపొదలు, కీచురాళ్లు, సీతాకోక చిలుకలు, తుమ్మెదలు అన్నీ తనవే. పరిచయ మైనవే. ఆ తోట చిత్రమైంది. ఆ తోటలో ప్రతి ప్రాణీ కృష్ణుడికీ రహస్య గూఢచారే.

తన కన్నా ముందు అక్కడి రుక్మిణీ దేవి వచ్చి వెళితే, ఆ విషయాన్ని ఒక చిలుకవచ్చి కృష్ణుడి చెవిలో చెప్పిపోతుంది. సత్యభామ వచ్చి ఎదురుచూసి అలిగి వెళ్లిందనే వైనాన్ని ఒక తాచుపాము పడగెత్తి బుసకొట్టి వివరిస్తుంది. జాంబవతీ వైనాన్ని భల్లూక ఢింభకం పల్లిగిలిస్తూ చెపుతోంది. సుదంత వచ్చిన సంగతి గురించి దానిమ్మ పండు పగలబడి నవ్వుతూ ప్రకటిస్తుంది. ఇక ఎంత మంది ప్రియురాండ్రు తన కోసం వచ్చి వెళ్ళిపోయ్యారో ప్రతిపూల పొద లెక్కబెట్టి, పూలురాల్చి మరీ నిశ్శబ్ధంగా చూపిస్తుంది. ఆ ఉద్యానవనం అతని కొక ఆత్మీయరహస్యం. అవనం అతనికి మానసిక బృందావనం.

కృష్ణుడు తోటకొచ్చాడు. తోటలోని ప్రతి జీవపదార్థంలోని ప్రాణశక్తి శక్తి మేరకు తొంగిచూస్తోంది. చెట్లకు చిగురుటాకులు కళ్లయ్యాయి. పాములకు అతని మేని పరిమళం ఆహారమైంది. లేళ్లకు అతని పద ధ్వనులు వేణ/నాదాలైనాయి. పూలని అతని చూపులు గుసగుసలుగా మార్చాయి. ప్రతి ప్రాణిలోనూ చైతన్యం తొణికిసలాడింది.

కృష్ణుడు అలా తోటలో నడుస్తున్నాడు. ఒక ఉడుత తన చిట్టి చేతులతో విసిరిన గింజ కృష్ణుడి నెమలీక మీద పడింది. దాంట్లో ఇరుక్కుంది. దాన్ని చూసిన నెమలి కన్నె ఒకటి క్రేంకారం చేసింది. కృష్ణుడు నవ్వాడు. కుందేలు పిల్ల ఒకటి అతని పాదాల మీద నుంచి పరు గెత్తింది. పాదస్పర్శతో అది పుల కరించి వెనుదిరిగిచూసి అలాగే ఆగిపోయింది. తోటతోటంతా కృష్ణుడితో లీనమౌతున్నట్లుంది.

సూర్యనారాయణుడు పడమటి కొండెక్కుతున్నాడు. ఎందుకో కృష్ణుడికి ఎడమ కన్ను ఆదిరింది. ప్రక్కనే ఉ న్న సదస్సులో ఉన్న నీలి కలువరేకు ఒకటి గాలికి కదిలిరాలింది. కృష్ణుడి భ్రుకుటి ముడిచింది. నారి లేని ధనుస్సులా రెండు కనుబొమ్మలు కలుసుకున్నాయి.

తమాలవృక్షం నీడన రాతిగద్దె మీద కూర్చున్నాడు. వెచ్చగా ఉంది. లేచాడు. పైకి చూశాడు. ఆశ్చర్యం. చెట్లు గుబురుల్లో పాదున చూసిన సముద్రపు పక్షి. ఇప్పుడది తెల్లగా లేదు. నల్లగా ఉంది. దాని కళ్లు ఇంద్రనీలాల్లా లేవు. వజ్రాల్లా ఉన్నాయి. దాని ఈకలు ఇనుపరేకుల్లా ఉన్నాయి. దాని ముక్కు స్ఫటికంలా ఉంది. దాని కాళ్లు మదించిన ఏనుగు దంతాల్లా ఉ న్నాయి అది చెట్లు మీద కూర్చొని ఉంది. కృష్ణుడు చూశాడు. దాన్ని పట్టుకోవాలనుకున్నాడు. పై శాలువాని నడుముకు కట్టుకున్నాడు. చెప్పులు విడిచాడు. జీరాడే పట్టుపంచె కాశెపోసి బిగించాడు. ఒక్క ఉదుటున చెట్టు మొదలు పట్టుకొన్నాడు. చెట్టు కొమ్మల మొదట్లోకి చేరాడు.

కృష్ణుడి చేత కౌగిలించబడ్డ చెట్టు. ప్రౌఢయౌవని గోపికలా మారింది. తమకంలో పడింది తమాలవృక్షం. ప్రతి కొమ్మలో ప్రణయోత్సేకం. ప్రతి ఆకులో చుంబనోద్రేకం. కృష్ణుడి స్పర్శతో బెరడులన్నీ చిగురులుగా మారాయి. చెట్టుకు రోమాంచంలా కలిగిందా అన్నట్లుంది. చెట్టు వణికింది. దాని మూలంగా దాని మీద చిలుకలు, కోయిలలు, పిల్ల నెమళ్లు, పిచ్చుకలు, అడవికోళ్లు, అన్నీ ఉలిక్కిపడి ఎగిరిపోయాయి.

కృష్ణుడు వెంటాడుతున్న పక్షి మాత్రం కదల్లేదు. ఆ కొమ్మల్లోనే కూర్చుంది. శరీరం కదపకుండా మెడ పక్కకువంచి, తన పొడవాటి ముక్కుని ఒక్కసారి తిప్పి, వజ్రనేత్రాలతో కృష్ణుడిని ఓసారిచూసి, కళ్లు మూసు కుని, మెడతిప్పేసి, నిశ్శబ్దంగా ఆకాశంలోకి చూసింది. ఆకులు రాలిన ఎండు కొమ్మలా ఉంది దాని ముక్కు. కృష్ణుడు దాన్ని పట్టుకోవాలని కాళ్ళని నిగడదన్ని పై కొమ్మపైకి ఎగబాకాడు. పైకి ఎగిరింది పక్షి. మరో కొమ్మ మీద వాలింది. దాని తెల్లని ముక్కు మీద చంద్రకాంతి తళుక్కుమంది. నల్లని చెట్టు మీద పొడుచు కొచ్చిన వెన్నెల కోరలా ఉంది దాని ముక్కు. చెట్టుకొ మ్మల మీద వాలిన కొత్త మబ్బుతునకలా ఉంది పక్షి.కృష్ణుడు ఆగాడు. దానికేసి చూశాడు. ఏదో తెలియని అశాంతి. దానికేసి వెళ్లాలనిపించలేదు. అలా అని చెట్టుదిగాలనీ అనిపించలేదు.

ఆ చెట్టుకు ఆరు కొమ్మలున్నాయి. ఆరు కొమ్మలో ఆరు ఋతువులు వాలినట్లుంది. అది సార్వకాలిక కాల వృక్షంలా కనిపిస్తుంది. నాలుగు దిశలా నాలుగు కాస్త గుంభనంగానే వ్యాపించాయి. పైకి రెండు కొమ్మలు ఒకదాన్ని మించి ఒకటి పోటీపడి ఎదిగాయి. చిటారు కొమ్మకి చేరింది పక్షి. ఒంటి కాలిమీద నిల్చుంది. ఆకాశంలోముక్కుని గిడించింది. రెండు రెక్కలు ఉత్తర దక్షిణాలుగా విప్పార్చింది. మెడను ఓంకారంగా నిల్పింది. ఒక చిత్రకారుడు బొమ్మగీస్తే అదొక నల్లని ఓంకారక్షరం కనపడుతుంది. అది అరిచింది. ఆ అరుపు ‘ఓం’కారం లా ప్రతిధ్వనించింది. ఆ అరుపు విన్న తోట నివ్వెరపోయింది. కృష్ణుడు పైకి చూశాడు. ప్రణవం సుస్వరంగా పలుకుతోంది. అది వైకుంఠం దాకా ఒకనాద రహదారిని వేసినట్లుంది.

కృష్ణుడు నవ్వాడు. తన వేణువును తీశాడు. విశ్వమోహన సంగీత విమలగీతాన్ని అందుకున్నాడు. ఒక కొమ్మపై వీపు ఆనించాడు. మరో కొమ్మపై కుడికాలు, ఇంకో క్రింది కొమ్మపై ఎడమకాలుంచాడు. వేణువు మ్రోగుతోంది. ఆ సంగీతాన్ని చెట్టు కొమ్మలు విన్నాయి. చెట్టు విన్నది. చెట్టు వేళ్లూ విన్నాయి. వేళ్లతో పాటు భూదేవి విన్నది. భూమ్మీద నగరాలు విన్నాయి. కొండలు విన్నాయి. నాదులూ విన్నాయి. సముద్రాలు విన్నాయి. మేఘాలు విన్నాయి. అష్టదిక్కులు విన్నాయి.

కానీ ద్వారకకు వినపడలేదు

హస్తినకు వినపడలేదు

పాండవులకు వినపడలేదు. ద్రౌపదికి ఏదో చెవి దగ్గర లీలగా ఒక విషాదగీతం తారాడినట్లుంది.

శ్రీకృష్ణుడు వేణువు మోగిస్తున్నాడు. చెట్టుమీద పక్షి వింటోంది. దాని ముక్కు ఎర్రబడింది. దాని రెక్కలు కాషాయవర్ణంగా మారాయి. పాదాలు పసుపు వర్ణాన్ని సంతరించు కున్నాయి.

పై కొమ్మ నుంచి క్రిందికి దిగుతోంది పక్షి. కృష్ణుడి పాదాలను తాకింది. ఎర్రటి ముక్కుతో నీలిపాదాలను ముట్టుకుంది. ఆ స్పర్శ వైకుంఠంలోని లక్ష్మీదేవి చేతులకు తాకింది.

తన రెక్కలతో కృష్ణుడికి వీవన వీచింది. ఆ వీచిక ఆదిశేషుడి తలపించింది. తన కళ్లతో చుట్టూ వలయంగా చూసింది. శంఖచక్రాలు ఆకాశగంగలో చక్రస్నానం చేసి ఒడ్డుకొచ్చిన ట్లున్నాయి.పక్షి కంఠంలో ప్రణవం ఉదాత్తంగా మోగుతోంది. ప్రణవం తీక్షణమ య్యే కొద్ది ప్రకృతిలో సంచలనం సమస్త భూతకోటిలో భయంకరమైన నిశ్శబ్దం ఎక్కడి నుంచో ఒక బాణం శ్రీకృష్ణుని కాలి బొటన వేలును తాకింది.ప్రణవ విహంగం ఎగిరిపో యింది– వేణువు కృష్ణుడి పాట నేల జారింది. కృష్ణుడి కోసం సముద్రం ద్వారకవైపు దూసుకొస్తుంది.

యుద్ధంతో మత్తెక్కిన కురుక్షేత్రంలో ఎండిన నెత్తుటి మరకల్ని హస్తినాపురంలోని అనాథల కన్నీళ్లు కడిగేస్తు న్నాయి.నేలకు తాకిన వేణువుపాట కలియుగానికి నాంది పలుకుతు న్నట్లుంది. కృష్ణయానం సాగుతోంది.

(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన “ఖమ్మం కథలు” నుండి...)

జీవితంలో..

మనకు హితులైన వారితో మనము జేయు
స్నేహమైనను, ప్రేమైన చెడుపు జేయ
బోదు, బాధ పెట్టను కూడ లేదు సుమ్మ.
స్నేహితుడు సదా నీకు మేల్ చేయు గదరా!.
ఎవ్వరిని చిన్నగా జూడ కెప్పుడైన.
బాధలను గల్లజేయకు పరుల మదికి.
ఉన్నతమ్ముగ నేడు నీ వుండవచ్చు.
కాని బహు శక్తివంతమోయ్ కాలహేల!
లక్ష అగ్గిపుల్లలు వచ్చు వృక్ష రాజ
మొక్క దానిలో తెలియుము ఓర్మి మీర!
లక్ష వృక్షాల ఘన వనారణ్యములను
బుగ్గి జేయంగ జాలు నొక యగ్గి పుల్ల!
కాన జనులందరితో నుండు గౌరవముగ.
మంచి మది తోడ ధరణిపై మసలుకొనుము.
శాంతి ,సౌఖ్యము వెలయ జీవింతు వీవు.
స్నేహ మునుగోరు, ప్రేమించు స్నేహితుండు.

–వి. వీరాచారి,
8897182796

అధికారాంధులు

అహంకారంతో కొందరు
అధికారంతో మరికొందరు
ఆధిపత్యంతో కొందరు
అధిక సంఖ్యాకులమని
మరికొందరు
అర్హులమని ఇంకొందరు
ఆగమాగం చేస్తుంద్రు–
అనర్హులని కొందరిని
అల్పసంఖ్యాకులని కొందరిని
అసురగణమని కొందరిని
అధికారం లేదని కొందరిని
అనల వేదిక మీద
ఆహుతికి సమిధలను చేస్తుంద్రు –
అన్యాయపు ఆక్రమణలు
అక్రమ నిర్మాణాలు
అవినీతితో ఆస్తులు
అనునిత్య ఆదర్శ మార్గాలు
అజరామర కీర్తికి సోపానాలు–
అహర్నిశలు ఆదర్శవంతువలే
అందరికీ సూక్తులు వల్లిస్తున్నరు
అందిన కాడికి స్వాహా చేస్తూ
ఆదర్శవంతులమని ఆటలాడుతూ
అమాయకులను మోసం చేస్తున్నరు–
ఆదమరచితివా ఆట కట్టిస్తరు
అవహేళన చేస్తూ అమాయకుడంటరు
అదురు బెదురు లేక నిలబడితివా
అదురుకొని బెదిరిపోతారు. –

–డా.ఎద్ల కల్లేశ్
9866765126

రంగన్న తెలివి

కథ

రంగన్నకు గుట్టన్న అనే అమాయకుడైన కొడుకు ఉండేవాడు. ఒకరోజు రంగన్నకు తన కుమారుని తీసుకొని పొరుగూరుకు వెళ్ళవలసిన అవసరం వచ్చింది. ఆ గ్రామానికి అడవి మధ్యనుండి కాలినడకనే పోవాలి. ఆ అడవిలో దొంగలు ఉంటారని ప్రతీతి. తన కొడుకు ఉన్నదున్నట్టు చెబుతాడని రంగన్నకు తెలుసు. ఆ దొంగలకు ఈ సంగతి తెలిస్తే తమను కొట్టడమే కాకుండా ఉన్న డబ్బు కూడా పోతుందని రంగన్న అనుకున్నాడు. అందువల్ల అతడు తన కొడుకుతో” ఒరేయ్! దారిలో దొంగలు నిన్ను ఏమైనా ప్రశ్నిస్తే మన డబ్బుల మూట మా నాన్న చొక్కా జేబులో లేదని చెప్పు” అని ఆ డబ్బును గుట్టన్న చూస్తుండగానే తన చొక్కా జేబులోనే దాచాడు రంగన్న. గుట్టన్న సరేనన్నాడు.

వారు అనుకున్నట్లే అడవిలో నడిచే సమయంలో నలుగురు దొంగలు వారిని ఆపి “ ఏయ్ ! మీ డబ్బును ఎక్కడ దాచారో చెప్పండి” అని అన్నారు. అప్పుడు రంగన్న ఏమీ మాట్లాడలేదు. గుట్టన్న” మా నాన్న నాతో తన జేబులో ఆ డబ్బు లేదని మీతో చెప్పమన్నాడండి” అని అన్నాడు. వారు వెంటనే రంగన్న జేబులన్నీ వెతికారు. వారికి అందులో చిల్లిగవ్వ కూడా దొరకలేదు. తర్వాత వారు గుట్టన్నని “ఒరేయ్ మీ నాన్న చొక్కా జేబులో డబ్బు సంచీ లేదు. ఎక్కడ ఉందిరా?” అని తిరిగి ప్రశ్నించారు .అప్పుడు గుట్టన్న “నిజంగా మా నాన్న ఆ జేబులోనే ఆ డబ్బుల సంచీ పెట్టడం నేను కళ్లారా చూశానండీ! అది మీ భయానికి ఎక్కడికైనా పారిపోయిందేమో!” అని అమాయకంగా అన్నాడు.

అప్పుడు దొంగలు వాడు అమాయకుడని గ్రహించి రంగన్నను ప్రశ్నించారు .రంగన్న వారితో “ అయ్యో! ఆ డబ్బు వాడు చెప్పినట్టు ఎక్కడనో పడిపోయిందండి” అని ఏడవసాగాడు. దొంగలు చివరకు విసుగుచెంది ఆ ఇద్దరిని వదిలిపెట్టారు. ఆ తర్వాత రంగన్న గుట్టన్నతో తమ గ్రామం చేరుకున్న తర్వాత రంగన్న తన కొడుకు చొక్కా జేబులోని డబ్బుల సంచిని తీశాడు. అప్పుడు గుట్టన్న “నాన్నా! నీ చొక్కాలోనే ఆ డబ్బుల సంచీని దాచావు కదా! మరి నా చొక్కా లోనికి ఆ డబ్బుల సంచి ఎలా వచ్చింది?” అని ప్రశ్నించాడు. అప్పుడు రంగన్న “ ఒరేయ్ నా బుజ్జికన్నా! నీవు వెంబడి ఉండడం వల్లే నా డబ్బు నాకు దక్కింది రా! నీవు చూస్తుండగానే నా చొక్కాలో నీ ముందర దాన్ని దాచి తర్వాత నీకు తెలియకుండా దానిని తీసాను. ఆ తర్వాత నీ చొక్కా తీసుకుని అందు లోనే ఈ డబ్బును నీకు తెలియకుండా దాచాను. దొంగలు నిన్ను ముట్టరని నేను ఊహించాను. నా ఊహ నిజమైంది “అని అన్నాడు.

–సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

ధనం మూలం ఇదం జగత్

ఓ రంగులద్దిన కాగితమా
మనిషి రంగు మార్చటం నీకు తెలిసిన మంత్రమా...
కడుపుకాలి గూటికెలితే నిన్ను యాది చేస్తరు,
కంచంలో మెతుకు కోసం ప్రతిఘటనే చేస్తరు,
కంటికునుకు లేకుండా నీకు భజన చేస్తరు
వ్యసనమా ఇది నీ మాయాజాలమా!!
రెక్కకష్టం చేసుకొచ్చి,
ఒక్కొక్క మెట్టెక్కి,
నిను పొందిన అనుభూతి,
దేవుని చెంత విభూతితో సమానమాయే,
అమావాస్య లాంటి జీవితం వెళుతురాయే
నింగి లోని తారలా మెరిసిపోయే
ఓ పైకమా, నీకై మైకమా
అతిథిలా ఇంటికొచ్చి
చెట్టు వేరు మూలకేసి
ముళ్లకంపల పందిరి చాచి
అల్లుకుపోయిన తీగల్లో అలజడిని సృష్టించి
మల్లెపూల వాసనలో మంటల్ని ఉసిగొల్పి
విడిచే చల్లగాలిని సైతం విషవాయువుగా మలుస్తావే
ఇది నీకే సాధ్యమా
ప్రేమల్ని కూలగొట్టే “పైసా”చిక పైత్యమా
కన్నపేగుకూ, రక్తబొట్టుకూ సైతం విలువకడతావు
రుధిరబంధాల్ని క్షణంలో రూపుమాపుతావు...
నువ్విచ్చిన వరమా
నువు మిగిల్చిన శోకమా
లోకాన్ని శాసించే నిన్ను ఆశించని వారెవరు
నీ నామ స్మరణతో పరవశించని వారు లేరు..!
ఉన్నవారి ఇండ్లల్లో పండగవై మెరుస్తావు,
లేనివారి కండ్లల్లో వడగండ్లను కురిపిస్తావు
అయినా నీపై మా మమకారం తరుగునా
నీ విలువ ఇసుమంతైనా కరుగునా..?
నువ్వే మా బతుకు బండిని లాగే ఇంధనం
ఓ ధనమా అందుకో మా వందనం...

–నాజ్రీన్ బేగం
91548 57331

మీరు చూడాలేగానీ....

నేను రాయినే కావచ్చు
నేను పరాయినే కావచ్చు
నేను కఠినత్వానికి ప్రతీకనే కావచ్చు
నేను నిశ్చలత్వానికి ప్రతిరూపాన్నే కావచ్చు
కానీ నేను బహురూప దర్శినిని–
మీలోని శిల్పి మేల్కొంటేగాని
నాలోని శిల్పం కనిపించదు
మీలోని చరిత్రకారుడు తొంగిచూస్తేగాని
నాలోని శిలా శాసనం దర్శనమీయదు
మీలోని సంగీతజ్ఞుడు బయటికొస్తేగానీ
నాలోని కరిగే గుణం కనిపించదు–
నేను నోరులేనిదాన్ని
అయితేనేం చరిత్రకు సాక్ష్యం చెప్పగలను
నేను కళ్ళులేనిదాన్ని
అయితేనేం శిల్పులెవరో గుర్తించగలను
నేను కాళ్ళులేనిదాన్ని
అయితేనేం కాలంతోపాటు పయనించగలను–
నాపై ఎండ సేదతీరుతుంది
నాపై చంద్రుడు వెన్నెల ఆరబోస్తాడు
నాపై వర్షం సంగీత కచ్చేరి నిర్వహిస్తుంది
నాపై గాలి పాటను సాధన చేస్తుంది–
మీరు సరిగ్గా చూడాలేగానీ
మీ ఇంటికి పునాది రాయిగానో
మీ ఆయుధాలకు సానరాయిగానో
మీ కోటకు కవచంగానో
మీ వేటకు ఆయుధంగానో
మీ కావ్యాలకు అసలైన వస్తువుగానో
మీ కన్నీటి గాథలకు సిసలైన శ్రోతగానో
మేల్కొలిపి మరీ దర్శనమివ్వనూ..!

– ఎన్.నరేశ్ చారి, 9701334516

బోనులో

నమ్మకాన్ని పూర్తి చేశాడు
కేజీ నుండి పీజీ చదివాడు
ఉద్యోగం లో జేరాడు
పెళ్ళి చేసుకున్నాడు
కారు కొన్నాడు
ఇల్లు కట్టాడు టౌన్లో
తల్లిదండ్రులింకా
పండి పండని చేనులో
అప్పుల బోనులో



–కోటం చంద్రశేఖర్
9492043348

రుబాయిలు

పేదవాడి పేరుచెప్పి బతకనేర్చె నాయకులు
ఆకలిమంటలతో చలి కాచుకునే నాయకులు
ప్రజాస్వామ్య దేశంలో రాచరికపు పోకడలే..
అడ్డంగా బలిసిపోయె అడ్డులేక నాయకులు !!

పెరుగుతున్న ధరలపైన అదుపులేదు సిగ్గుచేటు
పేదవారి బతుకులేవి మారలేదు సిగ్గుచేటు
ఖజానాలు దోచుకుంటు చిల్లరనే విసురుతుంటె..
చెయ్యిచాచు జనాలలో మార్పులేదు సిగ్గుచేటు !!

కులమతాల ఉచ్చులోన చిక్కుకున్న జనాలు
రాజకీయ రొచ్చులోన పొర్లుతున్న జనాలు
సంక్షేమం పేరుచెప్పి జేబుచిల్లు పెట్టినా..
వంగివంగి నాయకులకు మొక్కుతున్న జనాలు !!

రాజరికం ఏలుతున్న ప్రజాస్వామ్య రాజ్యంరా
వ్యక్తిపూజ భజనచేయు మూర్ఖులున్న రాజ్యంరా
బడాచోరు వ్యాపారులు చట్టాలను కొంటుంటే..
ఓటుకొక్క రేటుకట్టి అమ్ముతున్న రాజ్యంరా !!

– పేరిశెట్టి బాబు
9247170800

పుస్తక ప్రియుడు

అతడు నిత్యం పుస్తకాలతో దోస్తికట్టి
జీవిత పాఠాలను చదువుకుంటున్నాడు
నిన్నటి దాక మనుషుల మర్మం చూసి
తన మొఖమే బాగాలేదనుకున్నాడేమో

అందరు తనను వేరు చేసి చూస్తున్నారు
అందుకే కాబోలు తను మౌనం వహించాడు
ఎవరితో స్నేహం చేయబుద్ధిగాలేదంటా
మనుషులకు డబ్బు జబ్బుపట్టుకుందనుకున్నాడు.

జనారణ్యంలో కుట్రలు కుతంత్రాలే తప్ప
మానవత్వం ఏ కోషానలేదని భావించాడేమో
బతుకు కాగితం పూవుగా మార్చుకుని
నాలుగు గోడలే తన ప్రపంచం చేసుకున్నాడు.

మౌనం తన ఆయుధంగా మలుచుకుని
కలం తన అస్త్రంగా మలుచుకున్న అక్షరజ్ఞాని
రేపటి భవితవ్యాన్ని యువతకు గుర్తుచేస్తు
ముందుకు వెళ్ళే మార్గాన్ని వేస్తున్నాడు

కాలం కరిగి విషాదాలను మిగిల్చిపోయిన
అక్షరం చెరిగిపోని శిలయై ఇక్కడే వుంటుంది
తను నిత్యం గుండెకత్తుకున్న నేస్తం
తన పుస్తకమే అంటాడి పుస్తక ప్రియుడు!!

–వజ్జీరు ప్రదీప్
9989562991

రెక్కలు తొడిగిన జీవితం

విజ్ఞానం రెక్కలు కట్టుకొని
రివ్వున విశ్వాన్ని చుట్టేస్తుంటే
మనిషి మరోలోకాన్ని సృష్టించి
మర మనిషై
మౌనంలోకి జారుతున్నాడు.

అనుభవాన్ని అవమానపరుస్తు
అనుకరణపై మోజు పడుతున్నాడు
ఆధునికమంటు ఆరాటపడుతు
అంధకారాన్ని ఆహ్వానిస్తున్నాడు.

ప్రకృతిని పలుచనచేస్తు
వికృతాలతో ఆకృతిని మారుస్తున్నాడు
పంచభూతాలను వ్యాపార సరుకుచేసి
పంచేంద్రియాలపై పట్టుకోల్పోతున్నాడు.

బంధాల తీగను భారంగ మోస్తు
ఘోరాలు నేరాలు స్క్రోలింగ్ చేస్తున్నాడు
విలువలను మరచి విజయమే మేలంటు
వక్రమార్గంలో వరుసకడుతున్నాడు.

రేపటి వెలుగు రేఖలు
మత్తువాసనలో
మసకబారిపోతున్నాయి
చిత్తమంతా
విత్తముతో నింపుకొని
బిత్తర చూపులతో

కలతప్పిపోతున్నాడు.

పోటి ప్రపంచాన్ని పెంచుకుంటు
సాటిలేని వారైనట్లు ఊహిస్తున్నాడు
అందని ద్రాక్షను అందుకోవాలని
ఆశను ,
ఆశయాన్ని మరచిపోతున్నాడు

–బి.సుధాకర్
9849243908

ఆలోచన

కథ

అనగనగా మాందాబాద్ అనే ఊరిలో సీత, గీత అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వాళ్లు ఒక రోజు బడికి వెళ్తుంటే దారిలో కొన్ని డబ్బులు కనిపించాయి. వారిద్దరూ ఆ డబ్బులను తీసుకున్నారు. దారిలో వచ్చి పోయే వాళ్లను ఈ డబ్బులు మీవా అని అడగసాగారు. ఎవ్వరు కూడా మావి కాదు. మావి కాదు. అంటూ వెళ్లిపోయారు.

వాళ్ళిద్దరికీ కూడా డబ్బులు ఏం చేయాలో అర్థం కాలేదు. దారిలో ఇద్దరు ఆకలితో వెళ్తున్న ముసలి వాళ్లకు డబ్బులు ఇచ్చి అన్నం తినుమన్నారు. వాళ్లు ఆ డబ్బులతో అన్నం తిని ఆకలి తీర్చుకున్నారు. కొద్దిరోజుల తర్వాత ఆ ముసలి వాళ్లు ఇద్దరు కూడా కొత్త బట్టలు తీసుకుని వచ్చి బడిలో ఉన్న సీత, గీతలకు ఇచ్చి మేము ఆకలితో ఉన్నప్పుడు వారికి దొరికిన డబ్బులు వారు తీసుకోకుండా, మా ఆకలి కొరకు ఇచ్చినందుకు ఈ బట్టలు ఇస్తున్నామని తెలిపారు.

సీత, గీతలు డబ్బులు స్వార్థానికి వాడుకోకుండా ఇతరుల ఆకలి తీర్చేందుకు ఇచ్చినందుకు బడిలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు అభినందించారు. సీత, గీతల మాదిరిగానే ఇతరులకు సహాయం చేయాలని, ఏదైనా వస్తువు దొరికితే తిరిగి వారికి ఇవ్వాలని, లేనిపక్షంలో పెద్దలకు అప్పగించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.

–సనా తబస్సుమ్
9849505014

జీవితం

మనం పుడితే అమ్మ సంతోషపడాలి
మనం పెరిగితే నాన్న గర్వపడాలి
మనం చదివితే గురువు ఆనందించాలి
బాగా చదువుకొని ఊరు పేరు నిలబెట్టాలి
చదువు ద్వారా ఏదైనా సాధించాలి
బతికిన్న రోజులు ఇతరులకు సాయపడాలి
చనిపోతే శత్రువు కూడా కన్నీరు పెట్టాలి
ఇదే మనిషి జీవితంలో జరిగి తీరాలి

–అదీబా
9849505014

ఆహ్వానము

జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్



శ్రీ గుదిబండి వెంకట్ రెడ్డి
83వ జన్మదినోత్సవ వేడుకలు
జీవీఆర్ ఆత్మీయ పురస్కారాలు

జీవీఆర్ సాహితీ కిరణం సౌజన్యంతో నిర్వహించిన
పోస్ట్‌కార్డ్ కథల పోటీ విజేతలకు నగదు పురస్కారాల ప్రదానోత్సవం
శ్రీ వి.వి. రాఘవరెడ్డి ఆనందనిలయానికీ రూ. 50,000/- నగదు విరాళం

ముఖ్య అతిథి	: డా॥ కె.వి. రమణ, ఐ.పి.ఎస్. (ర).
గౌరవ అతిథి	: శ్రీ సి. రామకృష్ణ, పూర్వ జనరల్ మేనేజర్, దక్షిణమధ్య రైల్వే
సభాధ్యక్షులు	: లయన్ డా. చిల్లా రాజశేఖరరెడ్డి, పాలమూరికవేత్త
సభాప్రారంభం	: శ్రీ లంక లక్ష్మీనారాయణ, అధ్యక్షులు, యువకళావాహిని
పురస్కార స్వీకర్తల స్వాగతసత్కారం	: డా॥ రామరాజు శ్రీనివాస రావు, చైర్మన్ సౌత్‌తాన్ ఆఫ్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్, గుంటూరు.
అతిథుల స్వాగతసత్కారం	: శ్రీ కొండపాక కృష్ణమాచార్య, రాష్ట్ర అధ్యక్షులు, శ్రీవేద దాల్భిక సేవా సమితి
జ్యోతిప్రకాశనం	: శ్రీమతి గిడుగు కాంతికృష్ణ, గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ చైర్మన్
అతిథులకు జ్ఞాపికల బహూకరణ	: శ్రీమతి కె. విజయలక్ష్మి, సామాజికవేత్త
ఆత్మీయ అతిథి	: శ్రీమతి వి.శైలజ, తెలుగు భాష ప్రచారకర్త
నృత్య కళాకారుల సత్కారం	: డా॥ విశ్వర్య పాతపాటి మిస్ గ్లోబల్ ఇండియా 2023
నిర్వహణ	: శ్రీమతి టి.వి. శశిలేష, నర్తకి, నాట్యం, సంగీతం గురువు

02-04-2024, మంగళవారం, సా॥ 5-00 గంటలకు
శ్రీ త్యాగరాయ గానసభ (ప్రధానమందిరం), చిక్కడపల్లి, హైదరాబాద్.

బాలల బొమ్మల "నాన్నారం కథలు"

ఒకప్పటి ఉమ్మడి కుటుంబాల్లో అమ్మమ్మ తాతయ్యలు పెద్దవాళ్లు కథలతో పాటు అనేక విషయాలు చెప్పేవారు . బయట దొరికే రకరకాల పుస్తకాలను కొనుక్కొని తెచ్చి మరి చదివి వినిపించేవారు. లైబ్రరీకి వెళ్లేవారు. కానీ ఉమ్మడి కుటుంబాలు కనుమరుగైన తర్వాత వేర్పాటు కుటుంబాలు ఏర్పడ్డాయి. పిల్లలకు కథలు చెప్పే వారు కరవయ్యారు. ఇప్పుడు అందరిదీ ఉరుకుల పరుగుల జీవితం అయింది. పిల్లల భావి జీవితానికి ఉపయోగపడే విషయాలను చెప్పి, వారిని గొప్పగా ఎవరు తీర్చిదిద్దుతారు. మరి పిల్లల మనసుల్లో మంచి విషయాలు బలంగా నాటుకోవాలి. అంతేకాకుండా పిల్లల అంతర్గత శక్తులను బయటకు తీసి మనో వికాసాన్ని కలిగించాలంటే దానికి ఒకటే మార్గం అదే బాల సాహిత్యం .ఏ దేశంలో నైనా"బాల సాహిత్యం ఉన్నత ప్రమాణాలను సంతరించుకొని ఉంటుందో ఆ దేశ భవిష్యత్తు చాలా బాగుంటుంది. "చదువు అంటే చదవడం రాయడం బట్టి పట్టి పరీక్షలు రాయడం కాదు. నైతిక విలువలతో సమాజానికి బాధ్యత కలిగిన వ్యక్తిత్వం కలవారిగా ఆత్మస్థైర్యంతో ధైర్యంతో జీవించడం నేర్పించడం .అందుకే పాఠ్యపుస్తకాలతో పాటు బాల సాహిత్య పుస్తకాలను కూడా చదివించాలి. మంచి చెడు విచక్షణ లేకపోవడం. దుర్గుణాలకు కారణం చిన్న వయసులో బాల సాహిత్యం చదవకపోవడం, పెద్దలు చెప్పకపోవడం. అందుకే పిల్లలతో బాల సాహిత్యం చదివిస్తే వారిలో అనేక సుగుణాలను పెంపొందింప



పుస్తక ప్రతులకు:
ఆర్ సి కృష్ణస్వామి రాజు
తిరుపతి
చరవాణి:9393662821

చేయవచ్చు. సమాజా నికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దవచ్చు.

పసి మొగ్గల్లాంటి బాల బాలికలకు అర్థవంతమైన నీతి కథలను అందిస్తున్నారు ఆర్ సి కృష్ణస్వామి రాజుగారు. సహజసిద్ధమైన కథ వస్తువులతో బాల సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు .సమాజం పట్ల బాధ్యత కలిగిన సాహితీవేత్తగా పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతున్నారు. రాజు గారి కలం నుండి జాలువారిన బాలల కోసమే రాసిన నాలుగవ బొమ్మల కథల సంపుటి "నాన్నారం కథలు". ఇందులో వాస్తవ జీవితానికి సంబంధించిన అనేక విషయాలు నీతి కథల ద్వారా తెలియజెప్పే ప్రయత్నం చేశారు.

ఇందులో మొత్తం కథలు 30. దేనికదే ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. మొదటి కథ "మతి మరుపు నాన్న" చివరి కథ "బంగారు కోడి పెట్ట."

"అక్షరాల తోవ". బడికి వెళ్ళే పిల్లలు చదువుకోకుండా సముద్రములో చేపలు పట్టడానికి

ప్రాముఖ్యత ఇస్తున్నారు. బడికి వెళ్ళడానికి ఆసక్తి చూపడం లేదు. రచయిత ఈ కథలో "ఆస్తులున్న వాడి కన్నా, అక్షరాలు నేర్చిన వాడే మిన్న"అనే చక్కటి సందేశాన్ని అందించాడు. "పిల్లలు బడిలో , పెద్దలు పనిలో" ఉండాలని తెలియజెప్పారు.

మరో చక్కటి సందేశాన్ని అందించే కథ "దత్త పుత్రుడు ఎంపిక". మనం అనే పదం "కలుపుకుప పోయే తత్వం," మీ అనే పదం "వేరు" అనే భావం ఉంది. అందరితో మనం కలుపుకు పోయె విధంగా ఉండాలనే విషయాన్ని ఈ కథలో తెలుసుకుంటారు.

"వడగండ్లు" కథలో మన మంచి కోరే వారి కోపం వడగండ్లు లాంటిది. వారు కఠినంగా మాట్లాడినపుడు బాధ కలిగినా ఆ మాటల వల్ల మనకు మంచే జరుగుంది. చెడు జరుగదు అనే సందేశం అందించారు రచయిత ఆర్ సి కె రాజు గారు.

"పొద్దు తిరుగుడు పువ్వు" కథలో మొక్కకు సంబంధించిన పిల్లలకు తెలియని సమాచారం అందించాడు. "బంగారు కోడిపెట్ట" కథలో సమయస్ఫూర్తితో ఏ విధంగా వ్యవహరించాలో తెలిపే చక్కటి కథ .ఇలా ఆర్ .సికే రాజు రాసిన ప్రతి ఒక కథ ఆణిముత్యంగా చెప్పవచ్చు.ఇలాంటి బొమ్మలతో కూడిన కథలు వారి కలం నుండి జా లు వారాలని కోరుకుంటూ వారికి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేద్దాం.

ఇందులో మొత్తం పేజీల సంఖ్య 101. పుస్తకం ధర 140. పుస్తక ముఖ చిత్రం జంతువుల బొమ్మలతో అందంగా తీర్చిదిద్దారు.

–యాదవరం
చంద్రకాంత్ గౌడ్
9441762105

పుస్తక సమీక్షలు

భక్తి ప్రధానంగా శ్రీకృష్ణ శతకము

కాల ప్రవాహంలో బాల్యం నుండి వృద్ధాప్యం వరకూ ఈదులాడుకుంటు పోవడమే అందరూ చేస్తుంటారు. కానీ ఆధ్యాత్మికంగా దానధర్మాలు ఆచరించరు. పూజలు చేస్తే చాలు, మూఢ నమ్మకాలు పాటిస్తే మేలు అనుకుంటారు చాలా మంది. పూజ చేసి దైవాన్ని ధ్యానించి ఉద్ధరిణెడు నీరు సమర్పిస్తే చాలు, దైవం సమ్మతితోడి స్వీకరించి అనుగ్రహి స్తాడు. అంతటితో దేముడి పూజ ముగుస్తుంది. కానీ ఎంత చేసినా తక్కువే అనిపించే దానం ధర్మం ఈనాటికీ మనుష్యులు ఆచరించడం లేదు. మాయచేసి మహిమలు చూపి, చక్కని మాయ మాటలు ప్రవచిస్తుండే దొంగ సన్యాసుల్ని నమ్ముతుంటారు. కాళ్లపై పడి మొక్కుతారు. పూజిస్తారు. బాబాల్ని కాదు భగవంతుణ్ణి నమ్మండి. అదే అసలైన గమ్యం. అగమ్యమైనా ఆ నిజమైన గమ్యాన్నీ చేరుకునేది ఎందరు? యల్. రాజా గణేష్ మానవాళికి అందించిన ఒక సందేశం. దీన్ని 'నామాట ' అంటూ ముందుగానే చెప్పారు. శ్రీకృష్ణ శతకమును తన గురుదేవుడు శ్రీకృష్ణునికే అంకితమిచ్చారు. గణేష్, తాను ఇప్పుడు ఒంటరిగా లేనంటాడు. ఆ పరమాత్ముడి తోడుగా నేనిప్పుడు దివ్యంగా ప్రస్థుతాన్ని గడుపు

ప్రతులకు:
యల్. రాజా గణేష్
26-47-1, చైతన్యనగర్
పాతగాజువాక
విశాఖపట్నం- 530 026.

తున్నానని చెబుతూ, అంతకన్నా ఎవరికైనా కావల్సింది ఏముంటుంది? అన్నారు. ఈ శతక పద్యాలు చదువుతుంటే రాజాగణేష్ భక్తి ప్రపత్తులు ఇట్టే తెలిసిపోతాయి. అంతటి విశ్వాసంతో ఆ శ్రీకృష్ణ పరమాత్మను ఒక్కొక్క పద్యంలో ఒక్కొక్కరీతిగా అద్భుతంగా ఆవిష్కరించారు. నరనారాయణ, మురహరి, ద్వారకనాథా అంటూ ప్రారంభించి, స్వామిని ఎన్నిపేర్లతో శతకంలో పిల్చుకున్నారో గణేష్. అది శ్రీకృష్ణ ప్రేమకు నిదర్శనం. అండదండలు మెండుగ పండిలేవు, కండబలము బలగములూ లేవు, నిండు నిండుగ మా గుండె నిండి కృష్ణా అంటూ తనకు ధైర్యాన్ని ఇచ్చుకున్నారు.

నీ పుట్టుక నా పుట్టుక భారత దేశముననే, ఎంతటి ధన్యత గొన్నదీ భారతాత్మ, నా కింతటి అవిభాజ్య భాగము దక్కె అంటూ తన పుట్టుక ధన్యత చెందిందన్నారు. నేడు ధరణిలో బాధ గురువులె గాని బోధ గురువులు లేరన్నారు. దర్మమన్నది సరాసరి మార్గాన లేదనీ, కాళ్లు పట్టినోడు లాగివేస్తున్నాడని నేటి లోకం తీరును కృష్ణుడికి మొరపెట్టుకున్నారు. శతకం తర్వాత ఎన్నో భక్తి కవితలను కూడా పాటకుల ముందుంచారు. రారాకృష్ణయ్య, మేలు మేలు కృష్ణా, శ్రీకృష్ణమంత్రనగరి, శ్రీకృష్ణార్పనం, కృష్ణ పక్షమి, కృష్ణ ప్రేమ, నల్లని వాడు చల్లన, శ్రీకృష్ణ సాకారం, శ్రీకృష్ణ రవళి, శ్రీకృష్ణ స్తుతి, కన్యకా పరమేశ్వరీ స్తోత్రం, సంక్రాంతి క్రాంతి, శివస్తోత్రం, గణనాధుని స్తుతి, వందేభారత మాతా, సూర్యుడొక్కడే వంటి పలు రచనలు ఈ శ్రీకృష్ణ శతకము పుస్తకంలో చోటు చేసుకున్నాయి. రాజా గణేష్ బాలల గేయాలు , కథలు, నీతి పద్యాలు, కథల సంపుటిలు, కవితా సంపుటిలూ అందించారు. విజయ నగరం మరో మంచి కవిని అందించింది. లక్ష్యాలు నుండి మరిన్ని రచనలు ఆశిద్దాం.

డా॥ పులివర్తి కృష్ణమూర్తి,
సెల్: 99490 92761

ట్రోలర్ తో ముఖాముఖి

(నేను ప్రశ్న–ట్రోలర్ జవాబు)

ఏం నాయనా ఈ పేకుడేంది ?
ఫేస్ బుక్ లో పని చేస్తున్నా కదా.
ఏం పని చేస్తున్నావు బాబు ?
ట్రోలర్ గా పనిచేస్తున్న.
ఏం పాస్ అయ్యావు తండ్రి ?
పాసులు , పట్టాలతో పని లేదండి.
మరి ఎక్కడ చదివావు నాన్న ?
వాట్సాప్ యూనివర్సిటీ లోనండి.
జీతభత్యాలు ఏమిస్తారేమిటి ?
చేసుకున్నోనికి, చేసుకున్నంత.
మరి మీరు ఏమి చేస్తారేమిటి ?
సత్యానికి సర్వమంగళం పాడి అసత్యాన్ని అందలమెక్కిచడం.
ఇంకేమి చేస్తారేమిటి ?
మనిషిని ఏకి ఏకి ఏకాకి చేయడం
మా వాడు కాని వాడి గొంతు నొక్కేయడం
పొంతన లేని మాటలతో పొగబెట్టడం
కాకి లాగా పొడిచి పొడిచి పరుగెత్తించడం
అసలు మీ లక్ష్యం ఏమిటి ?
నేటిజనులను నెగలనీయకపోవడం
నెట్టింటిలో నుంచి నెట్టివేయడం.
ఇది అన్యాయం కాదా బాబు ?
ఇది ఆటలో భాగమేనండి.
మీకు మర్యాద మానవత్వం మనసు లేవా ?
అవెందుకండి ? మాకు మతం ఉంది కదా.
ఏది మీ ఐడి ఒకసారి చూద్దాం ?
మాకన్నీ ఫేక్ ఐడి లేనండి.
ఇంతకు మీరు ఎలా ఉంటారు బాబు ?
ఓ అదా ! మేము ముసుగు వీరులం
కాదు కాదు ముసుగులో దూర్తులం.

–డా. ఎడ్ల కల్లేశ్
9866765126

మహాయోగి...

ఆత్మజ్ఞాన యోగీశ్వరుడు
పరివ్రాజక యాత్రికుడు
మహోన్నత మార్గదర్శకుడు
తపస్సంపన్నుడు
ప్రపంచానికి ఔన్నత్యాన్ని
ప్రవచించిన సందేశకుడు
నూతన భావాల ఆవిష్కర్త
సమానత రావాలన్న సంస్కర్త
మానసికశక్తి పెంపొంది
ఆచరణతో మనిషి
నిత్య జాగృతుడు కావాలన్న
దివ్యజ్ఞాని, పురోగమనశీలి
బతుకు పరమార్థాన్ని
ప్రబోధించిన మార్గదర్శి
కొంతకాలమే ఈ లోకంలో గడిపినా
కొండంత విజ్ఞానాన్ని
పంచిపెట్టిన విశ్వ విజేత
వివేకానందుడు
పరిపూర్ణ ప్రతిభుడు

– డా. తిరునగరి శ్రీనివాస్
9441464764

వివేక వాణి



–బండిరాజుల శంకర్
సెల్: 99480 50608

రంగు
హంగు
యువతీయువకులలో హోళీ ఆనందోత్సాహాల కడలి పొంగు.

–నాగరాజు.చుండూరి, లండన్

ప్రాలిక
ఏలిక
ప్రహ్లాదుని సంహరించబోయి తాను
దహనమయిన హోలిక

–నేమాన సుభాష్ చంద్రబోస్ , విశాఖపట్నం

హోళీ
హేళీ
సహజవర్ణాలు విరజిమ్మాలి,
విరియాలి ఆనందాల – కేళీ

–పి.బాలా త్రిపుర సుందరి, హైదరాబాద్

ఆటలు
పాటలు
రంగులు జల్లుతూ ఆనందం దాటును కోటలు

–పి.శ్రీదేవి హైదరాబాద్

కలగలుపు
నేలగలుపు
సమాజం రంగులమయం – తెలుపుతో
షడ్వికారములను మంటగలుపు

–వి నాగమణి, హైదరాబాద్

కేళీ
డోలీ
దానవశక్తిపై బాలభక్తుడు సాధించిన జయనీ హోళీ

–వి.యస్.వి ప్రసాద్ ,యం.
తణుకు,ప గో జిల్లా

ఆమోదం
ప్రమోదం
హోళీ ఆటతో పర్యావరణానికి జరుగకూడదు ప్రమాదం.

–భమిడిపాటి వెంకటేశ్వర రావు,
హైదరాబాద్

ఆస్తికవాదం
నాస్తికవాదం
దైవత్వం మునుగులోని మూఢత్వాన్ని
ఎండగడుతున్న హేతువాదం

–కట్టెకోల చిన నరసయ్య, ఖమ్మం

కలువ
శిలువ
పూజించే స్వరూపం ఎక్కడున్నా
మానవజాతికే విలువ

–డాక్టర్ వైవీ సుబ్రహ్మణ్యం, హైదరాబాద్

యాగము,
యోగము,
శిలువపై మానవాళి పాపాలకు యేసు ప్రాణత్యాగము.

–వేము విజయ్ కుమార్, మనుబోలు నెల్లూరు జిల్లా

చేతన
కీర్తన
పాపులను రక్షించుటకై శిలువనెక్కిన పరిశుద్ధుని యాతన

–విన్నకోట ఫణీంద్ర, హైదరాబాదు

మేలు
వీలు
పదిమందికి సహాయం చేయాలనుకుంటే మార్గాలు పదివేలు

–ఆలేటి పరంజ్యోతి, ఖమ్మం

భక్తి
శక్తి
దేహం నుండి ఆత్మకు లభించు ముక్తి..

–పంతుల లలిత–(నీలాంజన),
విశాఖపట్నం

యేసుస్మరణం
పాపహరణం
మనుషుల పాపములకై ప్రభువు శిలువ మరణం

–కోటమహంతి వెంకటరావు(కోవెరా),
విశాఖపట్నం.

హోళీ
కేళి
చిత్రవర్ణాల ఆనందసరసిలో ఆహ్లాదంగా
విహరించే జనమరాళాలి

–సూర్యదేవర రవికుమార్, గుంటూరు

అంబరం
ఆడంబరం
సప్తవర్ణ సుశోభితమై సర్వత్రా హోళీ సంబరం

–సింగీతం విజయలక్ష్మి, చెన్నై

రంగులు
హంగులు
నీటి ఫిరంగులతో జాగ్రత్తగా వుండాలి ఆడంగులు!

–ఆచంటి శ్రీనివాసరావు , తెనాలి.

రంగు
హంగు
హోళీకేళిలో ఆనందం చెంగుచెంగున కలిగిస్తుందట భంగు.

–క్రొవ్విడి వెంకట బలరామమూర్తి,
హైదరాబాద్.

అలిసిపోతుంది
వెలిసిపోతుంది
రంగులద్దగా రారాదా బ్రతుకు వర్ణచిత్రం
వెలిగిపోతుంది

–జూపూడి హనుమంతరావు, హైదరాబాద్

హోళీ
కేళి
రంగుల పొంగుల యువత మ్రోగించెను కాహళి

–శ్యామకృష్ణ తెన్నేటి, హైదరాబాదు

శిలువ
విలువ
మానవోద్ధరణకై భారంమోసే మరియసుతుడు
పునీతమాయె
ఎర్రకలువ

–అచ్యుతుని రాజ్యశ్రీ , హైదరాబాద్

మరియతనయుడు
కరుణామయుడు
పాతకుల పాపాలను శిలువగా మోసిన సహృదయుడు

–గంగరాజు పద్మజ , మలకపేట, హైదరాబాద్

బాట
కోట
నిలిచింది, బలముగా నిరంతరం ఏసుప్రభువు మాట!

–కె.కె.తాయారు, మదనపల్లి

అస్తు
నమోస్తు
శిలువ వేయబడిన శుక్రవారం ఎనిశ్రీతినివ తిఎజీణవ
–దేవదూత క్రీస్తు

–డాక్టర్ కపిల లక్ష్మణరావు , పెంట్లం

స్వీకృతం
సుకృతం
సుఖమో దుఃఖమో అనుభవించే
కర్మలన్నీ స్వయంకృతం

–అర్చన కోవూరు,
హైదరాబాద్

నానీలు

– బొబ్బిలి జోసెఫ్
సెల్: 9989261991

అక్కడికి వెళ్ళాక
ఇక రారు
అదే జీవన గమ్యం
తిరుగులేని నిజం!

కలువలు
చందమామ కోసం
ఎదురు చూపులు
విరబూయాలని!

అందాలు ఒలికిస్తూ
సరాగాలు తీస్తూ
మధురమైనది
తెలుగు భాష!

మాలి గుబురులో
మనసు మురిపిస్తూ
వసంత రాగం
తీస్తోంది కోయిలమ్మ?

ఉద్యోగం ఒక్కటే
బ్రతుకు ఇవ్వదు
ఏ పనైనా
కూడు పెడ్తుంది.

పోగొట్టుకున్న చోటే
దొరుకుతుంది వస్తువు
కాని
దొరకదు విలువ!

ఉచిత పథకాలలో
కొట్టుకుపోతున్నాయి
ఉద్యోగుల
జీతాలు.

రాజకీయ నాయకునికి
అహంకారమా?
అయితే తప్పదు
ఓటమి మరి!

ఉలితో శిలకి
ఒళ్ళంతా గాయాలు
నేడు శిల్పమై
ప్రతినోటా గేయాలు

కష్టాలు
నీకేనని కుమిలిపోకు
రాతికి తప్పలేదు
ఉలి దెబ్బలు.

ప్రేమకు
భాషతో పనిలేదు
విశాల భావమే
దాని చిరునామా

–కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

పేద.... ధనిక

కథ

అనగనగా చంద్రపురం పాఠశాలలో రాము అనే అతను ఆరవ తరగతిలో చక్కగా చదువుతున్నాడు. అతనికి చదువులో పోటీగా భీమ్ ఉండేవాడు. భీమ్ ధనవంతుల కుటుంబంలో జన్మించాడు. రామ్ పేదరికంలో జన్మించాడు. పేదవాడివి పేదవాడివి అంటూ రామ్ ను తోటి విద్యార్థులు చులకనగా చూసేవారు.

ఒకరోజు పాఠశాలలో మంచినీళ్లు సరైన సమయానికి నల్లాల ద్వారా రావడం లేదు. పాఠశాలలో నీళ్లు లేవు. ఆరోజు భీమ్ నీళ్ల డబ్బా తెచ్చుకోలేదు. మధ్యాహ్న సమయంలో భీమ్ గబగబా అన్నం తింటుంటే, గట్టిగా వెక్కిళ్లు పడ్డది. భీమ్ కళ్ళలో నీళ్లు కారుతున్నాయి. ఎవరి దగ్గర నీళ్లు లేవు. రామ్ దబ్బున వెళ్లి తన వద్దనున్న నీళ్లు తాగిపించాడు. ఎప్పుడు పేదవాడివి, మీ దగ్గర డబ్బులు లేవు అంటూ రాముని దూరంగా ఉంచిన భీమ్ తన తప్పును తెలుసుకున్నాడు.

ఇద్దరి మధ్యన సంభాషణ గమనించిన మాస్టర్ విద్యార్థులందరినీ సమావేశపరిచి పేద ధనిక, కులం మతం అంటూ ఎలాంటి విషయాలు కూడా చిన్నారులు మాట్లాడుకోవద్దని, మనం ఎవరినైతే ఎక్కిరిస్తామో వారి కుటుంబంలో మనం జన్మిస్తే ఎలా ఉంటుందని ప్రశ్నించాడు. మాస్టర్ మాటలకు విద్యార్థులందరిలో మార్పు వచ్చింది. పేద ధనిక అనే పేద భావం లేకుండా, అందరూ కలిసిమెలిసి చదువుకోసాగారు.

–బర్ల నవదీప్
ఆరవ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
హవేలీ ఘనపూర్, మెదక్
9908809824

గతి తప్పిన హృదయతాళం

హృదయతాళం గతి తప్పుతుండట ఒక్కోసారి!
తాండముదిరితే ఊసరవిల్లి
హృదయస్పందననముదిరితే
హృదయతాళం గతితప్పడమే –

విషయం హృద్యంకావచ్చు
హృదయవిదారకం కావచ్చు,
అత్యుత్సాహం కావచ్చు, అలసటకావచ్చు
నవ్వితే ఆనంద భాష్పాలు,
ఏడిస్తే వేదన భాష్పాలు
అంతా హృదయస్పందనానంతరం
ప్రతిస్పందన అతిస్పందనైతే
అతిస్పందన గతితప్పే హృదయతాళానికితావు.

బాలారిష్టాలను దాటి
యవ్వనపూదోట సుమసౌరభాన్ని ఆఘ్రాణిస్తూ,
ఆమనిఅందాలను ఆరాధిస్తూ,
'హృదయమా ఓ బేలహృదయమా,
ఒకేసారిగా నీకింత సంతోషమా' అనిపాడుకుంటే
ఒకేసారి నీకింత సంక్షోభమా అనుకున్నా
గాలివినిరి కొడితే వంగి, వడలి,
వాలిపోయిన పూలమొక్కలు
రాలిపోయిన గులాబీలను చూస్తూ
గులాబీల గుబాళింపులేకాదు
గుచ్చుకొనే గులాభీముళ్ల
బాధలానంతర స్పందన.

బాధ్యతల భారాన్ని మోసే మధ్యవయస్సు
సత్ఫలితాలకు సంతోషిస్తూ
దుష్ఫలితాలకు దు:ఖిస్తూ
భరించే హృదయ స్పందనలు
"ఉరిపోసుకు చనిపోవడమో
సముద్రమున పడిపోడమో
సమస్యగా ఘనీభవించిన..."
సంసారికి సమస్యల అతిస్పందన

వృద్ధాప్యపు అతిస్పందనలానంతర
నలిగిన గుండెతాళం గతితప్పితే
తంత్రులు తెగిపోవడమే.

– వేదం సూర్యప్రకాశం
సెల్: 9866142006

కవిత్వమంటే...

హృదయ భాష
భావాలతాండవం
పదాల కేతనం
అక్షరాల ఉషస్సు
సృజనాత్మక తపస్సు.

బలహీనుని బలం
కన్నీటిని తుడిచే నేస్తం
ఆలోచనల తొలిమెట్టు
ఉద్యమాల ఊపిరి
కలల సాకారం.
కవిత్వం.

కదన రంగాన
కదిలే కరవాలం

కవిత్వ మంటే జీవభాష్యం
జీవితాలను పదును పెట్టుకునే
ఆకు రాయి
సమూహం గొంతుక
కోడి కంటే ముందే లేచిన
కాళ్లు చేతులే కవిత్వం.

పొద్దున వీపు చరిచి
నిద్ర లేపేదే కవిత్వం
మేల్కొల్పడం కవిత్వం

సగటు మనిషికి బాసట
భావవ్యక్తీకరణ సాధనం
రమణీయ భావాల సమాహారం
కవిత్వం .

స్వేచ్ఛ మంత్రపు
మహోజ్వల తంత్రం

దగా పడిన ఆర్త జనుల
పొలికేక

ధర్మ ఖడ్గపు మెరుపుల పోరు
గర్జించే గగనపు హోరు.

కవిత్వం
కదిలించి నడిపించే శక్తి
వేవేల సూర్యులను
మండించే తాపం.

శతకోటి వీరులకు
రూపునిచ్చే తేజం
చలించిన మనసుకేతనం

కలల సాకార ప్రయత్నం
జీవితం కవిత్వం వేరు కాదు
హృదయాన్ని చలింప చేసే
ఆర్థత కవిత్వం.
మానవత్వం మేల్కొల్పే
అక్షరం కవిత్వం .

చైతన్యం నింపే
సామర్థ్యం కవిత్వం.

ఓ ప్రేరణ , ఓలాలన, ఓ ఓదార్పు
ఓ ఆలంబన, ఓ చేతన ,కవిత్వం.

కవిత్వమంటే అక్షరాల
ఆత్మీయ కౌగిలి
భువిపై రాలే వెలుగుల జాబిలి.

-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1107వ రోజు 'సెలవు రోజు' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'సెలవు రోజు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

ఎవరికి? ఎందుకు?

ఎవరికి?
ఎందుకు?
రోజూ ఉద్యోగం చేసి
అలసిపోయే వారికి
రోజు బడికెళ్లి
చదివి మెదడు వేడెక్కే విద్యార్థులకు
పాఠాలు చెప్పి
అరచిన గొంతుకు ఊరట కొరకు
కానీ
సెలవు లేని అమ్మకు
రెండింతలు కాదు
నాలుగింతలు పని
దేనికి సెలవు?
ఎందుకు సెలవు?
వీచే గాలికి
పారే నదికి
తిరిగే సూర్యచంద్రులకు
అరిచే నోరుకు
సెలవేది?
ఆకలి మంటకు
కూటి ముంతకు సెలవేది?.
అలసి సొలసిన
దేహానికి కావాలి సెలవు
ఆలోచించే మెదడుకు
కావాలి సెలవు!!.
వారంలో ఒక రోజు
అప్పుడే చుట్టాలు ఊడిపడడం
విసుగు చెందిన రెక్కలకు
ఎగురలేని డొక్కలకు
బొక్కకోసం
బొక్కా బోర్లా పడుదు!!.
సెలవురోజు తృప్తిగా
ఇంటిల్లిపాది
సంతోషంగా గడపడానికి
నలుగురిని కలవడానికి
కాస్త విశ్రాంతికి
కావాలి సెలవురోజు
అవును కావాలి సెలవురోజు!.

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

ఆట పాటలు

ఉద్యోగ జీవితాన్ని తీర్చిదిద్ది
ఒక్క రోజు సెలవులో మనిషి
వర్ణనాతీత ఆనందం
పీల్చుకున్న హృదయ శ్వాస.
పిల్లలతో సరదాగా కాలక్షేపం
ఆటపాటలతో కాల గమనం
మనిషి జీవితంలో సెలవురోజు
ఎంత ముఖ్యమో గ్రహింపు.
ఉద్యోగ జీవితాన్ని హడావిడిగా
గడుపుతూ నిలిచి పోయినట్లు
ఆనందరూపమే నిలిచిపోయి
ఆహ్లాదకరమై ఉండిపోతుంది.
ఉదయాన్నే లేచే ఆమె
ఒకరోజు సెలవుతో కాసేపు
ఆలస్యంగా నిద్ర లేస్తే
మనసులో తెలియని హాయి.
పొద్దున్నుంచి రాత్రంతా పనిచేసి
ఆఫీసు వర్క్ తో అలసట
సెలవు దొరికితే ఆనందం.

- వి. సంధ్యారాణి

ఇల్లాలికూడా కావాలి

సెలవు రోజు
గడపాలి ఆనందంగా
కుటుంబ సభ్యులతో
ఆనందించాలి
ఆనందింప చెయ్యాలి
వార మంతా శ్రమిస్తే
వారాంతం సెలవు
ఆనందాల నెలవు
రెండో రోజు నుంచే
మళ్ళా ఎదురు చూపులు
పని నుంచి ఆట విడుపు
గృహిణికి సెలవేదీ
సెలవు రోజు పెరిగే
ఇంటి పని భారం
పనితో తలమునకలు
సెలవు రోజేమిటి స్పెషల్
అనే సతాయింపులు
తప్పవు ఆమెకి ఆగచాట్లు
ఉద్యోగికి వారంతపు సెలవు
పండగ సెలవు
వేసవి సెలవు లు
ఎన్నో రకాల సెలవులు
పాపం గృహిణికే
లేదు ఏ సెలవు.

-మోటూరి శాంతకుమారి

సెలవంటే?!!!

చేతినిండా పని ఉంటే
సెలవుకు శెలవే
మనసునిండా ముసురుకున్న
బాధల గాయాలుంటే సెలవెక్కడో!
ఇంటి నిట్టాడై నిలబడిన నాన్నకు
సకలం తానై సూర్యునిలా పనిచేసే
మా అవ్వకు సెలవనేదే నే చూడలే!
ఇరాం లేని ఎవుసం పనిలో
సినుకు కాలమైనా శిశిరమైనా
పండుగైనా విశ్రాంతే ఎరుగని
మా చిన్నన్నకు సెలవంటేనే తెల్వదు
నలుగురు కూడిన కాడ ఆగేది లేదు
నవ్వులాటలో పువ్వులా మోము చూడలే
పని పరుగులు పెట్టిస్తుంటే
సేను శెల్కా ఎద్దూ నాగలీ పిలుస్తుంటే
చేతిలో ముల్లుగర్రె
బలరాముని ఆయుధంలా
విడిచినదెపుడు?
మా ఊరి చెర్వుమత్తడికైనా
వానాకాలం తర్వాత
జలోచ్ఛ్వాసము వన్నె తగ్గేది
మా నాన్న సూరీడినే నిద్రలేపితే
చిన్నన్నయ్యేమో
చీకటి పడినాకే
ఇంటి కడప దాటేది
చేతినిండా పని ఉంటే
సెలవన్నదే
యాదికి రాదాయే
ఎవుసం లోగిలిలో
కలువలా పూసినోళ్ళకు
కునుకైనా రెప్పలపై వాలదాయే
ఎంత రాజనాల పంట
రాసులు పోసినా
కలిమాయ కొలిమిలో
కాలిపోయేది రైతే
చట్టం చెట్టునీడ దొరకనిది రైతులకే
నమ్ముకున్న భూమే
కబ్జాలకు గురౌతుంటే
కాళ్ళకు చక్రాలు కట్టుకుని
తిరుగుతుంది సామాన్య రైతే.
పురుగంటని
నాణ్యమైన విత్తనాలనిచ్చి
పంటలకు మద్దతు ధర అందించి
భూకబ్జాల చెరలాపితే
రైతులకు సెలవు దొరికినట్లే.

- ఏదెల్లి రాములు

సెలవు రోజు

ఆదివారం
చెదిరిపోయిన భాంధవ్యాలను
అదిమి పొదిగి ఉంచే వేళ
వొడల కలిగిన బడలికలను
సేదతీర్చి విశ్రమించే వేళ
కలిగిఉన్న భేధభావాలను
కడిగి తుడిచిపెట్టే వేళ
వదిలిపెట్టకు
ఆదివారపు సౌలభ్యం
వెతలనన్ని మూటగట్టి
చెత్తనంత తుడిచిపెట్టి
కుప్పతొట్టిలో పారవేసి
ఒప్పులన్ని చేరదీసి
మెప్పించు పనులనెన్నో
నెరవేర్చు తనివీతీర
జారవిడువకు ఆదివారం
ఇదే అపురూప సెలవు రోజు
సెలవు దినం జారిపోయిన
తిరిగి మరో ఆదివార ఆగమనం
కొరకు
మిగులు ఎదురుచూపులు.

- రాజప్ప

కాలాన్ని కరగదీసే కర్పూరం

వారపు చుట్టమా వందనం నీకిదే
వారిజాక్షిలా వచ్చి పలకరిస్తావు..
మరు మల్లెల పరిమళాలు నింపి
చిరు చామంతుల ఆనందాలు తెస్తావు.
ఎదురుచూపులలోనే ఆహ్లాదం
ఏమిచ్చినా ఎంతిచ్చినా సంతోషమే
వారమంతా నిరీక్షిస్తే తప్ప దొరకవు
వారధిలా నిలిచి ఉత్సాహాలు నింపి వెళ్తావు.
బద్ధకాలను దులిపి నిద్దుర లేపుతావు
ముగింపు పలకాల్సిన పనులను ముందుంచి
కాలమంతా కర్పూరంలా కరగదీస్తావు
కంటిమీద కునుకులేకుండా చేస్తావు.
కట్టుకున్న ఇల్లాలితో కనిపెంచిన పిల్లలతో
చిరు చిరు సంతోషాలను మూటగట్టి
మరోవారం పనుల్లో లీనమవడానికి
సహనశీలతల స్థిరత్వాలు సమకూరుస్తావు.
వేర్వేరు సంప్రదాయాలను వేలు పట్టి నడిపినా
ఉన్నత సనాతన సంప్రదాయపు
ఉనికిని పతనము చేయ దలిచిన తెల్లోడి
తెలివికి తలలూపిన ఆచార సంప్రదాయాలు.

- నగునూరి రాజన్న

తల ప్రాణం తోకకు

బాబోయ్ సెలవురోజు!
తలప్రాణం తోకకు
గృహిణికి ఒళ్ళు మంట
టైం టేబుల్ లాగా
రోజూ చకచకా పనులు, పరుగులు
ఇల్లంతా ప్రశాంతం.
పరీక్షల మధ్య సెలవులు
అమ్మా నాన్నలకు ప్రాణసంకటం
చదవరు, మాట వినరు
ముందు గొయ్యి- వెనుక నుయ్యి.
మిటమిట ఎండల్లో బిలబిలా
రాబందుల్లా బంధుమిత్రులు
అలివైపు వారైతే భార్య నోరు
ఆగని జలపాతాల హోరు
మగనివైపు వారైతే
గుండెదడ ఆయాసంతో ఆమె బేజారు
సెలవురోజు కూతురు, కోడలు
పిల్లల్ని తమకి అప్పగించి
కొద్దారు బైట షికార్లు
ఇదే వృద్ధదంపతుల గోడు
పైకి అమాటంటే
టపా మోస్తారు పిల్లకాయలు
సెలవురోజు
ముద్దు ముచ్చట లేదు
సభలు, సమావేశాలు అంటూ
ఈయన ఉడాయింపు
అని రచయిత కవి గారి
భార్య నిట్టూర్పులు.
ఎరక్కపోయి
ఉమెన్ లిబ్ నాయికను పెళ్లాడి
అఘోరిస్తున్నా
బస్సు ఫ్రీ అని
పిక్నిక్ షాపింగ్ తో జంపింగ్
అని పాపం భర్త గారు
దొరకునా ఇటువంటి సేవ అని
రాగమాలపిస్తూ
పనామె రానందుకు చింతిస్తూ
వాషింగ్ మెషిన్ మిక్సీతో కుస్తీ పట్లు.
తెలిసిందా నాచాకిరీ విలువ!
అని ముసిముసి నవ్వుల నాంచారిని
చూస్తూ
నోరు ఎత్తితే
చుట్టు ప్రక్కల వారికి కాలక్షేపం
అని తెల్సిన గృహస్థు
టి.వి.వాల్యూం పెంచి
బరబర అంట్లు తోమి
అయిపోయింది సెలవు
హూష్ కాకి ఎత్తుకెళ్లింది
అని సగటు జీవి రాత్రి పడకపై వాలు!
ఇదే కుటుంబాల్లో సెలవురోజు
పైగా శివరాత్రి ఉమెన్స్ డే
రెండో శనివారం ఆదివారం!
హారతి కర్పూరం లా కరిగి
ఉద్యోగి గుండె మరుగు!.

-ఎ.రాజ్యశ్రీ

తీరనికోరిక

అందరికీ సెలవు రోజు
ఎదురు చూసే మధుర క్షణం
చిన్నపిల్లలకు స్కూలు హాలిడే
ఆటపాటలకు వినోదం
ఆఫీసు వాళ్లకి
హాయిగా పడుకునే రోజు
ఉద్యోగం చేసే శ్రీమతులకు
ఆ రోజు తాపీగా
అన్ని పనులు చేయొచ్చనే ఆశ
అందరూ తాపీగా లేస్తారు
ఇంటి ఇల్లాళ్లకు పనులు లేటు
ఇంట్లోని వారందరి కోసమూ
నిరీక్షణ పనులు అయితే
ఆ రోజైనా కాసంత
రెస్టు కోసం ఆరాటం
ఓ ఆదివారమా!
నీవు ఎపుడెపుడొస్తావా అని
ఆనందాన్ని ఇస్తావనే ఆశతో
ఎదురుచూపులు
నీకు ఇది న్యాయమా
అనుకున్నంత సమయం ఉండవు
మెరిపించి
మెరుపుతీగలా కదులుతావు
నా కనుల ప్రమిదలో
దీపాలంకరణ చేసి
నీకై వేయి కన్నులతో
వేచి చూస్తాను
హాలిడే జాలీడే అందరికీ
కానీ నాకేదని ఇల్లాలి వేదన
ఆయన గారి ఫ్రెండ్స్
పిల్లలు ఇంట్లో ఉంటే
అవి కావాలి, ఇవి కావాలి అనే అల్లరి
సగం సగం పనులు చేస్తూ
ఇంటికి వచ్చిన వారికి
మర్యాదలు చేస్తూ
అలసి సొలసి
ఎప్పుడు రాత్రి అవుతుందా అని
నిద్రకి మంచం కనిపిస్తుందా అని తలిస్తే
బాకీ పడ్డ పిల్లల హోంవర్క్
కంటినిండా నిద్ర పోనివ్వదు
మురిపించి తికమక చేసి వెళ్ళిపోతావు
మళ్ళీ నీకై నిరీక్షణ
ఈసారి అయినా రెస్ట్ తీసుకోవాలి
ఇల్లాలి తీరని కోరిక
సెలవు రోజు ఇలావచ్చి
అలా కదిలిపోయింది
ఓ ఆదివారమా!
మళ్ళీ ఎప్పుడొస్తావ్?.

-ఆర్. రమాదేవి

ఆట విడుపు

రోజు వారీ పనికి సెలవంటూ సంబరం
విశ్రాంతికి రెక్కలొచ్చి విహంగ విహారం
స్వంత పనులకు కొంత సమయం సెలవేగా
వ్యవహారం వదిలేసి పడకేసిన చందం.
అన్వేషణలకు ఆహ్వానాలకు ఆటవిడుపు
విందులకు వినోదాలకు సమయ సారిణి
వారాంతమంటే హర్షాతిరేకాలకు ఆయువుపట్టు
కార్యదీక్ష కర్తవ్యపథానికి అడ్డంకిగా.
సెలవులున్నవారికి ఈ సెలవు ఎందుకని
సెలవులు లేనివారికి ఒక్కరోజైనా సెలవు కావాలని
పాఠశాలకు సెలవంటే చిన్నారులకు ఆనందం
లంచావతారాలకు ఇదో దుర్దినం.
ఉద్యోగస్తులకు వేతనజీవులకు కావాలి సెలవు
వాణిజ్య వేత్తలకు వ్యాపారస్థులకు సెలవెందుకని
ఆర్థిక చక్రబంధం ప్రశ్నించింది సెలవెందుకని
హార్దికాభినందన కోరుతుంది సెలవు.

- లక్ష్మారెడ్డి పసుల

ప్చ్.. సెలవు

అబ్బా.. సెలవు
బారెడు పొద్దుకు లేవాలి
తిన్నగా స్నానం చేయాలి
ఇష్టమైన వంట చేయించుకోవాలి
కమ్మగా పొందుగా తినాలి
టీవీ ముందు ఠీవీగా
ఇష్టమైన చిత్రం చూడాలి
అంతలోనే... అంతలోనే
ఏమండి..
కేకల ఘీంకారంలో
ఇంటావిడ గొంతు ఘాతంలో
టక్కున లేచి చూసే సరికి
సూర్యుడు తాపం
మా ఆవిడ కోపం ఒక్కటయ్యాయి
సెలవు రోజు మాట ఏమయ్యిందని
బజారుకెళ్లి సరుకులు తెస్తారని
బారెడు పొద్దు నిద్రకే పెడితివి
సరుకులు... తిరుగుడులు ఎప్పుడు
చేస్తావని?
అంతలోనే ఫోను రింగు రింగున మోత
దోస్తు ఫోను అని తెలిసి
కంగు తిన్నా
వాడు పెట్టిన రింగుటోను
'అనుభవించు రాజా'
అదివిన్న నేను
బోరున ఏడ్చి ఏడవక
ఎత్తిన ఫోను విన్నాక
బోరుమన్నా
బావురుమన్నా
అప్పు తీసుకున్న ఇంకో దోస్తు కోసం
నిలదీసి అడగటం కోసం
సెలవు కాబట్టి
వెళ్ళామనే
మళ్ళీ మోగిన ఫోను కూతకి
తెప్పరిల్లిన నా హృదయం
ఫోను ఎత్తగానే
అధికారి గంభీర స్వరం
పెండింగు పని సంగతేంటి అని
ఈరోజు గంట కేటాయించమని
కుదరదు అంటే
సమస్య ఎదుర్కోవాల్సి వస్తుందని
అయ్యో!
సెలవా నాకు
కలసి రాకపోతివా ఛీ
తందానా!
దేవ నందనానా!
సెలవా నా ఆశలు
అన్ని బడబాపితివా!
తందానా!
దేవ నందనానా!
తరికిట తోం తరి తా!
అంతా హరి గోవిందా!.

-జాలిగామ నరసింహారావు

ఎవరికి?

ఉద్యోగాలు చేసేవారికి
ఊళ్ళేలే వారికి
ఆకతాయి చిచ్చరపిడుగులకి
ఇల్లు పీకి పందిరి వేసే వారికి
పండగే.
సెలవు రోజు
భలే రంజయిన రోజు
వచ్చిందంటే
విచ్చలవిడి జీవనం
మితం లేని సంతోషం
పట్టలేం పిల్లలని పరుగులే.
ఒక్కరికి మాత్రం
యావత్ జీవిత కైంకర్యం
జీతం బత్తెం లేని ఉద్యోగం
సెలవు లేని బతుకు
సెలవు రోజు
ఉరుకులే ఉరుకులు.
అల్లర్లను సంబాళించు
ఆనందాలకు ఆయువుపట్టు
అందించు మహా విరివిగా
అదే అమ్మ కనువిందు
వింతలలో వింత సెలవు రోజు
ప్రపంచంలోని బాధలన్నీ
పెరిగిపోతాయి ఆరోజే
ఎన్నో కష్టాలు అప్పుడే.
కొంతలో కొంత సర్దుకోండి
అందుకోండి ఆనందాలు
పంచుకోండి అందరితో
ఇదే వినోదాల విందు !.

-కె.కె.తాయారు

ధిక్కార స్వరానికి ప్రతీక "గద్దెనెక్కినంక"

పాలమూరు యువకవి కె.పి..లక్ష్మీనరసింహ రచించిన " గద్దెనెక్కినంక " దీర్ఘ కవిత ధిక్కార స్వరానికి ప్రతీక అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పాలమూరు సాహితి, పాలమూరు యువకవుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 17 న మహబూబ్ నగర్ పట్టణ కేంద్రంలో గల లుంబిని హైస్కూలులో " గద్దెనెక్కినంక " పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ఆవిష్కర్తగా విచ్చేసిన ప్రముఖ కవి వల్లభాపురం జనార్ధన మాట్లాడుతూ లక్ష్మీనరసింహ రచించిన "గద్దెనెక్కినంక" పుస్తకంలో కవి మనువు సృష్టించిన చాతుర్వర్ణ వ్యవస్థలోని లోపాలను ఆవిష్కరిస్తూ రచన చేశారన్నారు. వచన కవిత నుంచి దీర్ఘ కవితలోకి అరంగేట్రం చేసిన లక్ష్మీనరసింహను అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ లక్ష్మీనరసింహ కవిత్వం సమకాలీనతను ప్రతిబింబిస్తుందన్నారు. సమాజంలోని రుగ్మతలను అంశాలుగా తీసుకుని రచనలు చెయ్యడం అభినందించదగ్గ విషయమన్నారు. కాలంతో పాటు నడుస్తున్న కవియని ప్రశంసించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన కె. లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని కొందరు భ్రష్టుపట్టించడం దురదృష్టకరమన్నారు. సమసమాజాన్ని కాంక్షించిన అంబేద్కర్ ఆలోచన విధానాన్ని కొందరు భ్రష్టుపట్టిస్తున్నారన్నారు. మరొక అతిథి డా. పరిమళ్ మాట్లాడుతూ లక్ష్మీనరసింహ కవిత్వంలో ఆవేదన, ఆక్రోశం కనిపిస్తుందన్నారు. సమాజంలో మనుషులు కుల, మతపరంగా విభజన రేఖలు గీసుకుని జీవిస్తుండటం దురదృష్టకరమన్నారు. సమాజంలో మనుషులంతా ఒకటేననే భావనను వ్యక్తపరిచారు. పుస్తక సమీక్ష చేసిన విఠలాపురం పుష్పలత మాట్లాడుతూ మనువు సృష్టించిన చాతుర్వర్ణ వ్యవస్థలో ఇంకా బతుకుతున్నామన్నారు. నేటి కంప్యూటర్ యుగంలోనూ మనుషులు మారలేకపోవడం సమాజ దైన్యాన్ని తెలియజేస్తుందన్నారు. గ్రంథ స్వీకర్త, ప్రముఖ న్యాయవాది బెక్కెం జనార్ధన్ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలోనూ ఇంకా మనుషులు కుల, మత చట్రంలో బతుకుతుండడం బాధేస్తుందన్నారు. మూడు శాతంలేని వారే ప్రజాస్వామ్యాన్ని పరిపాలిస్తుండడం శోచనీయమన్నారు. కార్యక్రమ సమన్వయకర్త, యువకవి బోల యాదయ్య మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ కవిత్వంలో ప్రధానంగా గాఢత కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నగంటి ప్రభాకర్, ఖాజా మైనోద్దీన్, పులి జమున, కె.ఎ.ఎల్. సత్యవతి, రావూరి వనజ, గుడిపల్లి నిరంజన్, వహీద్ ఖాన్, ఎదిరేపల్లి కాశన్న, ముచ్చర్ల దినకర్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక
నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు

అడ్మిన్: **రమాదేవి కులకర్ణి**
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

కవి మానస పుత్రిక

కవితా! తానొక పదాలకూర్పేకాదు
మానవతా మహిమాన్వితా..
కవి మదిలో వికసించిన భావ సుమాలకు
అక్షర గుణింతాల దారంతో..
పదబంధాల పరిమళ మరువాన్ని జోడిస్తూ
అందమైన అక్షరమాలికలు అల్లిస్తూ,
కవితా సుందరి పేరుతో పురుడు పోసుకునే
కవి మానసపుత్రిక..!.
అందమైన అక్షర శిల్పానికి ఆభరణమై
భావచిత్రాల మణులను మనోఫలకం పై
మెరిపిస్తూ..
ఊహాలోకాల్లో విహరింపచేస్తూ..
ఎత్తుగడలతో మనసులను
గమ్మత్తుగా చిత్తు చేస్తుంటుంది
వాట్సప్,ఫేస్బుక్లో
నిత్యసూర్యునిలా వెలుగుతుంది..
అందరూ రాయగలరనే
స్థైర్యాన్ని పెంచింది..!!
శీర్షికల శిరీష పుష్పాల పరిమళ
గుబాళింపులో మైమరపిస్తూ..
నర్మగర్భిత నయగారాలతో
క్లుప్తతా,గోప్యతా,సరళతల
సంస్కారాలు కలిగి..
భావగణాల వయ్యారాలతో
వడివడిగా అడుగులేస్తూ మురిపిస్తుంది.!!
అనేక సమాజ వాదాలకు
సామరస్యతలు పంచుతూ..
పాఠకులందరి మనసుదోచేసి
స్నేహితగా మెలుగుతూ..
పాలకులకు మెరుపుల చరుపులందించే
కవితల కొరడా ఝుళిపిస్తూ..
కవిత అంటే ఏమిటి?? అన్నవారికి
తన ప్రతాపాన్ని చూపిస్తుంది..!!
అక్షర బాకుతో అరాచకపు రక్కసి మూకల
గుండెలను అరంగుళానికి కోసేసి..
పట్టపగలే చుక్కలు మొలిపించి నరకం
చూపించి..
తానొక అసామాన్య శక్తిగా
సమాజపు కంట్లో కన్నీళ్ళు తుడిచి
ఆప్యాయతలు పంచుతుంది..
మానవతా వాదిగా..మమత పంచి
సమసమాజ నిర్మాణానికి సమిధగా
నిలుస్తుంది..!!
సావిత్రి రంజోల్కర్ నవీమొంబై

కవిత్వం

తీయటి రుచినందించే మకరందం
సుగంధాలు వెదజల్లే హరిచందనం
మదిలో మాట బయటపెట్టే మధురస్వరం
అదే సిరిసిరి మువ్వల కవిత్వం...
మనసు పలికే మౌనగీతం
మనసు దోచే మురళి గానం
మచ్చలేని చంద్రుడికి ప్రతి రూపం
అదే సిరిసిరి మువ్వల కవిత్వం...
మనిషిలోని సంపూర్ణ జ్ఞానం
మనమంతా ఏకమనే భావం
మహిలోన గొప్పదైన గుణం
అదే సిరిసిరి మువ్వల కవిత్వం...
అక్షరంలా మొదలైన ఆయుధం
ధర్మానికి నిలువైన నిదర్శనం
పిల్లల స్వచ్ఛతకు వర్ణం
అదే సిరిసిరి మువ్వల కవిత్వం...

-వలిపే రామ్ చేతన్(బాలకవి)
9502156813

నా కవిత

మనసు అన్వేషణ
మది సాగారాన అలల్లా
ఎగిసే భావ తరంగిణులు
మనసులో తీయని వేదన
ఎదలో చెలరేగే ఆవేదన
అనుభవాల అనుభూతికి
అక్షర రమ్యత కూర్చడం!!.
సాగర గర్భాల లోతు
జయించినట్లు...
ఎదుటివారి మనసును
అక్షర బాణాలతో గెలవడం
అభ్యుదయ భావాలతో
అడుగిడి విప్లవాన్ని కోరి
భావాలజల్లు కురిపిస్తూ
ప్రేమానురాలు పంచేది!!
చీకటైన హృదయంలో
వెన్నెల కురిపించే శశి
అలవోకగా అల్లడంకాదు
ఆవేదనలో నివేదనలా
ఆకలిలో కేకలా
ఆరాధనలో గీతికలా
ఆలోచనలే అక్షరీకరించి
కవిత్వంలా కవ్వించేది
కవిత నా కవిత

..సహజ

కవిత అంటే

మదిలోని భావఝరి
విద్యుల్లతలా మెరిసి
అలవోకల ఆనందమందిస్తూ
కలం నుండి జాలువారే
సేలయేటి గలగలలు.
ఉబుసుపోక కబుర్లకు
ఉత్తేజమందిస్తూ
నవరసాల సొగసులతో
నాట్యమాడిస్తూ
అందాల రవళిలా
అందంగా అందుకున్న
పొదరిల్లులా
అక్షరలక్షలతో
అల్లుకునే ఆనంద సందడి.
చిరుగాలి సవ్వడిలా
పూతేనియల పుప్పొడిలా
ఝుంకార నాదాల
తుమ్మెదలా
విరుల వానలా కురుస్తూ
మోహనాలందించే
మోహన గీతిక కవిత

-బండారి సుజాత

ఆహ్వానం

కవిసంధ్య

కవిసంధ్య సాహితీ సాంస్కృతిక సంస్థ యానాం.
భాషా సాంస్కృతిక శాఖ - హైదరాబాద్ సంయుక్త నిర్వహణలో...

ప్రపంచ కవితా దినోత్సవం - 2024

కవిసంధ్య, డా॥ భట్టిప్రోలు దుర్గాలక్ష్మీ ప్రసన్న
కవితల పోటీ బహుమతుల ప్రదానం

కవిత్వంపై ప్రసంగం

కవిసంధ్య పత్రిక, కవిత్వ గ్రంథావిష్కరణలు

కవిసమ్మేళనం

24 మార్చి, 2023, ఆదివారం, సా॥ 5:30 గం॥లకు
నంబూరి పరిపూర్ణ వేదిక
కాన్ఫరెన్స్ హాలు,
రవీంద్రభారతి, హైదరాబాద్.

దాట్ల దేవదానం రాజు — కన్వీనర్, కవితల పోటీ
శిఖామణి, — అధ్యక్షులు, కవి సంధ్య

ముఖ్యఅతిథి : శ్రీ కె.శివారెడ్డి, సరస్వతీ సమ్మాన్ అవార్డుగ్రహీత
సభాధ్యక్షులు : కళారత్న డా॥శిఖామణి, కవిసంధ్య సంపాదకులు
గౌరవ అతిథి : శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు, ప్రముఖ కవి, విమర్శకుడు
విశ్రాంత ఐ.ఏ.ఎస్ అధికారి
సభా ప్రారంభకులు : డా. మామిడి హరికృష్ణ,
డైరెక్టర్, భాషా సాంస్కృతిక శాఖ
ప్రత్యేక ప్రసంగం : శ్రీ కొప్పర్తి వెంకట రమణ మూర్తి
అంశం : కవిత్వం - పారదర్శకత
కవితల పోటీ నివేదిక : కళైమామణి దాట్ల దేవదానంరాజు
ప్రా.శ్రీ.తెలుగు విశ్వవిద్యాలయ కీర్తిపురస్కార గ్రహీత
న్యాయ నిర్ణేత స్పందన :
శ్రీ యార్లగడ్డ రాఘవేంద్రరావు, ప్రముఖ కవి, పాత్రికేయులు
కవిసంధ్య 47 ఆవిష్కర్త : శ్రీమతి శీలాసుభద్రాదేవి, ప్రముఖ కవి, రచయిత్రి
ఆత్మీయ అతిథులు :
శ్రీ సుధామ, ప్రముఖ కవి, విమర్శకులు
శ్రీ డానియేల్ నెజర్స్
ప్రముఖ ఫ్రెంచి భాషా పరిశోధకులు, అనువాదకులు
శ్రీ బి.ఎస్.ఆర్.ఆంజనేయశర్మ (బహుమతుల ప్రదాత)
శ్రీ మధునాపంతుల సత్యనారాయణ మూర్తి
ఆంధ్రీ కుటీరం, పల్లిపాలెం.

కవిసమ్మేళనం..

నిర్వహణ : శ్రీ సి.ఎస్.రాంబాబు, ప్రముఖ కవి, రేడియో ప్రయోక్త
స్వాగతం: శ్రీ చల్లా రామఫణి, ప్రముఖ కవి

గ్రంథావిష్కరణలు :

అవధానుల మణిబాబు
నింగికి దూరంగా నేలకు దగ్గరగా
ఆవిష్కర్త : శ్రీ కొప్పర్తి

పొత్తూరి సీతారామరాజు,
ఖాళీ సీసాలో మనిషి
ఆవిష్కర్త : శ్రీ యార్లగడ్డ రాఘవేంద్రరావు

శ్రీనివాస్ వాసుదేవ్ :
జాతర
ఆవిష్కర్త : శ్రీ కె.శివారెడ్డి

నక్క
గాజా సంఘీభావ కవిత్వం
సంకలన కర్త : శ్రీ నేలపూరి రత్నాజీ
ఆవిష్కర్త : డా॥ మామిడి హరికృష్ణ

కవిసంధ్య, డా॥ భట్టిప్రోలు దుర్గా లక్ష్మీ ప్రసన్న
స్మారక వచన కవితల పోటీ బహుమతి గ్రహీతలు - 2024

ప్రథమ బహుమతి : రూ. 3000/-
యుద్ధలిపి - ఆవాల శారద, విజయవాడ,
ద్వితీయ బహుమతి : రూ. 2000/-
ఒంటరిరేవు - చొక్కర తాతారావు, విశాఖపట్నం,
తృతీయ బహుమతి : రూ.1000/-
దుఃఖ పాలెం - నేలపూరి రత్నాజీ, చాగల్లు,
కన్సొలేషన్ బహుమతులు: ఒక్కొక్కటి రూ. 500/-
1. ఫొటో - దేశరాజు,హైదరాబాద్,
2. యుద్ధము- నేల, కుందుర్తి కవిత, సింగపూర్
3. ఇనపపెట్టె - రాజేశ్వరరావు లేదాళ్ల, లక్కెట్టి పేట,
4. కాటికాపరి - లోగీశ లక్ష్మీనాయుడు, సింహాచలం,
5. చెమట పటిమ - కె. దాసుబాబు, శ్రీ కాకుళం,
6. ఋతు నిష్క్రమణ - దాసరి మోహన్, హైదరాబాద్,
7. కొన్ని కన్నీళ్లు మిగిలే వున్నాయి - పొత్తూరి సీతారామరాజు, కాకినాడ,

మహిళా ప్రముఖులకు పురస్కారాలు

సత్యవాణిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

గీతా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయ గానసభలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఉత్తమ మహిళా శిరోమణి పురస్కారాన్ని ప్రముఖ గాయని ఆమని తదితరులకు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సిరికొండ మధుసూదనాచారి, ఆధ్యాత్మికవేత్త జి. సత్యవాణిని సన్మానించారు. సంస్థ సభ్యులు గీత, విజయలక్ష్మి, కోలేటి దామోదర్‌గుప్తా, దైవజ్ఞశర్మ, డా॥జయంతిరెడ్డి, సుధారాణి, బేబి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై యువత పోరాటం చేయాలి

సభలో మాట్లాడుతున్న పాశం యాదగిరి

యువతీ, యువకులు స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో అవినీతిపై పోరాటం చేయాలని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో షాహిద్ భగత్‌సింగ్ స్మారక యువజనోత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర యువజన శాఖ సహకారంతో యువకవి-గాయకుల సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మారేది ప్రభుత్వాలు తప్ప పాలన కాదన్నారు. సునీల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి జయరాజు, డివైఎఫ్‌ఐ నాయకులు కె. విజయ్‌కుమార్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com